# గీతోపనిషత్


(శ్రీమద్భగవద్గీత 9వ అధ్యాయము - రాజవిద్యా రాజగుహ్య యోగము)


మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ ప్రచురణలు















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 9వ అధ్యాయము - రాజవిద్యా రాజగుహ్య యోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2019 - ఉత్తర విషువత్పుణ్య దినము
(పరమగురువుల ఆశ్రమము, కొడనాడు, నీలగిరులు)

ప్రతులు : 1,000

© ధనిష్ఠ - 2019

వెల : రూ॥ **80-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-94-4

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్, విశాఖపట్నం.

ఫోన్ : 0891-2796538, 984 999 6538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# భగవద్గీతా హృదయము

భగవద్గీత- యోగవిద్య బ్రహ్మవిద్య ఉపనిషత్తుల సారము. యిందు తెలుపబడిన భక్తి జ్ఞాన వైరాగ్యములు సమగ్రము, పరిపూర్ణము. తామరతంపరగ, అలవిమాలిన అడవిగ పెరిగిన భగవద్ వాఙ్మయము సరళముగ, సూటిగ అర్థమగురీతిలో మానవజాతి నుద్దేశించి కృష్ణ ద్వైపాయన మహర్షి శ్రీకృష్ణుని మూలముగా ప్రసాదించెను. క్షుణ్ణముగ భగవద్గీత పఠించు వారికి ఆచరణాత్మక ముగా భగవద్గీత గోచరించును. అట్టి ఆచరణ మార్గమున సర్వము క్రమముగ విదిత మగును. సర్వజ్ఞత్వము కూడ లభించును. సత్య దర్శనమునకు భగవద్గీత కరదీపికగ శాశ్వతముగ నిలచియున్నది. భగవద్గీత నాశ్రయించి ఆచరణాత్మకముగా జీవించు మానవునకు మరి ఏ గ్రంథము పఠింప నవసరము లేదు. ఇది సత్యము.

సమస్త వాఙ్మయసారము భగవద్గీతకాగ, గీతాసార మంతయు ఈ తొమ్మిదవ అధ్యాయమగు “రాజవిద్యా – రాజగుహ్య యోగము” నందు అమర్చబడినది. ఈ అధ్యాయము భగవద్గీతా హృదయము. యిందు జీవేశ్వర సంబంధము నిర్దిష్టముగ తెలుపబడినది. దైవము యొక్క యోగ మహేశ్వరత్వము తెలుపబడినది. ఆత్మ – పరమాత్మ సంబంధము, అవినాభావ సంబంధము విశదముగ తెలుపబడినది. శ్రద్ధాభక్తులు, త్రికరణశుద్ధి, అనసూయత్వము, ఈశ్వర శరణాగతి

యిత్యాది ఉపాయములు వివరింపబడినవి. రాజ రహస్యమగు ఈ రాజవిద్య పొందుటకు వలసిన క్రమశిక్షణ ముందు అధ్యాయము లందు కూడ విశేషముగ వివరింపబడినది.

క్రమము, సమగ్రము అగు ముక్తికి భగవద్గీతను మించిన గ్రంథము లేదు. పరిణామక్రమమున మానవుడు భగవద్గీతను స్పృశించ వలసినదే. భగవత్ స్పర్శను అందించు ఈ పవిత్ర గ్రంథము సమస్త లోకములందును పూజనీయమై, మార్గదర్శకమై వున్నది. భగద్గీతను చదువనివాడు చదువనివాడే! 'అ'కారము నుండి 'క్ష'కారము వరకు గల వాఙ్మయ మంతయు యిందిమిడి యున్నది.

ఈ రచనకు ప్రేరణ నిచ్చిన సోదరులు, చిరంజీవి బి. సత్యనారాయణ రాజునకు నా కృతజ్ఞతలు. అతడిచ్చిన ప్రేరణ దైవ శాసనముగా భావించి, జిజ్ఞాసువులకు దీనిని సమర్పణ గావించు చున్నాను. ముద్రించిన ధనిష్ఠ కార్యవర్గమునకు నా శుభాకాంక్షలు!

శ్రీవిళంబి – రథ సప్తమి
విశాఖపట్నం.

**కె.పార్వతీకుమార్**

# రాజవిద్య - రాజగుహ్యము

**మా**స్టర్ పార్వతీకుమార్‌గారు భగవద్గీత 9వ అధ్యాయమైన "రాజవిద్య – రాజగుహ్య" యోగానికి వివరణ సోదాహరణంగా, ఎంతో సులువుగా అర్థమయ్యేరీతిలో అందించారు. రాజవిద్య – రాజగుహ్యం అనే అధ్యాయంలో దీనిని అభ్యసించడానికి కావలసిన ప్రధాన అర్హతలు భగవానుడు రెండింటిని తెల్పెను. 1. అనసూయత్వము, 2. శ్రద్ధ. మాస్టరుగారు వీటిని చాలా చక్కగా వివరించారు. అన్నీ ఉన్నప్పటికీ అసూయగాని వదలకపోతే అతనికి ఉన్న విద్యలన్నీ తల లేని మొండెం లాంటిది అని తెల్పారు. ఎన్ని విద్యలున్నా నిష్ప్రయోజనమే. అలా శ్రద్ధ విషయంలో కూడా ఎంతో వివరణ యిచ్చారు. శ్రద్ధ ఉన్నప్పుడే కర్తవ్యం గోచరిస్తుంది. శ్రద్ధ ఉన్నచోటే ధర్మము స్ఫురిస్తుంది. శ్రద్ధ వలన తను చేయవలసిన పని గోచరించి, చేయకూడని పనులలో చిక్కుపడని ఒక మార్గం గోచరిస్తుంది. స్వామి వివేకానందులవారు భారతజాతిని ఉద్దేశించి యిచ్చిన ఉపన్యాసంలో "భారతీయులకు లేనివి ఈ రెండే" అని చెప్పారు. మన జాతీయులకు చాలా విషయ పరిజ్ఞానం తెలిసినప్పటికీ ఇంచుమించుగా అందరూ అసూయాగ్రస్తులే. మనకు శ్రద్ధ కూడా అంతంత మాత్రమే. ఏ పనిని సక్రమంగా రెండు రోజులు చేయడం ఉండదు. అందుకే మన పెద్దలు ద్వితీయ విఘ్నం ఉండరాదని చెప్పారు. కనీసం రెండవ రోజైనా మానకుండా

ఆచరిస్తారని. శ్రద్ధ, అనసూయత్వం అనేవి ఎంత ముఖ్యమో మాస్టరు గారు చాలా చక్కగా చెప్పి, సాధకులకు ఒక చెక్ లిస్ట్‌ను తెలియ జెప్పారు.

రాజవిద్య రాజగుహ్యము యొక్క వివరణ వాటి లోతులను స్పృశించి వానిలోగల అద్భుతమైన విషయములను నిత్యనూతనంగా మునుపెన్నడూ ఎక్కడా కనివిని ఎరుగని రీతిలో మాస్టరుగారు వివరించారు. వీరు వృత్తిరీత్యా ఛార్టెడ్ అకౌంటెంట్ కావడం వల్ల పదాల ఎంపిక, వాటి కూర్పు తూకం వేసినట్లు ఒకటి ఎక్కువగాని, ఒకటి తక్కువగాని లేకుండా సరిసమానంగా ఉండేటట్లు వ్రాస్తుంటారు. "శాశ్వతుడనని తెలిపే విద్య శ్రేష్ఠవిద్య కాబట్టి అది రాజవిద్య" అని నిర్వచించారు. రజోగుణ దోషముచే జీవులు అనేకానేక విద్యలు నేర్చినను సత్యమును తెలియకపోవుట వలన శాశ్వతులుగా ఉండలేరు. వారు శాశ్వతులు కానప్పుడు వారి విద్యలుగూడా వారితోనే అంతరించి పోవును అని చక్కగా వివరించారు. ఇది రాజ రహస్యమని చెప్పారు. ఎందుకంటే తెలిసినను మరుగున పడేది, మర్చిపోయేది రాజరహస్యం. తెలుపకుండా దాచిపెట్టేది రహస్యం. తెలిపినను రహస్యమైపోవుట వలన ఇది రాజ రహస్యమని అన్నారు.

భగవద్గీత మొత్తం సారాంశమును ఈ అధ్యాయమునందు ఆవిష్కరించారు. యించుమించుగా రాజవిద్య రాజగుహ్య యోగంతో భగవద్గీత యొక్క బోధన అంతా అయిపోతుంది. ఇది 9వ అధ్యాయం. ఇకపైన ఉన్న అధ్యాయాలలో యిందులో తెలిపిన రాజవిద్యను ఏ విధంగా అభ్యాసం చేయాలో, అది ఏ విధంగా అనుభూతిలోకి

తెచ్చుకోవాలో తెలిపే వివరాలే ఉంటాయి. భగవద్గీత మార్గమును మాస్టరుగారు చాలా చక్కగా వివరించారు. 21వ శ్లోకానికి యిచ్చిన వివరణలో "భగవద్గీత మార్గము శ్రేయస్సును ఉద్దేశించి కర్తవ్యమును ఆచరించుటయే యున్నదిగాని పుణ్యమును, భోగమును ఆశించుట బోధింపబడలేదు. కర్తవ్యము నందే జీవునికి అధికారము ఉన్నదిగాని ఫలమునందు లేదని దైవము స్పష్టముగా తెల్పెను. కామ్యకర్మ ప్రోత్సహింపబడలేదు. కర్తవ్యకర్మ నిర్దేశింపబడింది. కర్తవ్యకర్మనే స్వధర్మమని, కార్యం కర్మయని భగవానుడు పేర్కొన్నాడు. కర్తవ్యా చరణమునందే శ్రేయస్సు ఉన్నది. ఫలములను ఆశ్రయింపక కర్తవ్యములనే నిర్వర్తించమని భగవానుడు నిర్దిష్టముగా తెలిపినాడు. వాడే జనన మరణ చక్రము నుండి విముక్తుడై ధర్మపథమునందు శాశ్వతుడై జీవించును" అని చక్కగా గీతా సారాంశం వివరించారు.

వీటితో పాటు మాస్టరుగారు అనేక సాధనా రహస్యాలను ఈ అధ్యాయమునందు తెలిపారు. ప్రకృతి విలాసం, వాని వివరణలు తెలిపారు. భక్తిశ్రద్ధలు అనగా త్రికరణశుద్ధియే అని నిర్ధారించారు. లౌక్యము, తెలివితేటలున్న వారికన్నా త్రికరణశుద్ధి గలవారే దైవానికి ప్రీతిపాత్రులు అని తెలియజేశారు. అవిధ పూర్వకమైనా త్రికరణ శుద్ధితో ఆరాధిస్తే 'నన్నే' చేరతారని చెప్తూ కాళిదాసు, వాల్మీకాదుల గురించి తెలియజేశారు. ఈశ్వరార్పణము, సన్యాసము మొదలగు విషయములను సాధకులకు కావలసిన విధంగా వివరించారు. భావన యందు, బాహ్యమునందు, లోపల బయటా అనునిత్యం ఈశ్వరుని దర్శించుటయే రాజవిద్యగా వివరించారు. "ఏ జీవికైనా తనను

గూర్చిన భావన మెండుగా ఉన్నప్పుడు దైవమును చేరుటకు తానే అడ్డంకి” అని, సాధకునికి లోపం ఎక్కడుందో తెలియపర్చారు. మనసు దైవమును భావించుట నిజమగు మననము. బయట కనపడుచున్నది దైవమే అని భావించుట కూడా మననమే అని చెప్పి, యిట్లు లోపల బయటా దైవమునే భావించుట అభ్యసించినపుడు మనసునకు ప్రశాంతత చిక్కునని, అలాంటి మనసుతో పరిసరాల్లో జీవుల రూపములో నున్న ఈశ్వరుని సేవించుటవలన మనసున పట్టు చిక్కునని, ఎలాంటి ఆరాధన చేసిననూ ఈశ్వరుని ఉద్దేశించి చేయుచుండుట వలన భావము ఈశ్వరమయ మగునని చాలా చక్కగా వివరించారు.

మాస్టరుగారు ఒక వినూత్నమైన రీతిలో ప్రతీ అధ్యాయమునకు వ్యాఖ్యానాన్ని అందించారు. ప్రతీ అధ్యాయం దానికదే పూర్ణము అనే విధంగా వివరించారు. మిగిలిన 9 అధ్యాయములను కూడా అదే విధమైన వ్యాఖ్యానాలతో వివరిస్తారని, భక్తులను తరింపజేస్తారని హృదయపూర్వకంగా విన్నవించుకుంటున్నాను.

*మాస్టర్ పార్వతీకుమార్‌గారి పాదపద్మములకు నమస్కరిస్తూ.....*

తేది 22-2-2019
ముంబాయి

**బి. సత్యనారాయణరాజు**
జాయింట్ కమిషనర్
ఇన్‌కమ్‌టాక్స్

# రాజగుహ్యము

శ్రీమద్భగవద్గీత ప్రపంచ వాఙ్మయమందే శిరోధార్యమైన సందేశము.

పరబ్రహ్మమే భగవానుడుగా దిగివచ్చి తన నుండి దిగివచ్చిన జీవులకు (నరులకు) తనను చేరుకొను మార్గమును సూటిగా, సోదాహరణముగా, సంపూర్ణముగా అందచేసిన మహోన్నత సందేశము అర్జునుడు, వ్యాసభగవానుడు కారణముగా ప్రపంచమునకు అందజేయబడినది.

శ్రీమద్భగవద్గీతకు ప్రపంచమున గురుస్థాన మలంకరించిన అనేకులు వ్యాఖ్యానములు, వివరణములు అందజేసిరి. "శ్రీ గీతోపనిషత్" పేరిట మాస్టర్ పార్వతీకుమార్‌గారు అందించుచున్న వివరణ అత్యంత అవగాహనాత్మకముగా వుండుట విశేషము. భగవద్గీత అధ్యాయములలో వున్న అనుక్రమణము యొక్క ప్రాశస్త్యము, వివరణము సాధకునకు సాధనాపరముగా, సరళముగా అందించబడినది. అవగాహనకు క్లిష్టమైన విషయములు అతి సులభముగా అందించబడినవి. భగవద్గీతను ఆచరించుటకు ఒక చక్కని బాట గమ్యము చేరువరకు ఏర్పరుచుట ఈ ప్రణాళిక పరమోద్దేశ్యముగా గోచరించును. నిత్య దినచర్యలో వర్తించు అన్ని సన్నివేశములలో

అను నిత్యము "తత్త్వము"ను గుర్తుచేయు విధముగా ఈ గ్రంథమున వివరింపబడినది.

ఎన్ని పర్యాయములు భగవదస్తిత్వమును (సర్వాంతర్యామిని) తెలియజేసినను అనునిత్యము మరచిపోవుట వలననే ఈ విషయము రాజరహస్యమైనదని మాస్టరుగారి భాష్యము విశేషమై నిలచినది.

భగవద్గీతలోని ఒక్కొక్క అధ్యాయమున అందజేయబడిన విజ్ఞాన వివరణా విధానమును అవగాహన చేసుకొనుటకు అవసరమైన తాళపు చెవులు అందజేయబడినవి.

"రాజవిద్యా - రాజగుహ్యాము" అతి విశిష్టమైన విషయము మరియు గీతాహృదయము. మాస్టరుగారు ప్రత్యక్షముగా భగవ తత్త్వమును అనుభవించి, సాధనచేసి వివరణముగా అందించిరనుట నిస్సందేహము. ఒక్కమాటలో చెప్పవలెనన్న జీవుడు పరబ్రహ్మమును చేరుటకు సూటియైన మార్గము యిందు మాస్టర్ పార్వతీకుమార్‌గారు సవివరముగా అందించుట మన బృందముయొక్క అదృష్టము.

శ్రీ విళంబి - మాఘ పౌర్ణమి
తేది 19-2-2019
విశాఖపట్నం.

సోదరుడు
**నవనీతం**
ధనిష్ఠ

# విషయసూచిక

| | | | |
|---|---|---|---|
| 1 | అనసూయత్వము | ....... | 17 |
| 2 | రాజ రహస్యము | ....... | 20 |
| 3 | చక్ర వ్యూహము | ....... | 24 |
| 4 | చిదాకాశము | ....... | 27 |
| 5 | యోగమహిమ | ....... | 30 |
| 6 | రాజవిద్య | ....... | 32 |
| 7 | ఈశ్వర ప్రణిధానము | ....... | 35 |
| 8 | ప్రకృతి మాయ | ....... | 38 |
| 9 | సాక్షీభూతుడు | ....... | 41 |
| 10 | ఈశ్వర సన్నిధానము | ....... | 45 |
| 11 | దైవానుగ్రహము | ....... | 47 |
| 12 | కర్తవ్యకర్మ | ....... | 50 |
| 13 | ఈశ్వర తత్త్వము | ....... | 54 |
| 14 | మహాత్ములు | ....... | 58 |
| 15 | తత్త్వ మొక్కటే ! | ....... | 62 |
| 16 | సమస్తమును నేనే! | ....... | 66 |

| | | | |
|---|---|---|---|
| 17 | ప్రణవ స్వరూపుడు | ....... | 69 |
| 18 | పరతత్త్వము | ....... | 74 |
| 19 | ద్వంద్వ స్థితులు | ....... | 79 |
| 20 | కోరికలు | ....... | 83 |
| 21 | జనన మరణ చక్రము | ....... | 87 |
| 22 | అభియుక్తుడు | ....... | 91 |
| 23 | త్రికరణశుద్ధి | ....... | 96 |
| 24 | తత్త్వదర్శనము | ....... | 100 |
| 25 | పరమపదము | ....... | 104 |
| 26 | భక్తి శ్రద్ధలు | ....... | 108 |
| 27 | ఈశ్వరార్పణము | ....... | 113 |
| 28 | సన్యాస యోగము | ....... | 117 |
| 29 | అతీతస్థితి | ....... | 121 |
| 30 | శ్రద్ధాభక్తులు | ....... | 125 |
| 31 | అనన్యభక్తి | ....... | 129 |
| 32 | తత్త్వదర్శనులు | ....... | 133 |
| 33 | కూడి యుండుట | ....... | 137 |
| 34 | జీవేశ్వర సంబంధము | ....... | 142 |

# 1

# అనసూయత్వము

**ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే ।**
**జ్ఞానం విజ్ఞానసహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ 1**

*తాత్పర్యము :* అత్యంత గుహ్యము, జ్ఞానవిజ్ఞాన సహితము అగు విషయమును అసూయ లేనివాడ వగుటచే నీకు పరిపూర్ణముగను, స్పష్టముగను తెలుపుచున్నాను. దీనిని తెలియుట వలన అశుభము నుండి మోక్షము పొందెదవు.

*వివరణము :* పరమాత్మ జీవుల పుణ్యవశాత్తు, పూర్ణముగ రూపు కట్టుకొనుటవలన శ్రీకృష్ణుడుగ గోచరించినాడు. పరిపూర్ణ జ్ఞానము తానే స్వయముగ బోధించినాడు. ఏడ(7)వ అధ్యాయమున సృష్టింపబడిన జగత్తు నందు దైవమును చూచు విధానమంతయు తెలిపినాడు. ఎనిమిద(8)వ అధ్యాయమున అట్టి జగత్తున కాధారమైన, అక్షరము - పరము - బ్రహ్మము అయిన తత్త్వమును ఎట్లు పొందవలెనో స్పష్టముగ తెలిపినాడు. బహిరంగ అంతరంగములందు దైవముతో ఎట్లు యోగము చెందవచ్చునో తెలిపియున్నాడు. అనగా విజ్ఞానము, జ్ఞానము లేక బహిరంగము

అంతరంగమందలి దైవమును తెలియు విధానమును తెలిపినాడు. లోపల, వెలుపల వశించియున్న దైవమును సమన్వయించి, దానిని మూలమును, ఏకత్వమును తెలియబరచుట ప్రారంభించి నాడు. ఈ రెండింటి సమన్వయము అత్యంత గుహ్యము. కనుకనే గుహ్యతమము అను పదము వాడబడినది. అట్టి విషయమును తెలియవలె నన్నచో శ్రోత శ్రద్ధ, భక్తి, దీక్ష, ఏకాగ్రత, అప్రమత్తత, ఆర్ద్రత ఇత్యాది సద్గుణములతోపాటు, అసూయ లేనివాడై యుండ వలెను.

అసూయ ఉన్న హృదయమునందు జ్ఞాన విజ్ఞానములు నిలువవు. జ్ఞాన విజ్ఞానములే లేనపుడు వాని సమన్వయ మెట్లు నిలువగలదు? అసూయ లేకుండుటను అనసూయత్వమందురు. సద్గుణములలో అనసూయత్వము పర్వత శిఖర అగ్రము వంటిది. పర్వతమంత సద్గుణము లున్నను అనసూయత్వము లేనిచో శిఖరములేని పర్వతమువలే మొండిగ, అసంపూర్ణముగ నుండును. శిరస్సులేని మానవునివలే అనసూయత్వములేని సద్గుణములకు విలువ లేదు. అనసూయత్వము లేనిచో అత్యంత రహస్యమగు సత్యమును దర్శింపలేరు. అనసూయత్వము గలవాడే సత్యమున ప్రవేశింప గలడు. అట్టివాడే లోపల వెలుపలగల సత్యమును దర్శింప గలడు. అట్లు అంతట సత్యమును దర్శించువాడే అశుభము నుండి తరించినవాడగును. అదియే మోక్షస్థితి. శుభా శుభములు ద్వంద్వములు. శుభముల యందును అశుభముల

యందును, విద్య యందును అవిద్య యందును, జ్ఞానము నందును అజ్ఞానము నందును, వెలుగునందును చీకటి యందును, పూర్ణిమ యందును అమావాస్య యందును- ఇట్లన్నింటియందును గల సత్యమును అన్నివేళల దర్శించువానిని పై తెలిపిన అశుభములు స్పృశింపవు. అతడే ఈ జగత్తున తరించిన వాడై యుండును.

ఈ మొదటి శ్లోకమున సత్యము అత్యంత నిగూఢమని, అది జ్ఞానవిజ్ఞాన సమన్వయమై యున్నదని, దానిని తెలియుటకు అనసూయత్వము ఆవశ్యకమని, దానిని తెలియుటచేత మాత్రమే మోక్షస్థితి సిద్ధించునని తెలుపబడినది.

## ②

## రాజ రహస్యము

**రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్ ॥ 2**

*తాత్పర్యము :* శాశ్వతము, అవ్యయము, అక్షరము, సమస్తమున కతీతము అగు సత్యము లేక బ్రహ్మమును తెలియ జేయు విద్య విద్యలలో ఉత్తమోత్తమమైనది. కనుక అది రాజ విద్య. ఈ రాజవిద్య రహస్యములలోకూడ ఉత్తమోత్తమ రహస్యము. ఇది అత్యంత పవిత్రము. ప్రత్యక్షముగ దీనిని తెలియవచ్చును. ఇది తెలిసినవాడు సహజముగనే ధర్మమున వర్తించును. ద్వంద్వా తీతమగు సుఖము ననుభవించును. కనుక దీని ననుష్ఠించుట కర్తవ్యమై యున్నది.

*వివరణము :* లోకమున అనేకానేకమగు విద్యలున్నవి. అట్టి విద్యలెన్ని నేర్చినను అట్టివారు సత్యవంతునితో సరిపోలరు. సత్యమెరిగిన వాని వద్ద సమస్త సృష్టి మిత్రత్వము వహించి యుండును. అట్టివాని నెవ్వరును జయింపలేరు. వశిష్ఠ విశ్వా మిత్రుల ఉపాఖ్యానమే దీనికి ఉదాహరణము. రజస్ తమో

గుణముల దోషముచేత జీవు లనేకానేక విద్యలు నేర్తురు. కాని వారు సత్యము తెలియకపోవుట చేత శాశ్వతులుగ నుండలేరు. వారే శాశ్వతులు కానపుడు, వారి విద్యలు కూడ వారితోనే పోవును. కనుక తాను శాశ్వతుడనని తెలియజేయు విద్య అత్యంత శ్రేష్ఠమైన విద్య. కనుక దానిని రాజవిద్య అనిరి. అది అత్యంత పవిత్రము, ఉత్తమ విద్యలకన్న ఉత్తమము.

పై తెలిపిన రాజవిద్య రాజగుహ్యమని భగవానుడు పలికి నాడు. అనగా రహస్యము లన్నిటి కన్న గూఢమగు రహస్యమని అర్థము. రహస్యమనగా మరుగుగ నుండునది. రాజుల రహస్య ములు కూడ తెలియనగును. కాని ఈ రహస్యము విచిత్రమగు రహస్యము. దీనిని మరుగున నుంచ నవసరము లేదు. దీనిని బాహాటముగ తెలిపినను, మరుక్షణమే రహస్యమైపోవును. తెలుప కుండునది రహస్యము. తెలిపినను మరుగున పడునది, మర్చి పోవునది నిజమగు రాజ రహస్యము. ఎన్నిమార్లు తెలిపినను మరల రహస్యమై పోవుచుండును. అదెట్లనిన "నీవు చూచు జీవియందు, ప్రకృతి యందు ఈశ్వరుడున్నాడు. అందరి హృదయము లందు ఈశ్వరుడున్నాడు. కనుక ఈశ్వరుని దర్శించు" అని ఎన్నిమార్లు తెలిపినను సాధకులు జీవులను ప్రకృతినే చూతురుగాని, అందలి ఈశ్వరుని చూడరు. చూచుట మరతురు. "అన్నము బ్రహ్మ"మని తెలిపినను అన్నమునే చూతురు. బ్రహ్మమును చూడరు. "అంతయు బ్రహ్మమే" అని తెలిపినను బ్రహ్మము తప్ప ఇతరము చూతురు.

"నేను కాని దేమియు లేదు" అని ఎన్నిమార్లు తెలిపినను అన్యమును చూతురుగాని అనన్యత్వమును దర్శింపరు. విచిత్ర మేమనగ ఎన్నిమార్లు జ్ఞప్తి చేసినను మరుక్షణమే రహస్యమై పోవును. తెలుపకుండుట వలన రహస్యమునకు తావున్నది. తెలిపినను రహస్యమై పోవుట అత్యాశ్చర్యము కదా! కనుక భగవానుడు దీనిని నిజమగు రాజరహస్య మనిరి.

విచిత్ర మేమనగ సత్యమును ప్రత్యక్షముగ తెలియవచ్చును. చూచునది, వినునది, రుచి చూచినది, వాసన చూచినది జీవుడు తాను అనుకొనును. కాని తనయందలి ఈశ్వరు డాధారముగ చూచుట, వినుట, రుచిచూచుట ఇత్యాదివి అనుభవించు చున్నాడు. తనయందలి సత్యమాధారముగనే ప్రత్యక్షానుభవము కలుగుచుండును. జీవునిలో శివుడున్నప్పుడే జీవుని కన్ని అనుభవ ములు. శివుడే లేనిచో శవమే మిగులును. శవమున కెట్టి అనుభూతియు లేదు. అట్లే చూడబడు సమస్త జీవులయందు, ప్రకృతి యందు సత్యముండును. సత్యమే శివము, సుందరము. జీవులు ప్రకృతి యందలి రూపము, రంగు, గుణము సత్యము వలననే ప్రకాశించు చున్నారు. కనుక సూటిగ సత్యమును చూడ వచ్చును. తనయందు, తన పరిసరముల యందు సూటిగ సత్యమును చూడవచ్చును. పై విధానముగ సత్యమును సూటిగ లోపల బయట చూడవచ్చును గనుక ఇది ప్రత్యక్ష అవగతమని భగవానుడు సెలవిచ్చినాడు.

ఇట్లు తనయందు, సమస్తమునందు సత్యమును దర్శించువాడు సహజముగనే ధర్మము నందుండును. అధర్మము దరిచేరదు. ప్రత్యేకించి ప్రయత్నించి ధర్మము లభ్యసించవలసిన అవసరముండదు.

మరియు ఇట్టివాడు అన్ని కాలముల యందు, దేశముల యందు సుఖముగనే యుండును. ఈ నిరంతర సుఖ స్థితినుండి అతడవస్థితి చెందడు. ఈ అనుష్ఠానము కూడ సుఖముగనే యుండును.

కనుక దీని ననుష్ఠించుట ఉత్తమము. ఇట్లు నిత్యము తన లోపల, తన వెలుపల సత్యమునే దర్శించు ప్రయత్నమున వుండు సాధకునకు ఇతర సాధనలు అనావశ్యకము. కేవలము సంప్రదాయబద్ధులై అనేకానేక సాధనలు ఆత్మసాక్షాత్కారము కొరకు మానవులు యుగముల తరబడి చేయుచు నున్నారేగాని అవి యన్నియు రాజవిద్యవలె సూటిగ నుండవు. ఆ సాధనల యందు సుళువుండదు. సుఖముకూడ ఉండదు. దీని నుపాసించుటకు వలసినది నిజమగు ధైర్యము.

## ③

# చక్ర వ్యూహము

అశ్రద్దధానాః పురుషా ధర్మ స్యాస్య పరంతప ।
అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥ 3

*తాత్పర్యము :* ధర్మమునందు శ్రద్ధలేని పురుషులు నన్ను పొందలేరు. అట్టివారు మృత్యువే పర్యవసానమగు సంసారము నందు వర్తించుచు నుందురు.

*వివరణము :* చేసిన పనులే చేయుచు, చివరికి మరణించుచు, మరల పుట్టుచు, మరల అవే పనులు చేయుచు, మరల మరణించుచు వర్తులాకారముగ తీరుబడి లేక జన్మ లెత్తు చున్నటువంటి మానవులు అనేక సంఖ్యాకు లున్నారు. అందుకే మానవ చరిత్ర యందు పూర్వము జరిగిన ఘట్టములే మరల మరల జరుగుచు నుండును. బలవంతులు బలహీనులను కొల్ల గొట్టుట, దురాక్రమణములు చేయుట, యుద్ధములు చేయుట, ఒకరినొకరు చంపుకొనుట, దోచుకొనుట నేటికిని కొనసాగుచునే యున్నది. ఇట్టి చక్రవ్యూహమునబడి జన్మముల తరబడి అవే పనులు చేయుచు తిరుగాడు దీనస్థితిలో మానవజాతి యున్నది.

పురోగతి లేదు. రంగుల రాట్నమెక్కిన వానికి ఎంత సమయము దానిపై తిరిగినను తల తిరుగుటయే గాని పురోగమన ముండదు. తినినవే తినుచు, మాటాడినవే మాటాడుచు, వినినవే వినుచు, చూచినవే చూచుచు, పుట్టిన చోటనే పుట్టుచు యుండుటకు కారణము తన ధర్మము తనకు తెలియకపోవుటయే.

తన ధర్మము తనకు తెలియవలెను. దానిని స్వధర్మ మందురు. తన ధర్మము తనకు తెలియనిచో నశించుట తప్పదు. పరధర్మ మాచరించినచో పతనము అధోగతికి దారితీయును. తన ధర్మము తనకు తెలియనివారే మనుజుల యందు మెండు. ధర్మము తెలియుటకు ప్రధానముగ శ్రద్ధ అవసరము. శ్రద్ధలేని వానికి కనీసమగు వివేకము కూడ యుండదు. శ్రద్ధ కలుగుటకు కర్తవ్యము ప్రధానమగు సాధనము. తానిపుడు ఏమి చేయవలెను? అను ప్రశ్న మనసున ఎపుడును ధరించి యుండవలెను. అట్లు కాక తనకేమి కావలయును అని మనసున ప్రధానముగ ధరించి నచో కాముకుడగును. తనకేమి కావలయును అనునది పతనము నకు దారి. తానేమి చేయవలెను అనునది పురోగమనమునకు దారి. తనకామె(సీత) కావలయును అని తెలిసినవాడు రావణుడు. తన కర్తవ్యము తెలిసినవాడు రాముడు.

కర్తవ్య మున్నచోట శ్రద్ధ యుండును. శ్రద్ధ యున్నచోట ధర్మము స్ఫురించును. రామునికి ధర్మము స్ఫురించినట్లు

సమకాలికముగ మరెవ్వరికిని ధర్మము స్పృజించలేదు. కర్తవ్యము నశ్రద్ధ చేసినచో లక్ష్యము గతి తప్పును. లక్ష్యము గతి తప్పినచో సంసార చక్రమున బంధింపబడును. ఆ చక్రమున జనన మరణ ములు అశేషముగ నుండును. అట్టివారు "నన్ను" అనగా సత్యమును పొందలేరు అనుటలో ఆశ్చర్య మేమున్నది!

④

## చిదాకాశము

**మయాతత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥ 4**

*తాత్పర్యము :* ఈ సమస్త ప్రపంచము అవ్యక్త రూపుడగు నాచే వ్యాపింపబడినది. సమస్త భూతములు నా యందే యున్నవి. వాని యందు నేను అవస్థితి చెందను. నేను నేనుగనే యుందును.

*వివరణము :* ఒక అద్భుతము, గంభీరము అగు సత్యము భగవాను డిచట ఆవిష్కరించుచున్నాడు. తానాధారముగనే సమస్త ప్రపంచము, జీవులు ఏర్పడియున్నారు. అవి యన్నియు తన యందే యున్నవి. అయినప్పటికిని తానట్లే చిదాకాశమై యున్నాడే కాని, వానియందున్నానను భావము తనకు లేదు.

వెండితెరపై అనేకమగు రూపములు ఏర్పడుచుండును. కొండలు, గుట్టలు, సెలయేళ్ళు, వాయువు, అగ్ని, జలము, మట్టి కనబడుచుండును. అట్లే ఖనిజములు, వృక్షములు, జంతువులు, మానవులు, గ్రహగోళాదులు, తారకలు తెరపై కనిపించును. అవి

యన్నియు తెర ఆధారముగనే అట్లు గోచరించుచున్నవి. వెండి తెర లేనిచో గోచరింపవు. వాటన్నిటికిని వెండితెరయే ఆధారము. కాని వెండితెరకు అవి ఏవియు ప్రభావము చూపలేవు. వెండితెరపై కొండ వెండితెరకు బరువుగ నుండదు. నీరు తడిగ నుండదు. అగ్ని తెరను మండింపదు. అట్లే తెరపై గోచరించుచున్న ఏ జీవియు తెరపై ప్రభావము చూపలేవు. కాని తెరపై వెలుగుచున్న సమస్త జగత్తు, భూతములు తెర ఆధారముగనే అస్థిత్వము కలిగి యున్నవి. తెరలేనిచో అవి ఏమియును లేవు. తెరకు నిజమునకు వాని అవస్థలతో పనిలేదు. తాను తానుగనే యుండును. తెర వెలిగియున్నపుడు చిదాకాశమై యుండును. అపుడే బొమ్మల కథ (సృష్టి కథ). తెర వెలుగకున్నచో పరాకాశమై యుండును. అపుడే కథయు లేదు. తానే యుండును. నా కవస్థితి లేదు అని భగవానుడు పలుకుటలో తానెప్పుడును, ఎట్టిమార్పు చెందనివాడని తెలియ జేయుచున్నాడు. మార్పును చెందునవి జీవులు, సృష్టి మాత్రమే.

*మరియొక ఉదాహరణము :* బంగారముతో ఉంగరము చేయించినపుడు, ఉంగరముగ గోచరించునది బంగారమే. బంగారము లేనిదే ఉంగరము లేదు. ఉంగరమందు కూడ బంగారము బంగారముగనే యుండును గాని ఉంగరభావము బంగారమున కుండదు.

*మరియొక ఉదాహరణము :* సముద్రమున అలలు గోచ

రించును. అలల యందున్నది సముద్రమే. సముద్రము అల యందు కూడ సముద్రముగనే యుండును. అవస్థితి అలకేగాని సముద్రమునకు గాదు.

*మరియొక ఉదాహరణము :* మన యందలి ఈశ్వరుడు ఎప్పుడును ఈశ్వరుడుగనే యున్నాడు. అతడాధారముగ మన మనేకమగు వర్తనములు సలుపుచున్నాము. మనయందీశ్వరుడు లేనిచో మనము లేము. అతడాధారముగనే మనయందు సమస్త వ్యాపారము జరుగుచున్నది. జాగ్రదవస్థ, నిద్రావస్థ, స్వప్న అవస్థ మనకున్నవిగాని, మనయందలి ఈశ్వరునకు లేవు. ఈశ్వరుడు సర్వత్ర ఈశ్వరుడుగనే యుండును. జీవుల అవస్థలు ఈశ్వరునిపై ప్రభావము చూపవు. మనము తురీయ అవస్థ పొందగలిగినచో ఈశ్వరుని అనవస్థిత్వము తెలియును.

## 5

# యోగమహిమ

న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగ మైశ్వరమ్ ।
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5

*తాత్పర్యము :* నా యోగ ఐశ్వర్యమును చూడుము. ఆ యోగ మహిమనందే సమస్త ప్రాణికోట్లును భరింప బడి యున్నవి. ఉత్పన్న మొనర్చుట, ప్రాణికోట్ల యందుండుట ఇత్యాదివన్నియు ఆ మహిమనుండియే జరుగుచున్నవి. అవి యన్నియు నాయందే యున్నప్పటికిని వానియందు నేనున్నానను భావన నాకు లేదు.

*వివరణము :* ముందు తెలిపిన శ్లోకమునకు మరికొంత వివరణమే యిచట యున్నది.

ముందు తెలిపిన ఉదాహరణలలో వెండితెరకు సినిమా లేదు. సినిమాకు మాత్రము వెండితెర యున్నది. బంగారమునకు ఉంగరము లేదు. కాని ఉంగరమునకు బంగార మున్నది. సముద్రమునకు అల లేదు. కాని అలకు సముద్ర మున్నది. ఈశ్వరునకు జీవుడు లేడు. కాని జీవున కీశ్వరుడున్నాడు. ఈ

వాక్యములను ధ్యానించుటయే మార్గము కాని వివరించుట మార్గము కానేరదు.

*అయినప్పటికిని మరియొక ఉదాహరణము :* గోదావరి నదిలో ఒక చెంబు ముంచినచో చెంబులో గోదావరి యున్నట్లు వుండును. చెంబులో గోదావరి, చెంబు ఉపరితలముపై ప్రవహించు గోదావరికి తేడా లేదు. చెంబులో గోదావరి వంటగదిలో పెట్టు కొన్నచో మడినీళ్ళగును. బిందెలో పోసుకొని త్రాగినపుడు మంచి నీరగును. నిజమునకు అది గోదావరి జలమే. దానికి చెంబులో ఉండుట, బిందెలో ఉండుట తేడా లేదు. ప్రాణికోట్లన్నియు పాత్రలవంటివి. అందుండెడి ప్రాణ మొక్కటియే. ఇట్లు ఒకే తత్త్వము యొక్క యోగ మహిమచేత అనేకముగ అది గోచరించుచు నున్నది. నిజమున కున్నది ఒకే ఒక మహాచైతన్యము. అది తన యోగమహిమచే అనేకముగ గోచరించు చున్నది. అనేకమగుటకు అవస్థితు లేర్పడుచున్నవి. రూపాంతరములు చెందుచున్నవి. ఎన్ని విధములుగ గోచరించినను వాటన్నిటికిని మూలమొక్కటే. ఆవిరి నీరై, నీరు మంచుగడ్డ అయినపుడు అందలి మూలమొక్కటే. మూలము దర్శించువానికి దానిపై ఏర్పడి, మార్పు చెందుచున్న సమస్తము మహిమాన్వితముగ గోచరించును. ఈశ్వరుని యోగ మహిమను దర్శించుచు ఆనందించుము. మూలమును దర్శించు టయే రాజవిద్య. అది గుహ్యతమము. ఎప్పటికప్పుడు మరపు సహజముగ వచ్చును. మరచినపుడెల్ల గుర్తు తెచ్చుకొనుటయే మార్గము.

⑥

# రాజవిద్య

**యథా౽౽కాశస్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీ త్యుపధారయ ॥ 6**

*తాత్పర్యము :* ఏ ప్రకారముగ అంతటను చరించు వాయువు ఆకాశమునందు స్థితిగొని యున్నదో, అట్లే సమస్త ప్రాణులును నాయందు స్థితిగొని యున్నవి అని తెలుసుకొనుము.

*వివరణము :* ఆకాశము నుండి వాయువేర్పడి అంతటను సంచరించు చున్నది. అందుండి పుట్టిన అగ్ని పోషించుట, దహించుట నిర్వర్తించుచున్నది. అగ్నినుండి పుట్టిన నీరు భూమిపై ప్రాణికోట్లను పోషించుచు నున్నది. జలములనుండి పుట్టిన భూమి ఓషధులను, ఇతర దినుసులను, కూరలు పండ్లు ఫలములు వంటి వానిని ఉత్పత్తి చేసి జీవ పోషణమునకు వినియోగపడు చున్నది. ఇట్లు ఆకాశమునుండి వరుస క్రమమున పుట్టిన నాలుగు భూతములు సృష్టియందు నిమగ్నమై యున్నవి. ఆకాశము వాటికి అతీతముగ నున్నది. ఆకాశము స్థిరము, నిత్యముగ నున్నది. అందుండి పుట్టిన వానికి అస్థిరత్వము, క్షరత్వము ఉన్నవి.

ఆకాశమెప్పుడును ఆకాశముగనే యున్నది. దానికవస్థితి లేదు. ఒకే విధముగ వెలుగుచు నుండును. కాని మిగిలిన నాలుగు భూతములకు అనంతమగు వ్యాపారము లున్నవి.

అట్లే నేను ఆధారముగ ఏర్పడిన సమస్త ప్రాణికోట్లకు కదలిక యున్నది. క్షరత్వమున్నది. అవస్థితులు ఉన్నవి. ఆకాశమునకు వాయువు ఆదిగా గల నాలుగు భూతముల కార్యక్రమముతో ఎట్టి సంబంధము లేదు. కాని ఆకాశము లేనిదే వానికస్థిత్వము లేదు, వ్యాపారమును లేదు. అట్లే నేనాధారముగ నేర్పడిన ప్రాణి కోట్ల హెచ్చుతగ్గులతో, ఒడుదొడుకులతో నాకెట్టి సంబంధము లేదు.

నీ యందు నేను ఈశ్వరుడనై యుండుట వలన నీ చేష్టలు, నీ ప్రాణస్పందనలు నడుచు చున్నవి. నేను లేనిచో నీవు లేవు. నీ చేష్టలతో నాకు పని లేదు. ఆకాశము నుండి వాయు వేర్పడినట్లు, నానుండి నీవేర్పడినావు. వాయువు నుండి ఇతర భూతము లేర్పడి నట్లు, నీ నుండి నీ బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, శరీరము ఏర్పడినవి. వాటన్నిటికిని నీవు మూలము. నేను నీకు మూలము. నీ యందలి నన్ను ఎరుగుటకు ప్రయత్నింపుము. నన్ను చేరిన నీకు నీ గుణదోషము లంటవు. ఆకాశము చేరిన వాయువునకు "కదలిక" అను గుణదోషము ఉండదు. నన్ను చేరి, నాతో కూడిన నిన్ను గుణదోషము లంటవు. సర్వము స్థిరమై పరమగు శాంతి లభించును.

నీ యందున్న నేను, నీయందు మాత్రమే లేను. అందరి యందును యున్నాను. అంతట నిండి యున్నాను. నిజమునకు నాయందు నీవుండుట వలన, నీయందు నేను లభ్యమగు చున్నాను. నన్ను నీవు చేరి, కూడి యున్నప్పుడు నీవు నరుడగు చున్నావు. అనగా నశింపని వాని వగుచున్నావు. అట్లు కూడి యుండనపుడు మానవుడ వగుచున్నావు. అనగా మనస్సు ప్రధాన ముగ జీవించువాడవు అగుచున్నావు. అనగా చంచలత్వము పొందుచున్నావు. వాయువు, అగ్ని, జలము, పదార్థము ఎల్లప్పుడును మార్పునకు గురియగు చుండును. అట్లే నీవు, నీ బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, శరీరము ఎప్పుడును మార్పునకు వశమై యుండును. మార్పు మరణము. మరణమునకు జననము, జననమునకు మరణము బొమ్మ - బొరుసులవలె, వెలుగు - నీడలవలె తారుమారగు చుండును. అట్టి స్థితి నుండి బయల్పడు టకు నీయందు అందుబాటులో నున్న నన్ను తెలుసుకొని నాతో సంయోగము చెందుము. నీయందున్న నన్ను నీవు గ్రహించుటయే రాజగుహ్యము నెరుగుట. నీయందున్న 'నా'తో యోగము చెందు టయే రాజవిద్య.

7

# ఈశ్వర ప్రణిధానము

**సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ ।**
**కల్పక్షయే పున స్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్ ॥ 7**

*తాత్పర్యము :* ప్రళయ కాలమున ప్రాణికోట్లన్నియు నా ప్రకృతిని చేరును. నా ప్రకృతి నన్నుచేరి హృదయమున నుండును. మరల నా ప్రకృతి నా హృదయమునుండి వెలువడి ప్రాణికోట్లను వెలువరించును.

*వివరణము :* ఇచ్చట దైవము స్వతః సిద్ధమగు తన స్థితిని ఆవిష్కరించు చున్నాడు. సమస్త సృష్టికిని కర్తృత్వము ప్రకృతిదే అని, తాను కర్త కాదని తెలుపుచున్నాడు. తాను కర్తృత్వమునకు ఆవల శాశ్వతుడుగ ఎట్టి స్థితి మార్పులు లేక అక్షరముగ నుండు బ్రహ్మమని, తన నుండి ఏర్పడిన ప్రకృతియే ఇచ్ఛా జ్ఞాన క్రియలుగ రూపాంతరము చెంది, సమస్తమును సృష్టించి, పెంచి, పోషించి మరల వెనుకకు తిరోగమనము చెంది తనను చేరుచున్నదని, తాను కేవలము ప్రకృతికాధారముగ నున్న వాడేకాని, తానేమియు చేయుట లేదని తెలుపుచున్నాడు.

పరమాత్మ తానుగ ఎల్లప్పుడును ఉన్నవాడు. అతని సహజ లక్షణము శాశ్వతమగు ఉనికి. తననుండి ఉద్భవించు ప్రకృతియే సమస్తమును నిర్వహించుచుండును. తన నుండి బలముగొని, అనేకానేక విధములుగ సృష్టి నిర్మాణము చేయును. ప్రాణికోట్లు పుట్టుట, పెరుగుట, పోషింపబడుట, వృద్ధి చెందుట, తిరోగ మించుట, తనలోనికి కలిసిపోవుట ఇత్యాది కృత్యములన్నియు ప్రకృతి చేష్టలే. ప్రాణికోట్లన్నిటికిని ప్రకృతియే మూలము. ప్రకృతికి తాను మూలము. తననుండి పుట్టిన ప్రకృతినుండి పుట్టిన ప్రాణి కోట్లకు ప్రకృతియే స్వామి. ప్రకృతికి తాను స్వామి. తాను ప్రకృతికి ఆవలివాడు. జీవులు ప్రకృతికి ఈవలివారు. జీవులు ప్రకృతికి లోబడి యుందురు. తాను ప్రకృతికి మూలమగుటచే ప్రకృతికి లోబడియుండువాడు కాదు. జీవులు తన్నాశ్రయించినచో ప్రకృతిని దాటుటకు వీలుపడును. ప్రతి జీవుడును తన ప్రకృతిని తాను దాటుటకు, తనయందున్న ఈశ్వరుని శాశ్వతముగ ఆశ్రయించ వలెను. ఈశ్వర ప్రణిధానముననే జీవుడు తనదైన ప్రకృతిని దాట గలడు. సర్వప్రకృతికిని స్వామియే ఈశ్వరుడై యుండుటచే, ఈశ్వరు నాశ్రయించుట, ఈశ్వర శరణాగతి జొచ్చుట, ఈశ్వరునితో ఎల్లప్పుడు కూడియుండుట ఉపాయమని తెలియవలెను.

చేతల యందున్నంత కాలము ప్రకృతి యందున్నట్లే, చేతలకు మూలమగు ఉనికి యందున్నపుడు స్వభావవశమున యుండక దైవవశమై యుండును.

జీవుడు తానే కర్తయని భావించుచుండును. నిజమునకు తనయందలి ప్రకృతియే తనను నడిపించు కర్త. తన స్వాధీనము నందు లేని తన ప్రకృతిని తానెట్లు దాటగలడు? తన ప్రకృతి బలవత్తరముగ తనచే పనులు చేయించు చుండును. అనగూడని మాటలనుట, వినగూడనివి వినుట, చేయగూడనివి చేయుట, తినగూడనివి తినుట- ఇట్లెన్నో విధములుగ జీవుడు అవశుడై యుండును. ఎంత తెలిసినను ప్రకృతిచే ఏదో విధమగు హింసకు గురియగు చుండును. అట్టి ప్రకృతిని జ్ఞానులు కూడ దాటలేరు. కనుక ప్రకృతికి మూలము, ఆధారము అగు తత్త్వమును ఆశ్రయించుట మార్గమని తెలియవలెను.

## 8

# ప్రకృతి మాయ

**ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।**
**భూతగ్రామ మిమం కృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్ ॥ 8**

*తాత్పర్యము :* ప్రాణి సముదాయ మంతయు స్వతహ ప్రకృతిచే నియమింపబడువారు అగుటచే నిశ్చయముగ అవశులు. అనగ తమ వశమున తాముండలేరు. ప్రకృతి ఎట్లాడించిన, అట్లాడుదురు.

*వివరణము :* జీవులు పుట్టుట, పెరుగుట, హాని వృద్ధులను పొందుట, కష్టనష్టములకు గురియగుట ఇత్యాదివన్నియు ప్రకృతి వశమున నుండునుగాని జీవులవశమున ఏమియు నుండదు. మాయవలన, మోహమువలన తమ వశమునకై ప్రయత్నము చేయుట జరుగుచుండును. తన వశమున నున్నట్లు గోచరించినది గూడ కాలక్రమమున తన వశము తప్పును. యౌవనమున వశమున నున్న దేహము వార్ధక్యము రాగానే వశము తప్పును.

వస్తువులు, మనుషులు, సంపదలు తమచుట్టు చేరుట, వదలి పోవుట జీవితములందు గోచరించుచునే యుండును. అంతయు ప్రకృతి ఆధారముగనే, స్వామిత్వముననే జరుగుచుండును. కాని మోహము చెందినవాడు తనవలననే ఇట్లు జరిగినది, అట్లు జరిగినది అని భావించి మాయామోహమున పడును.

సరస్సున నీరు నిండినపుడు, అట్లు నీరు నింపు కొన్నది సరస్సు కాదు. నీరే చేరినది. చేరిన నీరు ఇంకిపోవచ్చును, ఎండిపోవచ్చును లేక వుండవచ్చును. కారణము సరస్సు కాదు. నీరు చేరినపుడు కప్పలు చేరును. నీరు లేనపుడు కప్పలు వలసపోవును. ఈ మొత్తము వ్యాపారము నందు సరస్సు కర్తృత్వ మేమియు లేదు. అట్లే మానవ జీవితము కూడ. కర్తృత్వ మున్నట్లు మానవునకు గోచరించునే కాని నిజమునకు లేదు. బాగుగ విచారించినచో తన నుండి, పరిసరములనుండి జరుగుచున్న జీవ వ్యాపారమంతయు ప్రకృతి విలాసమేగాని, నిజమునకు జీవులు అవశులు. తామే చేయుచున్నామను మెర మెరయే గాని ఏ జీవునిచే ఎప్పుడు ఏమి చేయించవలెనో, వానిచే అట్లు చేయించు నది ప్రకృతి. వేద ద్రష్ట, వేదమునకు స్వర మేర్పరచినవాడు, మహా జ్ఞానియగు రావణుని ద్వారా అనూహ్యమగు కార్యములు జరిగినవి. పరమప్రీతి ఎల్లప్పుడు రాముని ఎడలగల కైకేయిచే రాముని వనవాసమున కంపినది. దిక్పాలకు లందరికి అధి నాయకుడగు ఇంద్రునికి అహల్యపై మోహము కలిగించినది.

తన ఊహ కతీతముగ తమయందలి ప్రకృతి తమను అనేక విధములుగ ప్రోత్సహించి పనిచేయించును. నిజమునకు జీవుల స్వామిత్వ మేమియు లేదు. ఎవరిని అందల మెక్కించునో, ఎవరిని అధోలోకములకు తొక్కునో ఎవ్వరునూ చెప్పలేరు. తెలివితక్కువ వాడు తెలివిగలవానిపై అధికారియగును. చిత్ర అతివిచిత్రముగ జీవుల కథ నడుపుచుండును. కవి చేతిలోని కథా పాత్రలవలె ప్రకృతి చేతిలో జీవులకథలు నడుచు చుండును. ఇది ఇట్లు జరుగునని ఎవ్వరును చెప్పలేరు. ఈ మొత్తము సృష్టి వ్యాపారమును దర్శించిన ఋషులు ప్రకృతికి రెండక్షరముల పేరు పెట్టిరి. అదియే "మాయ". ఆ మాయకు తాము లోబడుట కూడ వారు దర్శించు టచే వారు నిజముగ ఋషులైరి.

అట్టి మాయా రూపమగు ప్రకృతి తననుండే వెలువడి, తన లోనికే జొరబడి, హృదయమున నివాసముండునని పరమాత్మ తెలుపుచున్నాడు. కనుక పరమాత్మతో కూడి ప్రకృతి మాయను దర్శించుచు యుండుట యోగ్యము. అపుడపుడు తాము కూడ మాయలో పడవచ్చునని తెలిసియుండుట ముఖ్యము. మాయని పడని జీవుడు లేడు. సనకసనందనాదులు, దేవర్షియగు నారదుడు మాయనుబడిన సందర్భములుండగ మాయను దాటితిమని ఎవరు చెప్పగలరు?

(9)

# సాక్షీభూతుడు

న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।
ఉదాసీనవ దాసీన మసక్తం తేషు కర్మసు ॥ 9

*తాత్పర్యము :* ప్రకృతి కారణముగ జీవులాచరించు కర్మల యందు నేను తగులుకొనను. తటస్థునివలె యుందును. జీవుల కర్మలు నన్ను బంధింపవు, బంధింపలేవు.

*వివరణము :* ఈశ్వరుడు ప్రకృతికతీతుడు. తననుండి ఏర్పడిన ప్రకృతినుండి మూడు గుణము లేర్పడుచున్నవి. అవియే సత్వ రజస్తమస్సులు. ఆ గుణములనుండి జీవులేర్పడుచున్నారు. జీవుల కర్మలన్నియు వారి యందలి గుణ సముదాయముచే నిర్వర్తింపబడి, సుఖదుఃఖముల నిచ్చును. సుఖమువలన, దుఃఖమువలన కూడ జీవులు బంధింపబడుచున్నారు. అట్టి కర్మములకు, బంధములకు అతీతుడైన ఈశ్వరుడు తటస్థుడై సర్వమును చూచుచు నుండును. అందే కర్మ యందును అతని కాసక్తి లేదు. అట్టి ఈశ్వరుడు సాక్షీ భూతుడు. మనయందు కూడ ఈశ్వరుడున్నాడు. అతడాధారముగ

ప్రకృతి యున్నది. మన గుణ సమ్మేళనమునుబట్టి, ప్రకృతి మన ప్రకృతివలె తయారగును. మన ప్రకృతి ననుసరించి మన కర్మ లుండును. మన కర్మను బట్టి మనకు బంధ మోక్షము లుండును. కర్మలు నిర్వర్తించు తీరు తెలియనపుడు బంధనముండును. తెలిసినపుడు బంధముండదు. బంధములు ద్వంద్వములుగ నుండును. సుఖ బంధము, దుఃఖ బంధము. మనయందలి ఈశ్వరుడు మనలను, మన ప్రకృతిని, మన కర్మల నిర్వహణ మందలి జ్ఞానాజ్ఞానములను తటస్థుడై చూచుచుండును. అందే కర్మముతోను అతడు తగులుకొనడు. తగులుకొను ఆసక్తి కూడ లేదు. ప్రతి జీవుడు మూలముగ ఈశ్వరుడున్నాడు. అతడు తటస్థుడు. జీవకర్మలయందు అనాసక్తుడు. అతడిని ఏ కర్మలు బంధింపవు.

*ఒక ఉదాహరణము :* సూర్యోదయము వేళలో జీవులు క్రమశః మేల్కాంచి, అనేకానేకమగు కార్యములు దినమంతయు నిర్వర్తించుచు నుందురు. పశుపక్ష్యాదులు, మానవులు మేల్కాంచి వైవిధ్యమగు కార్యములలో నిమగ్న మగుదురు. మధ్యాహ్నము వేళకు పనులు వేడెక్కును. వేగము పెరుగును. సూర్యాస్తమయ సమయమునకు పనుల వేగము తగ్గును. రాత్రి మొదటి జాము గడచిన తరువాత జీవులు నిద్రలోనికి జారుదురు. ఇవియన్నియు సూర్యుడు ఆధారముగ జరుగుచున్నవి. జరుగుచున్న పనులకు

కర్తలు జీవులేగాని సూర్యుడు కాదు. సూర్యుడు సాక్షీభూతుడుగనే, తటస్థుడుగనే జీవుల కార్యములను చూచుచు నుండును. ఏ కార్యమునందు అతని ప్రమేయము లేదు. అతని ప్రభావము వలన మేల్కొనిన జీవులు తమదైన చట్రములలో తమ జీవితము లను బిగించుకొను చుందురు. సత్కార్యములకుగాని, దుష్కార్య ములకుగాని ప్రేరణ సూర్యుడు కాదు. జీవుల గుణ సముదా యము ప్రేరణకు కారణము.

ఒకనికి సూర్యోదయమున తినుటయందు గాని, త్రాగుట యందు గాని ఆసక్తి కలుగవచ్చును. మరియొకనికి శరీర వ్యాయామమున ఆసక్తి కలుగవచ్చును. ఇంకొకనికి తూర్పు వెలుగునకు నమస్కరింపవలె ననిపించును. ఇంకొకరికి మరల నిద్రింపవలె ననిపించును. ఇట్లెవరికేమనిపించినను అది వారి ప్రకృతికి సంబంధించినదేగాని సూర్యునికి సంబంధించినది కాదు గదా! అట్లే ఈశ్వరుడు కూడ.

*మరియొక ఉదాహరణము :* రాత్రి సమయమందు విద్యుత్ దీపపు కాంతితో కొందరు కూడి ముచ్చటలాడుకొన వచ్చును. లేదా గ్రంథపఠనము చేయవచ్చును. లేదా చీట్లపేక ఆడుకొన వచ్చును. లేదా పోట్లాడుకొనవచ్చును. లేదా టెలివిజను చూడ వచ్చును. విద్యుత్ దీపమే లేనిచో కొన్ని కార్యము లుండక పోవచ్చును. దీపమున్నపుడు జరుగు వైవిధ్యమగు కార్యక్రమము లతో దీపమునకు సంబంధము లేదు. అట్లే ఈశ్వరుడు.

ఈశ్వరుడు త్రిమూర్తులకు కూడ అతీతమగు తత్త్వము. త్రిమూర్తులకు కర్మ మున్నది. జ్ఞానముతో నిర్వర్తింపబడనపుడు వానిని కూడ కర్మలు బంధించును. వారు మూడు గుణములకు అధిపతులే అయినను, కాలమును దేశమును ఎరిగి, కర్తవ్య మెరిగి యజ్ఞార్థముగ కర్మలు నిర్వర్తించుటచే మోక్షస్థితిలో నుందురు. అట్లే బ్రహ్మర్షులు, మహర్షులు, నారదాది యోగులును కూడ. ఈశ్వరుడు తప్ప ఇతరులందరును జ్ఞానము నాశ్రయింపవలసినదే. లేనిచో బంధము తప్పదు. ఈశ్వరుడే జ్ఞానము, జ్ఞాని. "జ్ఞాని యనగా నేనే" అని ఈశ్వరుడే కృష్ణభగవానుడిగ పలికినాడు. కనుక జీవులకు తమయందలి ఈశ్వరుని ఆశ్రయించుటయే ఉపాయము.

## ⑩

## ఈశ్వర సన్నిధానము

**మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।**
**హేతునానేన కౌంతేయ జగ ద్విపరివర్తతే ॥ 10**

*తాత్పర్యము :* నా అధ్యక్షతయందు ఈ సమస్త చరాచర సృష్టిని ప్రకృతి అల్లుచు నున్నది. ప్రకృతి కారణముగనే జగత్తు పరివర్తించు చున్నది.

*వివరణము :* జగత్తనగా జరుగుచు, సాగుచు నుండునది. అది యంతయు ఈశ్వరాధీనమై యున్నది. ఈశ్వరుడు అధ్యక్షుడుగ జగత్తు పరివర్తనము చెందుచు నుండును. జగత్తునకు ప్రత్యేక అస్థిత్వము లేదు. అది ఈశ్వరుని ఆశ్రయించి యుండును. ప్రకృతి తనకు తానుగ జడము. అనగ ఏమియు చేయలేదు. కాని ఈశ్వర సాన్నిధ్యమున సర్వము నిర్వర్తించును. సూర్యకాంతి లేనిదే జీవుల వ్యాపార మేమియు లేదు. జీవులకు సూర్యకాంతివలె ప్రకృతికి పరమాత్మ ఆధారము. సూదంటురాయి సన్నిధానమందు ఇనుప రజను కదిలినట్లు ఈశ్వర సాన్నిధ్యముననే ప్రకృతి నిత్య పరి వర్తనమున నున్న జగత్తును సృష్టించి, నడిపించుచున్నది. ప్రకృతియే

అధ్యక్ష స్థానమునందున్నట్లుండును. కాని అవ్యక్తముగ ప్రకృతిని నడిపించుచున్న దీశ్వరుడే. ఈశ్వరుని బలముననే ప్రకృతి వర్తనము, నర్తనము కూడ. అట్లే జీవుల వర్తనము, నర్తనము కూడ. జగద్వర్తనమునకు, జీవుల వర్తనమునకు కారణము ప్రకృతి. కాని ప్రకృతికి ఆధారము ఈశ్వరుడు. దీనిని బాగుగ ఆకళింపు చేసుకొన వలెను.

మన ప్రకృతి మనలను వర్తింపజేయు చుండును. ఎవరి ప్రకృతి ప్రకారము వారు వర్తింతురు. కాని వారికిని, వారి ప్రకృతికిని కూడ ఈశ్వరుడే ఆధారము. మనయందు సాన్నిధ్యము నిచ్చిన ఈశ్వరుని వలననే మన ప్రజ్ఞా ప్రాణములు, మనము వర్తించు చున్నాము. మన ప్రవర్తనలకు ఈశ్వరుడు బాధ్యుడు కాదు. మనమే బాధ్యులము. మనయందలి ప్రకృతిని మనము ధర్మసమ్మతముగ, జ్ఞాన సమ్మతముగ సర్దుబాట్లు చేసుకొన్నచో మనకు జీవితమున ప్రశాంతత, ఆనందము కలుగుటయేగాక, మనయందలి ఈశ్వర సన్నిధానమును చవి చూడవచ్చును. అపుడు మనము, మన ప్రవర్తనము ఈశ్వరానుసంధానమున యుండుటకు వీలగును. అట్టి అనుసంధానమే మోక్ష స్థితి.

11

# దైవానుగ్రహము

**అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావ మజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥ 11**

తాత్పర్యము : సమస్త భూతములకు ఈశ్వరుడగు నన్ను మూఢులు తెలియలేకున్నారు. శరీరము ధరించియున్నను కూడ నన్ను తెలియలేక అలక్ష్యము చేయుచున్నారు.

వివరణము : పరమాత్మ మహత్త్వమునకు కూడ పరుడు, ఈశ్వరుడు. తన నుండియే సంకల్పము, కాలము, ప్రకృతి ఉద్భవించి చోటుగ ఏర్పడినది. అట్టి చోటునే మహత్తందురు. అట్టి మహత్తుకు కూడ ఈశ్వరుడు అగుటచే అతనిని మహేశ్వరు డనిరి.

మహత్తు నుండియే మహదహంకారము పుట్టినది. అందుం డియే మూడు విధములగు అహంకారములు, పంచభూతములు, పంచ ప్రాణములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ తన్మాత్రలు

పుట్టినవి. అవి ఆధారముగ భూతములు పుట్టినవి. అనగా సృష్టి మండలములు, వానియందు జీవులు ఏర్పడినారు. అన్నిటి యందు తానే బలముగ నున్నాడు. తానులేని చోటులేదు. తాను లేని కాలము లేదు. తానులేని రూపము లేదు. అణువునుండి బ్రహ్మాండము వరకు అన్నిటి యందు తానున్నాడు. నిజమునకు అన్నియు తనలో పుట్టి, తనలో పెరిగి, తనలో వర్తించుచు, తన లోనికే లయమగు చుండును. ఇది పరమాత్మయొక్క భూత మహేశ్వర స్థితి.

ఇట్లంతటను అన్నివేళల యందును వ్యాపించి, శాశ్వతముగ వసించియున్న వానిని ఎందైనను చూడవచ్చును. ఎప్పుడైనను చూడవచ్చును. ఎక్కడైనను చూడవచ్చును. చూడలేకపోవుట గ్రుడ్డితనమే! మూఢత్వమే! అందుకని, మూఢుడగుట చేతనే తనను చూడలేరని, తాను భూతమహేశ్వరుడైనను కూడ చూడలేకున్నారని తెలిపినాడు.

అంతేగాక, తానే స్వయముగ శరీరము ధరించి జీవులలో తిరుగుచున్నను చూడలేకపోవుట ఎంత దురదృష్టము! ఇది జీవుల దుస్థితి. కన్ను లెదుట నున్నది వైకుంఠమే అని తెలిసినను మరచుట నిర్లక్ష్యమే కదా! ఎక్కడో దేవుడున్నాడని వెదుకులాడు వారందరు మూర్ఖులే కదా! తమయందు, తమ పరిసరముల యందు ఈశ్వరుడే నిండియున్నను చూడలేరు. స్వయముగ తాను

ఏ రూపము ధరించినను చూడలేరు. చూడలేనివారు మరికొందరు చూడలేని వారిని ఆశ్రయించి, స్పష్టముగ నున్న వస్తువును చూడ లేకుండుట వింతలన్నిటిలోనికి పతాకస్థాయి చేరిన వింత.

పరమాత్మ తానే స్వయముగ రూపుగట్టుకొని శ్రీకృష్ణుడుగ షోడశ కళలతో భూమిపై క్రీడార్థముగ చరించినాడు. ఇతఃపూర్వము అవతారము ధరించినాడేగాని, ఇట్లు పరిపూర్ణముగ పురాణ పురుషుడు భూమిపై దిగుట ఏకైక ఘట్టము. అయినను గుర్తించిన వారు బహుకొద్దిమందే. గుర్తింపనివారు కోటానుకోట్లు. గుర్తింపక పోగ అవహేళన చేసినారు. అవమానింప జూచినారు. మాయా మోహమున బడి అతనిని తెలియలేకపోయిరి.

తానే స్వయముగ శరీరము ధరించి వచ్చితినని పలికినను అర్జునుడు అంతంతమాత్రమే గుర్తించినాడు. ఇది అతి విచిత్రము. ఘన పురుష రూపమున పరమాత్మ తన ఎదుట నిలబడి స్వయ ముగ తనకు తానే ప్రకటించుకొనినను అర్జునునికి తెలియకపోవుట వలన, మనుష్య రూపముననున్న దైవము తన విశ్వరూపమును గూడ చూపించవలసి వచ్చినది. అపుడుకూడ అర్జునుడు భయపడి, ఆ రూపము ఉపసంహరించమని, సుందరము మందహాస పూరితము అగు పూర్వ రూపమునే చూపమని వేడుకొనినాడు. దీనివలన తెలియవలసిన విషయ మొక్కటియే. దైవమును తెలుయుటకు దైవానుగ్రహ మొక్కటియే ఉపాయము.

## (12)

## కర్తవ్యకర్మ

**మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।**
**రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12**

తాత్పర్యము : మోహముచేతను, ఆశచేతను వికృతి చెందిన చేతస్సు గలవారై, అజ్ఞానమగు కర్మలు జీవకోట్లు నిర్వర్తించు చున్నారు.

వివరణము : మానవుని పట్టి బంధించు మూడు రకముల వికారములను భగవానుడీ శ్లోకమున తెలుపుచున్నాడు. అందు మొదటిది మోహిని. రెండవది కామిని. మూడవది ఆసురి. వీనివలన మోహము చెందుట, ఆశపడుట, అవివేకముతో ప్రవర్తించుట జరుగుచుండును.

మోహమువలన కర్తవ్యములు మరచి, కోరిక నాశ్రయించుట జరుగును. తనకోరికలే తన కర్తవ్యములుగ పొరపడి, కోరికలను తీర్చుకొను మార్గమున పతనము ప్రారంభమగును. కోరికకు ఆశ అనునది కవల పిల్లవలె ఉండును. ఆశ వలన మోహము బల

పడును. జ్ఞానము నశించును. ఏ విధముగనైన తన కోరిక నెర వేరుటయే ప్రధానమని భావించి, జ్ఞానవిహీనమగు కార్యములు ఆచరించును. క్రమముగ ధర్మాధర్మములను త్యజించి అసుర బుద్ధితో కోరికలు తీర్చుకొను మార్గము పట్టును. ఆ మార్గమున రాక్షస ప్రవృత్తిని పొందును. అట్టి సమయమున ఎవరు ఎన్ని నీతి వాక్యములు పలికినను నిర్లక్ష్యము చేయును. మోహముచేత అసురత్వము, అసురత్వముచేత రాక్షసత్వము చెంది ఘోర కర్మల నాచరించుచు పూర్ణముగ పతనము చెందుట జరుగును.

ఇట్లు కర్తవ్యము వదలిన వానిని కోరిక ఆశ్రయించి, మోహము కలిగించి పతనపు దారిన అధోగతికి చేర్చును. ఎట్టివాడైనను ఈ కురుక్షేత్రమందు కర్తవ్యము నాశ్రయించియే చరించవలెను. కర్తవ్యము వీడినవారు స్వారీ చేయుచున్న గుఱ్ఱపు పగ్గములను వదిలినవాడివలె మార్గము చెడి అగమ్యమగు స్థితిని చేరును. మానవునకు విచక్షణ ప్రధానముగ ఈయబడినది. దానిని వినియో గించుచు కర్తవ్యమునే ఆశ్రయించవలెను. కోరికల నాశ్రయించ రాదు. ఈ ప్రధానమగు సూత్రము ప్రాథమిక అధ్యాయములలోనే తెలుపబడినది. ఆ సూత్రమును త్యజించినచో కలుగు పతనము కూడ తెలుపబడినది. అదే విషయమును 'గీత' మధ్యమున మరియొక మారు గుర్తుచేయుట జరిగినది.

ఈ శ్లోకము భగవద్గీతయందలి నడిమి శ్లోకమై యున్నది.

ఏడువందల (700) శ్లోకములతో విరాజిల్లుచున్న భగవద్గీతయందు ఇది (350) మూడువందల యాబదియవ శ్లోకం. విచిత్రమేమనగ జ్ఞానమునకు పరాకాష్ఠగ విరాజిల్లుచున్న భగవద్గీతయందు, ఈ శ్లోకమున అజ్ఞాన స్వరూప స్వభావములు తెలుపబడినవి. నిజము నకు అజ్ఞానమేమో తెలిసినచో అపుడు జ్ఞానము కూడ తెలుయును. "ఇది చేయరాని పని" అని తెలిసినపుడు దానిని చేయకుండుట వలన కూడ మనిషి చేయవలసిన పనియందే యుండును. అజ్ఞాన స్వరూపము తెలిసినచో ఇక మిగులునది జ్ఞానమే గదా! భగవద్గీత యందే "*ఉపదేక్షంతితే జ్ఞానం*", "*ఉపదేక్షంతితే అజ్ఞానం*" అను ద్వివిధములగు అవగాహన తెలుపబడినది. జ్ఞానము తెలిసినచో అజ్ఞాన మేమో తెలుయును. అట్లే అజ్ఞానమేమో తెలిసినచో జ్ఞాన మేమో తెలుయును. బియ్యపు గింజలయందు బెడ్డలు కలిసి యుండును. అందు బియ్య మేరుకొన్న బెడ్డలు మిగిలిపోవును. లేదా, బెడ్డ లేరుకొన్నచో బియ్యము మిగులును. అట్లే సృష్టియందు జ్ఞానా జ్ఞానములు బియ్యము బెడ్డలుగ కలిసి యుండును. అందేది తెలిసినను రెండవది కూడ స్పష్టముగ తెలుయును.

భగవంతుడు గీతాబోధన నడుమ మోహము, ఆశ, వానితో కూడిన కర్మలు అజ్ఞానమువలన నిర్వర్తింపబడునని, దాని వలన మోహిని, ఆసురి, రాక్షసి అను మూడు వికృతులు మానవు నాశ్ర యించునని తెలిపెను. ఆశామోహములు దరి రానీయకుండగ యుండవలె నన్నచో కర్తవ్యమే శరణ్యము. ఈ కర్తవ్యమునే "కార్యం

కర్మ" అని భగవద్గీత వచించినది. చేయవలసిన పనిని కార్యం కర్మ అందురు. ఏ భాషణమైనను, చేష్ట అయినను చేయవలసినదే చేయవలెను. ఇతరములు చేసినచో ప్రకృతి బంధించుట తప్పదు. కనుక మోహపడుట, ఆశపడుట ఎచ్చటుండునో అచ్చట అజ్ఞానము వలన బంధముండును. వానివలన మోహిని, ఆసురి, రాక్షసి అను మూడు వికృతులు జీవుని పట్టును. అట్టి వానికి నిష్కృతి లేదు. ఈ ఒక్క సూత్రము చిన్నతనముననే తెలిసినచో అట్టి జీవుడు వికృతిని బడక, ప్రకృతి యందుండి, కర్తవ్యకర్మ మార్గమున సంస్కృతిని పొందును. తెలుగువారికి "*ఆశా మోహముల దరి రానీకోయి, అన్యులకే నీ సుఖము అంకిత మోయి*" అను గీతం వరముగ అందజేయబడినది. ఈ శ్లోకము సారాంశ మదియే.

13

# ఈశ్వర తత్త్వము

**మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితాః ।**
**భజం త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ ॥ 13**

*తాత్పర్యము :* దైవీ ప్రకృతి నాశ్రయించి మహాత్ములు సమస్త ప్రాణికోటికి ఆదికారణునిగను, నాశ రహితునిగను నన్నెరిగి ఇతర చింతన లేక నన్నే సేవించు చున్నారు.

*వివరణము :* ముందు శ్లోకమున ఆశ, మోహముల కారణ ముగ విచేతస్సులై జీవులు అజ్ఞాన వశమున ఆసురీ ప్రకృతి యందు ఎట్లు వ్యక్తకర్మలను నిర్వర్తించుచుందురో భగవంతుడు తెలిపి యున్నాడు. ఆశామోహములను దరిరానీయకుండ కోరికల వెంటపడి, పతనము కాకుండ కర్తవ్య కర్మలను నిర్వర్తించు మానవులు క్రమముగ సత్వగుణమున స్థిరపడుదురు. ఆశా మోహములకు గురియైనవారు రజస్తమస్సులలో చిక్కుకొని, అజ్ఞానవశమున అసురులగు చున్నారు. కర్తవ్య కర్మను నిర్వర్తించు వారు సత్వమునందే స్థిరపడుట వలన సృష్టి ధర్మమును గ్రహించి, అహింస-సత్యము-బ్రహ్మచర్యము-ధర్మాచరణము వంటి సత్వ

గుణముల ద్వారా సద్గుణోపేతులై మహాత్ములగుచున్నారు. అట్టి మహాత్ములకు అంతటను నిండియున్న ఈశ్వర దర్శనము క్రమముగ సాధ్యపడును. వారు సమస్త ప్రాణికోటికిని ఆధారముగ నున్న ఈశ్వరుని ఎరిగి, అంతట ఈశ్వరునే దర్శించుచు అన్యము లేని మనసు గలవారై, అవ్యయుడగు తననే (ఈశ్వరునే) దర్శించుచు నున్నారు.

సద్గుణోపాసనము వలన మానవ ప్రజ్ఞకు గల మలినము లన్నియు తొలగింపబడి, సమస్తమునకు మూల కారణమగు ఈశ్వరుని దర్శింప వీలగును. నిత్యము కార్యం కర్మయందు అనగా తన కర్తవ్యమునందు నిమగ్నమై యున్న వానికి అహింస, సత్యము ఆదిగాగల సద్గుణములయందు ఆసక్తి కలుగును. క్రమముగ వాని నిర్వహణమునందు రుచి పెరుగును. మలినములు కరుగును. లోపల బయట శుచి, శౌచము పెరుగగ, పంచ భూతములకు, గుణములకు ఆధారమైన చేతస్సు దర్శన మగుచుండును. అందరి చేష్టలకు వెనుక ఒకే ఒక నిశ్చల చైతన్యము యున్నదని, అది నిత్యము, శాశ్వతము అగు వెలుగని, అది కదలని చైతన్యమని, అది ఆధారముగ కదిలెడి చైతన్య రూపములు అనేకానేక విధము లుగ కదులుచున్నవని తెలియును. జీవుల చేష్టల యందు నిత్యము కదులుచున్న చైతన్యము కనిపించును. అట్టి కదిలెడి చైతన్యములకు ఆధారముగ అందరి యందును నిశ్చల చైతన్యము ఉన్నదని గోచరించును. ఆ చైతన్యము అవ్యయమని

తెలుయును. అనగా దానికి తరుగుట, పెరుగుట అను స్థితులు లేక ఎప్పుడును ఉండుటగ గోచరించును. అది ఆధారముగనే జీవులకు జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థలు కలుగుచున్నవని తెలియును. అది వెండితెరవలె, ఆకాశమువలె అంతట వ్యాప్తి చెందియుండగ, అది ఆధారముగ అనేకములగు జీవుల చేష్టలు జరుగుచున్నట్లు గోచరించును. వెండితెర నిశ్చలముగ నున్నపుడు దానిపై జరుగుచున్న బొమ్మలకథ అనేకమగు చేష్టలతో, వైవిధ్య ముతో కూడిన చేష్టలతో జరుగుచుండును. అట్టి బొమ్మ చేష్టలకు ఆధారము వెండితెరయే. అట్లే సమస్త జీవులయందు నిత్యము నర్తన చేయుచున్నటువంటి చైతన్యమునకు ఆధారమై యున్న నిశ్చల చైతన్యము దర్శింప వీలగును. నిజమునకదియే లేకున్నచో జీవుల కథయే లేదు. జీవుల కథ లేనపుడు కూడ అది యుండును. అది మూల చైతన్యము. దానియందే సృష్టి కథయంతయు భూత, వర్తమాన, భవిష్యత్తుగ సాగుచుండును.

సమస్త జీవుల, గ్రహగోళముల, మండలముల కదలికలకు ఆధారమై, కదలక నిత్యముగను, శాశ్వతముగను యున్న మూల చైతన్యమును దర్శించినపుడు, ఉన్నది ఒకటే యనియు, అది అనేకానేకములుగ నర్తించుచున్న దనియు, అది శాశ్వతమనియు తెలియవచ్చును. అట్లు తెలిసిన వెనుక దానినే సమస్త జీవుల మూలముగ దర్శించుట జరుగును. అట్టి దర్శనము లభ్యమై నపుడు, ఇక ఇతరముల దర్శనము మరుగున పడును. ఇట్టి

మూల చైతన్యము దర్శించుటకు సత్వగుణము ఆధారము. అట్టి సత్వగుణము లభించుటకు కర్తవ్యకర్మ, సుగుణముల ఉపాసన ఆధారము. ఇట్టి మార్గమున ప్రవేశించి కృషి చేయుటవలన కామిని, మోహిని, ఆసురి అగు అజ్ఞానము నశించును. కనుక ఈ శ్లోకమున సత్యదర్శనమునకు సత్వగుణము నాశ్రయించుట తప్పనిసరి అని తెలుపబడినది. అట్టి ఆశ్రయము వలన జీవుని కోశముల యందలి మలినములు తొలగును. మలినమే అజ్ఞానము. అది తొలగినపుడు జ్ఞాన మావిష్కరింపబడును. అట్టి జ్ఞానము నామరూపాతీతమగు వెలుగును దర్శింపజేయును. ఇట్లు దర్శించిన మహాత్ములకు సర్వము ఈశ్వరమయముగనే గోచరించును. ఈశ్వరుని భూత మహేశ్వరత్వము కూడ తెలియబడును. ఈశ్వరుడు సర్వవ్యాపి, సర్వమునకు మూలము అని తెలియ బడును. అట్టి ఈశ్వర తత్త్వము నందు సర్వ జీవులును తేలుచు యున్నారని దర్శనమగును. ఇట్టి దర్శనము నిత్యము అనుభ వించు చున్నవారే మహాత్ములు. వారికీశ్వరుడు కాని దేమియు లేదు. అట్టి ఈశ్వరుడు శాశ్వతుడని కూడ తెలియును. ఇట్లు దర్శనము చేయుచున్న మహాత్ములు లోకమున పూజ్యులు. ఆశామోహములకు లోబడినవారు లోకమున బద్ధులు. మహాత్ములు తన దైవీ ప్రకృతి నాశ్రయించి యుండుటచే తనను ఎప్పుడును తెలిసియే యుందురు. అట్లు తెలిసి నన్ను సేవించుచు నుందురు. వారికితరము లేదు.

(14)

# మహాత్ములు

**సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।**
**నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥ 14**

తాత్పర్యము *:* దైవీ ప్రకృతి నాశ్రయించిన వారిని గూర్చి ముందు శ్లోకమున తెలుపబడినది. వారి లక్షణములు మరికొన్ని ఈ శ్లోకమున దైవము తెలియజేయుచున్నాడు. ముందు శ్లోకమున మహాత్ములు దైవమును భూతము లన్నిటికిని మూలమని, అది అవ్యయమగు తత్త్వమని తెలిసి అన్యము లేని మనసుతో వానిని నిత్యము సేవించు చుందురని తెలిపెను. ఈ శ్లోకమున వారు నిత్యము దైవ దర్శన యత్నముననే యుందురని(*యతంతః*), ఆ ప్రయత్నమే దృఢమగు వ్రతముగ ఏర్పరచుకొని యుందురని, (*దృఢవ్రతః*), సతతము అన్నిట, అంతట ఆ దైవీ తత్త్వమునే దర్శించుచు, కీర్తించుచు నుందురని (*సతతం కీర్తయంతః*), సమస్తము నందు దర్శింపబడుచున్న దైవమునకు మనస్సున నమస్కరించుచు నుందురని (*నమస్యంతః*), నిత్యము ఆ విధముగ దైవముతోనే కూడియుందురని (*నిత్యయుక్తః*), భక్తితో ఈశ్వరునకు అతి చేరువగ వసింతురని (*భక్త్యా ఉపాసతే*) తెలుపబడుచున్నది.

మహాత్ముల లక్షణములు 13, 14 శ్లోకములలో ఈ క్రింది విధముగ తెలుపబడినవి.

1. భగవంతుని ఈశ్వరత్వము తెలిసియుండుట.
2. అన్నిటికి మూలము అతడేయని తెలిసియుండుట.
3. అన్యమేదియు లేదని నిశ్చయముగ తెలిసి యుండుట.
4. నిత్యమతని దర్శించు ప్రయత్నమున నుండుట.
5. దైవదర్శన ప్రయత్నమే దృఢమగు వ్రతముగ నుండుట.
6. అన్నిట, అంతట నిండియున్న దైవమునకు నామ రూపాది భేదములు లేక మనస్సున నమస్కరించు కొనుట.
7. అతని లీలావైభవములు దర్శించుచు నిత్యము కొనియాడుచుండుట.
8. నిత్యము దైవీతత్త్వముతో ప్రజ్ఞాపరముగ కూడి యుండుట.
9. భక్తి శ్రద్ధలతో ఆ తత్త్వమునకు అత్యంత సమీపమున వసించియుండుట.

పై లక్షణములు లోపించిన వానిని మహాత్ములుగ గుర్తించ నవసరము లేదు. పై లక్షణము లన్నియు దైవీ ప్రకృతి సంబంధిత

ములు. అట్టి లక్షణములు గలవారు సర్వ కాలములందు, సర్వ దేశములందు, సర్వ రూపములందు, సర్వ నామములందు దైవమునే దర్శింతురు. అందరియందలి దైవమునే కీర్తింతురు. జీవులను పొగడుట అను లౌక్యము వారి వద్ద యుండదు. వారి ప్రయత్నము నిత్యయత్నముగ నుండును. అట్టి నిత్యయత్నమున దైవముతో కూడియుండు వారిని యతులందురు. వారి ప్రయత్నము అత్యంత దృఢమై యుండును. వారి దృష్టి ఎల్లప్పుడును ప్రకృతి యందిమిడి యున్న దైవమును దర్శించుట యందే యుండును. అట్టి సాలోక్య ప్రయత్నమున దైవమునకు సామీప్యమున నుందురు. దైవ సాయుజ్యమందు వసించి నిత్యకృత్యములు జరుపుచు నుందురు. వారికి తల్లి, తండ్రి, దైవము, మిత్రులు, బంధువులు, సంఘము, కుటుంబము, తాము నిర్వర్తించు కార్యములు అంతయు దైవమే. క్రమముగ అన్యము లేక సమస్తము దైవముగనే దర్శన మగుచుండును. అట్టి అనన్య స్థితి యందు పరమానందభరితులై యుందురు.

కులమత భేదములు, స్త్రీ పురుష భేదములు, జాతి భేదములు, దేశీయత వంటి వర్గీకరణము లేక అట్లు గోచరించుచున్న వైవిధ్యము నందు ఏకత్వమును దర్శింతురు.

నిజమునకు దైవము కాని దేదియు లేదు. ఆ దైవీతత్త్వము అనేకానేకమగు అల్లికలు ప్రకృతి నిర్వర్తించును. అన్నియు

మూలము నందు దైవమే. అన్నిరంగులకు మూలము శ్వేతవర్ణమే. అన్ని శబ్దములకు మూలము నాదమే. అన్ని రూపములకు మూలము అండమే. అన్ని అంకెలకు మూలము పూర్ణమే (సున్న). దేవతలకు, మానవులకు, జంతువులకు, వృక్షములకు, ఖనిజములకు, పక్షులకు, గ్రహగోళములకు, సూర్యమండలములకు, తారకామండలములకు, సమస్త సృష్టికి మూలము ఒకటియే. చూచువానికి, వినువానికి మూలము కూడ అదియే. అట్టి తత్త్వమును దర్శించుట అనుక్షణము భగవద్గీత యందు బోధించ బడుచున్నది.

నామ రూప భేదములతో కొట్లాడుకొను మూర్ఖులకు, మత భేదములతో హింసించుకొను మతోన్మాదులకు, జాతి భేదములతో ఒకరినొకరు దమించజూచు జాతి అహంకారులకు, దైవమును గూర్చిన ఉద్యమకారులకు, ఉద్వేగులకు, ఉగ్రవాదులకు దైవము తెలుయుట కలనైనను సాధ్యపడదు. ఇట్టి కల్లోలమునందు కూడ దైవలీలను చూచువాడు నిజమగు మహాత్ముడు. దేనిని నిరాకరింపక అన్నియు అతని వైభవమే అని భావించుచు, అన్నిటి యందు అతనిని దర్శించు మహాత్ములే మానవజాతికి పరిష్కారము.

దైవమే మహాత్ములు గూర్చి నిర్వచించినాడు. మహాత్ములను గుర్తించుటకు ఈ రెండు శ్లోకములే (13, 14) ప్రామాణికములు.

(15)

# తత్త్వ మొక్కటే !

**జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే ।**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖమ్ ॥ 15**

*తాత్పర్యము :* అనన్య భావనతో కొందరు, జ్ఞాన యజ్ఞము ద్వారా కొందరు, బహు విధములుగ కొందరు విశ్వరూపుడనగు నన్ను ఉపాసించుచున్నారు.

*వివరణము :* సనాతన ధర్మమును అద్దము పట్టి చూపించు శ్లోకమిది. దైవము విశ్వతోముఖుడు. అనగా విశ్వరూపుడు. విశ్వముగ గోచరించువాడు. విశ్వమంతయు దైవముతోనే నిండి యున్నది. అతనికి ఇతమిద్ధమగు రూపము లేదు. అన్ని రూపములు అతని నుండి ఏర్పడినవే. నిజమునకు దైవ మతడు కాదు, ఆమె కాదు. రెండును. దైవమొక తత్త్వము. ఆ మూలతత్త్వ మాధారము గనే సర్వమును పుట్టుచు, పెరుగుచు పూర్ణముగ వృద్ధి చెంది, మరల కృశించి అందులోనికే లయమగుచుండును. అట్టి తత్త్వము

నుండి పుట్టినదంతయు అతని రూపమే. మనయందలి సర్వాంగముల యందు మనమే వ్యాపించి యున్నట్లు, విశ్వమందలి సమస్త అంశముల యందు దైవమే వ్యాప్తి చెంది యున్నాడు. మన శరీరమున ఎవరు ఎక్కడ స్పృశించినను మనలను స్పృశించినట్లే కదా! అట్లే దైవమును ఏ రూపమున భావించినను అతనిని భావించినట్లే.

రూపధ్యానమున ఒక మెలకువ అవసరము. సమస్త సృష్టి వ్యాప్తి చెందియున్న దైవమును ఈ రూపము ద్వారా ఆరాధించుచున్నామని భావింపవలెను. ఆ రూపమునకే పరిమితము కాకుండ, రూపము నిమిత్తముగ విశ్వరూపు నారాధించుచున్నాను అని తెలిసి ఆరాధించవలెను. రూపమున కతీతమైన తత్త్వమును రూపము ద్వారా దర్శించు ప్రయత్నమున ఉన్నాను అను భావన యుండవలెను. అపుడు రూప మేదైనను, నామ మేదైనను ఆరాధకుని చిత్తము అపరిమితమగు తత్త్వముతో ముడిపడును. అట్లు కానిచో, వివిధ దేవతారాధనలు, గురుమూర్తి ఆరాధనములు వివిధత్వమును, భేదములను సృష్టించును. అట్లు జరుగకుండుటకే ఈ శ్లోకమున భగవానుడు ఆరాధనలు ఎన్ని విధములుగ నున్నను, ఆరాధింపబడు తత్త్వ మొక్కటే అని తెలిసి ఆరాధించవలెనని తెలుపుచున్నాడు.

ఆరాధనము లనేకములై యుండవచ్చును. కాని ఆరాధ్య మగు దైవమొక్కటే అని తెలిసినచో, భక్తులనడుమ స్పర్థలు, ఘర్షణలు, పోరాటములు, యుద్ధములు, హత్యలు, మరణములు యుండవు. రాముడైన, కృష్ణుడైన, శివుడైన, విష్ణువైన, లక్ష్మీ సరస్వతులైన, దుర్గ అయిన, ఆంజనేయుడు, సుబ్రహ్మణ్యుడు, గణపతి మరి యే ఇతర దేవతలైన, గురువులైన పై విధమైన అవగాహనతో ఆరాధన చేసినచో దైవప్రాప్తి సత్యమై నిలచును. ఇట్టి అవగాహన యున్నపుడు పారశీయులైన, జైనులైన, సిక్కులైన, కిరస్తానీయులైన, ముసల్మానులైన భేదము చూపవలసిన అగత్య ముండదు. సమస్త జీవకోటి దైవము నుండి ఏర్పడినవే. దైవము నకు చెందినవే.

దేవతా రూపములు, మానవ రూపములే కాక అనేకమగు ఇతర రూపములు కూడ దైవముగ ఆరాధింపబడుట లేదా? పర్వతము, నది, వృక్షము, అగ్ని, సర్పము, పక్షి వంటి రూపములు కూడ ఆరాధింపబడుచున్నవి గదా! అనాదిగ మానవుడు బహు ముఖముల దైవము నారాధించుచు నున్నాడు. విశ్వవ్యాప్తమైన దైవమే అన్ని రూపములుగ నున్నాడు అని తెలిసి, ఏ రూపము నారాధించినను సముచితమే. "ఈ రూపమే సత్యము, ఈ నామమే సత్యము" అనుట అజ్ఞానము. అది మూఢత్వము. అట్టి మూఢులు దైవము నెరుగుట అసంభవము. వారి జ్ఞానము మోహము చేత

కప్పబడి, వికృతముగ నర్తించుచుండును. వారికి సనాతన ధర్మము తెలియుట కాలక్రమమున జరుగును.

"*ఏకత్వేన పృథక్త్వేన బహుధా మామ్ ఉపాసతే*" అని ఈ శ్లోకమున దైవము కోటానుకోట్ల విధములుగ తనను ఉపాసించు వారున్నారు, వారందరు నన్నే చేరుచున్నారని తెలుపుచున్నాడు. విధానము లెన్నైనను లక్ష్యమొకటే. లక్ష్యము విశ్వతోముఖుడగు దైవమును చేరుట.

ఇట్టి అఖండమగు జ్ఞానము నిరంతరము జిజ్ఞాసువులకు భక్తి శ్రద్ధలతో బోధించుట జ్ఞాన యజ్ఞమగును. అట్టి జ్ఞాన యజ్ఞమును నిర్వర్తించుచు దైవమును చేరువారున్నారు. అదే విధముగ అపరిమితమగు దైవమును అనేకానేక విధములుగ ఆరాధించుచు, సేవించుచు, భజించుచు, కీర్తించుచు దైవమును చేరువారున్నారు అని ఈ శ్లోకమున తెలుపబడినది. ఇచ్చట ఉపాసన మనగ జీవప్రజ్ఞను దైవప్రజ్ఞ దరిచేర్చుట ఉప ఆసన మనగ, దగ్గర కూర్చుండుట. ఉపవాసమనగ దగ్గరగ వసించుట. ఆరాధనా విధానమేదైనను జీవప్రజ్ఞ పరమేశ్వరుని దరిచేరి యుండ వలెను. అపుడితర విషయములు అట్టి ప్రజ్ఞను మలినము చేయ లేవు. ఉపాసనములు, ఉపవాసములు అర్థవంతముగ నుండ వలెను కాని, వ్యర్థముగ శ్రమపడుట, దేహమును శుష్కింప జేయుటగ నుండరాదు.

## (16)

# సమస్తమును నేనే !

**అహం క్రతు రహం యజ్ఞః స్వధాహ మహ మౌషధమ్ ।**
**మంత్రోఽహ మహమే వాజ్య మహమగ్ని రహం హుతమ్ ॥ 16**

*తాత్పర్యము :* క్రతువును నేనే. యజ్ఞమును నేనే. ఓషధులును నేనే. మంత్రము కూడ నేనే. హోమ ద్రవ్యమును నేనే. హోమమును నేనే. అందు హుతమగు ద్రవ్యము నేనే.

*వివరణము :* సమస్తమును ఈశ్వరుడగు నేనే అని తెలుపుటకు మరికొన్ని ఉదాహరణలు దైవము తెలుపుచున్నాడు. వైదిక ధర్మమందు అనేక క్రతువులు తెలుపబడి యున్నవి. విధి విధానముగ ఆ క్రతువులు నిర్వర్తించువారు క్రతు నిర్వహణమున నిమగ్నమై క్రతువును ఈశ్వరునిగ చూడరు. ఏదో ఒక తంతు నిర్వర్తిస్తున్నట్లు హడావిడిగ నుందురు. అట్లే యజ్ఞము చేయువారు కూడ యజ్ఞవిధి యందు నిమగ్నమై, అందీశ్వరుని దర్శింపరు. స్వాహాకారములు బిగ్గరగ చేయుచు, బాగుగ పలికినామని గర్వపడుదురేగాని ఆ స్వాహాకార రూపమున అవతరించి, హవిస్సును గొను ఈశ్వరుని దర్శింపరు. మంత్రములు అనుదాత్త, ఉదాత్త

స్వరములతో చక్కగ పలుకుచున్నామనే అహంభావముతో చేతులు, తలలు, మెడలు త్రిప్పుదురేగాని మంత్రరూపమున నున్న ఈశ్వరుని గమనింపరు. హోమ ద్రవ్యముల రూపమున, ఆవునేయి రూపమున యున్న ఈశ్వరుని దర్శింపక, వానిని హోమ ద్రవ్య ములు గను, నేయిగను గుర్తింతురు. అంతేకాదు, ఊర్ధ్వ ముఖముగ అగ్ని జ్వాలలు అనేక కాంతులతో ప్రజ్వరిల్లుచున్నపుడు అందీశ్వరుని దర్శింపరు. హుతమగుచున్న ద్రవ్యము దృశ్యలోకము నుండి అదృశ్యలోకము లోనికి ఉద్ధరింపబడుట చూడరు. అట్టి ఉద్ధారణ రూపమున గూడ ఈశ్వరుడే యున్నాడు.

క్రతువులు, యజ్ఞములు ఆచరించువారు ఈశ్వరుని గూర్చి చేయు దీక్షాయుత కార్యమున సమస్తమును ఈశ్వరునిగనే చూడ వలెను. నిజమునకు క్రతువు నిర్వర్తించువారు, క్రతువును చూచు వారు, క్రతు ద్రవ్యములు, క్రతు పరికరములు, క్రతు విధానము అంతయు ఈశ్వరుడే. క్రతు సంకల్పము ఈశ్వరుడే. క్రతు నిర్వహ ణము ఈశ్వరుడే. క్రతు ఫలము ఈశ్వరుడే. ఈశ్వరుడు కాని దేమియు లేదు. అందువలన ఈశ్వరుడగు కృష్ణపరమాత్మ అన్నియు 'నేనే' అనుచున్నాడు. అంతయు 'నేనే' అనుచున్నాడు. క్రతువు నందుగాని, యజ్ఞము నందుగాని తాను కాని వస్తువేదియు లేదు. విశ్వమంతయు తానే అయినపుడు అందలి భాగములు కూడ నేనే అని తెలుపుటలో ఒక రహస్యమున్నది. మొత్తము నుండి వివరములలోనికి ప్రజ్ఞ దిగినపుడు, వివరములలో మొత్తము అదృశ్యమగును. మొత్తమునందే వివరమున్నది గనుక వివరము

నందు గూడ మొత్తమును చూడవలెను. వివరమును చూచు నపుడు మొత్తమును మరచుట సహజము. మరువకుండుట జ్ఞానము. అలలు చూచునపుడు సముద్రమే అలగ యున్నదని గుర్తుండుట జ్ఞానము. అలల విన్యాసములో సముద్రమును మరచుట అజ్ఞానము. పురుషుడు ధరించు లుంగీ, స్త్రీ ధరించు చీరలో యున్నది పత్తియే యని గుర్తువచ్చునా? వచ్చుట లోదృష్టి. ఇట్టి లోదృష్టి లేకుండ ఎన్ని యజ్ఞములు చేసినను, యాగములు చేసినను, ఈశ్వరసాన్నిధ్యము లభింపదు. సృష్టియందలి అన్ని వస్తువులయందు దైవమే నిండియున్నపుడు దైవమును చూడక, ఇతరము చూచుట అజ్ఞానము. దైవమునే చూచుట రాజవిద్య.

ఎంత తెలిసిన వానికైనను ప్రకృతిచే ఆవరింపబడిన ఈశ్వరుని దర్శనము చేయుటకు దీక్ష కావలెను. ఈశ్వరు నాశ్రయించియే ప్రకృతి అనేక విధములుగ ఆవిర్భవించు చున్నది. అట్టి అనేక మందు ఏకత్వమును దర్శించుట అనుక్షణ ప్రయత్నముననే సాధ్యము. ఎందరో మునులు, ఋషులు క్రతువుల యందు, యజ్ఞముల యందు నిమగ్నమై, అచటనే తిరుగాడుచున్న కృష్ణ పరమాత్మను చూడలేకపోయిరి. కారణము, క్రతు ద్రవ్యములను, మంత్రములను, స్వాహాకారములను, ఓషధులను, అగ్ని జ్వాల లను, హుతకార్యమును ఈశ్వరునిగ దర్శింపకపోవుటయే!

(17)

# ప్రణవ స్వరూపుడు

**పితాఽహమస్య జగతో మాతా ధాతా పితామహః ।**
**వేద్యం పవిత్ర మోంకార ఋక్సామ యజురేవ చ ॥ 17**

*తాత్పర్యము :* ఈ జగత్తునకు తండ్రిని నేనే. తల్లి, తండ్రి, తాత కూడ నేనే. ఓంకారము నేనే. అన్నిటి యందు తెలిసికొనదగినది నేనే. పవిత్ర పదార్థముగ నున్నది నేనే. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము నేనే.

*వివరణము :* అన్నియు నేనే. అంతయు నేనే అని తెలిపిన దైవము ముందు తెలిపిన ఉదాహరణలకు తోడుగ మరికొన్ని ఉదాహరణలు తెలుపుచున్నాడు. ఈ జగత్తు పుట్టించిన సృష్టికర్త యందు నేనే యున్నాను. అట్లే నిన్ను పుట్టించిన నీ తండ్రి యందు నేనే యున్నాను. నిన్ను ధరించి, భరించిన తల్లి యందు కూడ నేనే యున్నాను. నీ తల్లిని తండ్రిని పుట్టించిన పితామహుడు, మాతామహుల యందు కూడ నేనే యున్నాను. అందు బంధుత్వ మున వీరు ముఖ్యులు కనుక వీరిని ఉదాహరణముగ తెలిపి

నాడు. అట్లే ఇతర బంధువులు, మిత్రులు, జనులు, జంతువులు అన్నిటియందు తానే యున్నాడని తెలియవలెను. శత్రువు రూప మున కూడ మూలమున తానే యున్నాడు. భార్య, సంతతి ఇట్లెన్ని సంబంధము లున్నవో అన్నియు తానే. సాధకుని యందు ఇది స్థిరపడవలెను. ఇట్లు స్థిరపడక ఎన్ని తెలిసినను ఒకటే. అజ్ఞానము మిగులును.

ఏమి చూచినను, ఏమి విన్నను, ఏమి స్పృశించినను, ఏమి రుచి చూచినను, ఏమి వాసన చూచినను, ఏమి భావించినను, ఏ గ్రంథమందలి విజ్ఞానమైనను, ఏ శాస్త్రమైనను, అన్నిటి యందు తెలియవలసినది ఈశ్వరుడే. ఇంతకన్న ఏమి చెప్పవలెను. అయినను తెలియజెప్పుచున్నాడు.

పవిత్రమగు వస్తువులను ఆదరించుట చేతురుగాని, అందలి ఈశ్వరుని చూడరు. కుంకుమ, పసుపు, గంధము, అక్షతలు, సాంబ్రాణి, దీపము, పంచపాత్ర, హరివేణము, ఉద్ధరిణ- ఇట్లనేక పవిత్ర వస్తువులను వాడుచు నుందుము. ఎందుకు పవిత్రమని అడిగినచో, శుభము కలిగించునని సమాధానము చెప్పెదము. శుభమెందులకు కలిగించును? అని ప్రశ్నించినచో, పెద్దలు చెప్పిరి అందుము. నిజమునకు అందీశ్వర సాన్నిధ్యము ప్రస్ఫుటముగ నుండును. ఈశ్వరుని దర్శింపక ఇతరములన్నియు దర్శించుట దౌర్భాగ్యము. ఏ వస్తువునందు ఈశ్వరుని దర్శింతురో ఆ వస్తువు

పవిత్రమని తెలియుట జ్ఞానము. పవిత్రమగు వస్తువుల యందు కూడ ఈశ్వర దర్శనము కానపుడు వాని పవిత్రత అంతంత మాత్రమే. సమస్త సృష్టి ఈశ్వర నిర్మితమగుటచే, సమస్తము పవిత్రమే అని తెలియుట రాజవిద్య.

'ఓంకారము నేనే' అని మరియొక ఉదాహరణ మిచ్చినాడు. ఈశ్వరుడు సృష్టికి మూలము. సృష్టియందీశ్వరుడు ప్రణవ స్వరూపుడుగ నుండును. అనగ 'ఓం' అను నాదముగ సమస్తము నందును నిండి యుండును. ఆ నాద మాధారముగనే సర్వమును నిర్మాణమగును. నాదమను మూల స్తంభము ఆధారముగ సృష్టి వలయమంతయు ఏర్పడును. ఏర్పడిన వస్తువులందు కూడ నాదమే ఆధారముగ నుండును. మనయందలి ఈశ్వరుని మనము చేరు ప్రయత్నమున మనకు ప్రణవనాదము అనుభవమునకు వచ్చును. మనయందలి ప్రాణ ప్రవృత్తులకు మూలమై ప్రాణ మున్నది. ప్రాణమునకు మూలమై ప్రణవ మున్నది. అనునిత్యము జరుగుచున్న ప్రణవనాదమును అంతరంగమున అనుభవించ వచ్చును. ఋషులు, మునులు నిత్యము ఆ నాదమును అనుభ వించుచు, దానికి మూలమైన తత్త్వమును కూడుదురు.

ఓంకారనాదము వినబడుటయే ఓంకార ఉచ్చారణమునకు సిద్ధి. ఓంకారము ఏకాక్షరముగ పరబ్రహ్మము. ద్వయాక్షరిగ ప్రకృతి పురుషులు. త్రయాక్షరిగ త్రిమూర్తి తత్త్వము. ఓంకారమునందే

భూత భవిష్యత్ వర్తమానములున్నవి. ఓంకారము నందే మూడు వేదములున్నవి. ఓంకారమే కర్త కర్మ క్రియ. నామము రూపము లేని భగవతత్త్వమునకు ఓంకారము ప్రథమనాదము. అందలి నాదము ప్రథమ రూపము. భగవంతుని ప్రప్రథమ నామ రూపములు ఓంకారముగ ఋషులు దర్శించిరి.

మరియొక ఉదాహరణముగ "మూడు వేదములు నేనే" అని దైవము పలికినాడు. ఋక్, సామ, యజుర్వేదములు మూడు ప్రధానమగు వేదములు. ఉచ్చారణ, ప్రాణ స్పందనము, కర్మ నిర్వహణము సృష్టి యందుకల మూల త్రికోణము. మనయందు సంకల్ప ముచ్చరింపబడగ, దానిని ప్రాణ బలముతో, బుద్ధి బలముతో నిర్వర్తించు చుందుము. ఇందు సంకల్పము ఋగ్వేదము. తాళ లయాత్మకముగ సాగు ప్రాణస్పందనము సామ వేదము. బుద్ధి బలముతో సంకల్పమును ప్రాణశక్తి సహాయమున నిర్వర్తించుట యజుర్వేదము. ఈ మూడును నిత్యము మన యందు జరుగుచు నుండును. సంకల్పములు మనయందు అవతరించుచు నుండును. వానిని ప్రాణబలము, బుద్ధిబలముతో నిర్వర్తించుచు నుందుము. సంకల్పము ఇచ్ఛాశక్తి స్వరూపము. ప్రాణము జ్ఞానశక్తి స్వరూపము. బుద్ధి క్రియాశక్తి స్వరూపము. ఓంకారము రూపమున ఈ మూడింటికిని బలము కూర్చి ఈశ్వరుడు సృష్టి నిర్వహణము చేయుచున్నాడు. ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తుల

సమన్వయమున సృష్టి ఏర్పడుచు యున్నది. మనయందు కూడ ఇచ్ఛా జ్ఞాన క్రియల సమన్వయమే జీవన సిద్ధినిచ్చును. ఈ మూడు వేదములు గ్రంథము లనుకొనుట కన్న మూడు సజీవ ప్రవాహము లుగ గుర్తించుట శ్రేష్ఠము. ఈ మూడింటికిని మూలము ఓంకారము.

ఇట్లు ఈశ్వరుడు ఈ శ్లోకమున తన అస్థిత్వమును గూర్చి మరికొన్ని ఉదాహరణలు పేర్కొని యున్నాడు. "క్రతువు నేనే, యజ్ఞము నేనే, స్వాహాకారము నేనే, హోమ ద్రవ్యమును నేనే, మంత్రము నేనే, అగ్నిని నేనే, అగ్ని యందు సమర్పింపబడు ఓషధులు నేనే, నేయి నేనే, సమస్తమును హుతము గావించు వాడను నేనే యనియు, తండ్రిని నేనే, తల్లిని నేనే, తాతను నేనే, సమస్తమునందు తెలియబడువాడను నేనే, పవిత్ర వస్తువులుగ గోచరించునది నేనే, ఓంకారము నేనే, వేదమును నేనే అని ఉదాహరణ పూర్వకముగ తెలిపినాడు. అట్లే తరువాతి శ్లోకములలో కూడ మరికొన్ని ఉదాహరణలు తెలుపబూనినాడు.

(18)

# పరతత్త్వము

గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ నివాస శ్శరణం సుహృత్ ।
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజ మవ్యయమ్ ॥ 18

తాత్పర్యము : నేనే సమస్త జీవులకు గతి (లక్ష్యము). సమస్తమును భరించువాడను నేనే. సమస్తమునకు ప్రభువును నేనే. సాక్షియు నేనే. అందరికి నివాస స్థానము నేనే. నీకు హిత మొనర్చువాడను నేనే. నేనే సృష్టి స్థితి లయములకు మూలము. శాశ్వతమగు బీజమును కూడ నేనే.

వివరణము : నిజమునకు సమస్తమునకు మూలమైన తత్త్వము పరతత్త్వము కనుక పై తెలిపిన వన్నియు సహజముగ ఆ తత్త్వ లక్షణములే.

**గతి** : సమస్త ప్రాణికోటి పరతత్త్వము నుండియే క్రమముగ వెలువడినవి కావున, మరల పరతత్త్వమే చేరవలెను. పుట్టినచోటికే చేరవలెను. కనుక గతి అందరికిని ఒక్కటే. త్రిమూర్తుల కైనను గతి పరమాత్రయే.

**భర్త** : దేని నుండి ప్రాణికోటి పుట్టినదో దానిమీదే ఆధారపడి ప్రాణికోటి యుండును. నిజమునకు ఈ బ్రహ్మాండ సృష్టిని భరించునది పరతత్త్వము. జీవు లన్నియు వారు వసించు గోళములపై ఆధారపడును. గోళము లన్నియు సూర్యునిపై ఆధారపడి యుండును. సూర్యుడు సవితృమూర్తిపై ఆధారపడి యున్నారు. సవితృమూర్తి ఆదిత్యులపై ఆధారపడి యున్నారు. ఆదిత్యులు తమకు మూలమైన అదితిపై ఆధారపడి యున్నారు. అదితి పరతత్త్వముపై ఆధారపడి యుండును. సమస్త జగత్తునకు ఆధారమైన తత్త్వము తానే.

మానవులు మనస్సుపై ఆధారపడి జీవింతురు. మనసునకు శ్వాస ఆధారము. శ్వాసకు స్పందన మాధారము. స్పందనమునకు సూక్ష్మ స్పందన మాధారము. సూక్ష్మ స్పందనమునకు మనలోని చోటు ఆధారము. మనలో చోటుగ యున్న ఈశ్వరుడు మన కాధారము. ఆ ఈశ్వరుడే సృష్టి యందు సమస్తమునకు ఆధారము. పరతత్త్వమే ఈశ్వరుడగు చున్నాడు. సమస్తమును భరించు వాడగు చున్నాడు. అతడే భర్త. అతడే గతి.

**ప్రభువు** : ఎవరి నుండి సమస్తము వ్యక్తమై ఆధారపడి యున్నదో అతడే ప్రభువు. సాధారణ ప్రభువునకు, ఈశ్వరుడగు ప్రభువునకు తేడా యున్నది. సాధారణ ప్రభువులు పుట్టిన వారిని పాలింతురు. ఈశ్వరుడగు ప్రభువు జీవుల పుట్టుకకు, వారి ఆలన

పాలనకు కూడ స్వామియై యుండును. కనుక సాధారణ ప్రభువుల యందు ఉన్నటువంటి ఈశ్వరునే ప్రభువుగ భావింపవలెను. ప్రభువుల యందున్న ప్రభువును చూచుట నేర్వవలెను. అట్లే మనలను భరించు వారియందు ఉన్న ఈశ్వరుని గుర్తించి మన్నించ వలెను.

**సాక్షి** : అందరియందున్న ఈశ్వరుడే, అందరి చేష్టలకు సాక్షి. ప్రతి ఒక్కరు తనయందలి ఈశ్వరుడు తమను అను నిత్యము గమనించు చున్నాడని తెలిసి యుండవలెను. అట్టి ఎరుక వలన మనము అతిక్రమించి వర్తించుటను అరికట్టును. లోనుండియే ఈశ్వరుడు తాను అహర్నిశలు గమనించు చున్నాడని తెలిసిన వాడు సత్యమునే పలుకును. ధర్మమునే ఆచరించును. కర్తవ్యమునే నిర్వర్తించును. అట్టి వానిని కామిని, మోహిని, ఆసురి లక్షణములు స్పృశింప లేవు.

**నివాసము** : మన మందరము వసించు చున్నది దైవము నందే. నిద్రించుచున్నది కూడ దైవము నందే. మేల్కాంచు చున్నది కూడ దైవమునందే. దైవ ముండుటయే మన ముండుటగ యున్నది. మనము వర్తించున దంతయు దైవము నందే. మనము జీవించునది కూడ దైవమునందే. మన నివాసము శాశ్వతముగ దైవమునందే యున్నది. విశ్వమంతయు దైవమే నిండి యున్నపుడు, అందుగాక జీవులు మరెందు యుందురు. దైవమే మనముగ

యుండగ, మన మున్నామను భ్రాంతితో జీవింతుము. మన మున్నామని భావించుట మిథ్య. దైవమే మనముగ యున్నామని తెలుయుట జ్ఞానము.

**శరణం** : అందరికిని, అన్నిటికిని ఈశ్వరుడే శరణ్యుడు. అన్నియు ఈశ్వరునుండియే ఉద్భవించినవి గనుక ఇతర విషయ ముల నాశ్రయింపక, అన్నిటికిని మూలమైన దానినే శరణు జొచ్చ వలెను. ఇతరములను శరణము కోరుట కన్న దైవమునే ఎదుటి వానియందు దర్శించుచు శరణము కోరవలెను. అపుడు ఎదుటి వాని యందలి ఈశ్వరుడు ప్రతిస్పందించి, శరణము నిచ్చును.

**సుహృత్** : పరమాత్మ నీ హృదయమునకు హృదయము వంటివాడు. నీ ప్రాణమునకు ప్రాణము వంటివాడు. నీ తెలివికి తెలివి. అతడే నీయందు మిత్రునివలె వసించుచున్నాడు. అతని వలననే నీయందు ప్రాణము స్పందించుచున్నది. అతని వలననే నీయందు తెలివి ప్రకాశించుచున్నది. నీ యందలి ప్రజ్ఞా ప్రాణము లకు అతడే స్వామి. అంతకన్న సన్నిహితమగు మిత్రుడు మరొకడు లేడు. అతడే ప్రాణమిత్రుడు. అతడే ఆత్మబంధువు. బంధువుల యందు, మిత్రులయందు కూడ అతడినే దర్శించు చుండవలెను. అతనితో పెనవేసుకొనుటయే బంధుత్వము. అతనితో మైత్రి చేయుటయే నిజమగు మిత్రత్వము.

**ప్రభవః, ప్రలయః, స్థానం, నిధానం** : పరతత్త్వమే నిధానం.

నివాసము కూడ. అందుండియే సృష్టి ఉద్భవించి, వృద్ధి చెంది కాలానుసారము అందులోనికే లయమగు చుండును. సృష్టి స్థితి లయములకు మూలమై పరతత్త్వ మున్నది. మనము నిత్యము మనయందలి ఈశ్వరునుండే మేల్కాంచి కార్యక్రమములొనర్చి, మరల నిద్ర ద్వారా చేరు స్థానము గుర్తించినచో, స్థానము నిధానము అయిన పరమాత్మను తెలియవచ్చును. నిద్రయందు మనమున్నది ఈశ్వరునియందే. మనలను మేల్కొల్పునది ఈశ్వరుడే. మనము కార్యము లొనర్చు చుండగ ప్రజ్ఞా ప్రాణములను నిరంతరము అందించు చున్నది ఈశ్వరుడే. మరల మనలను నిద్రలోనికి గొనిపోవునది ఈశ్వరుడే. ఈశ్వరుడు మూలముగనే అంతయు ప్రభవించు చున్నది, లయము చెందుచున్నది. అది మూల స్థానము, నిధానము.

**బీజమవ్యయమ్** : ఈ పరతత్త్వము నాశరహితమైన బీజము. అనగ అందుండి అనంతముగ సృష్టి స్థితి లయములు జరుగుచునే యుండును. సృష్టి వ్యక్తమగుచు, వృద్ధి చెందుచు, లయమగుచు సాగుచునే యుండును. ఇట్లెన్నిమార్లు సృష్టి జరిగినదో ఎవ్వరును చెప్పలేరు. ఎంతమంది సృష్టి కర్తలు వచ్చిపోయిరో, వారి నామము లేమియో ఎవ్వరును చెప్పలేరు. ఇట్లవ్యయముగ, అనంతముగ సృష్టులు వచ్చిపోవుటకు ఆధారమైయున్న పరతత్త్వముగ నన్నెరుగు మని భగవానుడు అర్జునునకు బోధించినాడు.

(19)

# ద్వంద్వ స్థితులు

**తపామ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ ।**
**అమృతం చైవ మృత్యుశ్చ సదాసచ్చాహ మర్జున ॥ 19**

*తాత్పర్యము :* తపింపజేయువాడను నేనే. వర్షము కురిపించువాడను నేనే. వర్షము నిలుపుదల కూడ నేనే. మరణమును నేనే. అమృతత్త్వము నేనే. సద్వస్తువు నేనే. అసద్వస్తువు నేనే.

*వివరణము :* ఈ శ్లోకమున దైవము ద్వంద్వములు నేనే అని తెలుపుచున్నాడు. సూర్యకిరణముల ద్వారా జలములు తపింపజేసి, మరల వర్షము ద్వారా జలముల నందించు చున్నాడు. సృష్టి లయము చెందుట, మరల సృష్టింపబడుట కూడ ఇట్లే జరుగుచున్నది. శ్వాస పీల్చుట - శ్వాస వదలుట, ఇచ్చుట - పుచ్చుకొనుట, పొందుట - కోల్పోవుట, పుట్టుట - మరణించుట, పెరుగుట - తరుగుట, కనబడుట - కనబడకుండుట, కదలుట - కదలకుండుట, ఎగురుట - పడుట, వెలుగు - నీడ, రాత్రి - పగలు- ఇట్లు దైవమే రెండుగ ఏర్పడి క్రీడించుచున్నాడు. ఒకే

తత్త్వము ప్రకృతి పురుషులుగ ఏర్పడి, పరస్పర విరుద్ధమగు లక్షణములను సృష్టిలోనికి విడుదల చేయుచు, సృష్టి నిర్వ ర్తించుచు నుందురు. ప్రకృతి పురుషులుగను, ప్రజ్ఞ పదార్థములు గను, రెండు కిరణములుగ, రెండు శ్వాసలుగ ఒక దానినొకటి పోటీగ నేర్పరచి, సృష్టి నిర్వహణమును చేయుచున్నాడు.

సృష్టిక్రీడకు ఒకటి రెండు కావలెను. ఒకదాని కొకటి ప్రతి ముఖమై నిలువవలెను. ఒక తండ్రి నుండి పుట్టిన ఇద్దరు కుమారులు ఒకరికొకరు ప్రత్యర్థులై ఆడుకొనుచుండగ, తండ్రి చూచుచు నుండును. ఆడుకొనుటకు ప్రత్యర్థి ఆవశ్యకము. నిజమునకు ఆటయందే కుమారులిద్దరు ప్రత్యర్థులవలె వర్తింతురు. ఆట అనంతరము ఇరువురును తండ్రి కిరుప్రక్కలచేరి ఆనందిం తురు. అట్లు సృష్టియందు పరస్పర విరుద్ధమగు లక్షణములు తననుండే వెలువడుచున్నవని, తన లోనికే లయమగునని, వానికి మూలము తానేనని భగవానుడు తన సమన్వయమును ఆవిష్క రించు చున్నాడు. వచ్చిన ప్రతీది పోవచుండునని, కనపడినది అదృశ్యమగునని, అదృశ్యమైనది మరల కనపడునని ఇట్లు దృశ్యా దృశ్యములుగ సృష్టి యున్నదని తెలియజేసినాడు. ఇప్పుడు కనబడుచున్నది ఒకప్పుడు లేదు. కొంతకాలము తరువాత ఉండదు. శరీరమునందు పుట్టకముందు కూడ మనమున్నాము. శరీరమందున్నపుడు కనబడుచున్నాము. శరీరము పోయిన వెనుక

కూడ మనమున్నాము. శాశ్వతముగనున్న మనము కనబడినపుడు పుట్టెనని, కనబడనపుడు చచ్చెనని భావింతుమే కాని, మన మెప్పుడునూ యున్నాము.

ఆకాశమున తార లున్నవి. గ్రహము లున్నవి. అవి రాత్రి సమయమున కనిపించును. పగలు కనిపింపవు. కనిపించనపుడు లేదనుకొనుట, కనిపించినపుడు ఉన్నదనుకొనుట అజ్ఞానము. తారకలు, గ్రహములు ఎప్పుడునూ ఉన్నవి గదా! పాలయందు వెన్నె, నేయి కనిపింపక యున్నవి. అగ్ని సహాయమున అందలి వెన్న, నేయి దర్శింపవచ్చును.

ఇట్లుండుట లేకుండుటగ సృష్టి గోచరించును. అట్లే సత్యా సత్యములు గోచరించును. అట్టి ద్వంద్వ స్థితులకు మూలము తానే అని దైవము పలుకుచున్నాడు. రూపాయి బిళ్ళయందు బొమ్మ బొరుసు ఉండును. బిళ్లకు బొమ్మ ఎంత అవసరమో, బొరుసు కూడ అంతే అవసరము. బొరుసులేని బొమ్మలేదు. బొమ్మ లేని బొరుసు లేదు. పూర్ణ సత్యమందు అన్నియు ఇముడును. కనుక మనమెరిగిన సత్యము, మన మసత్య మనుకొనునది కలిపి సత్యమని, పూర్ణసత్యమున అన్నియు మిగులునని తెలియ జేయుచున్నాడు. అమృతత్వము తానైనపుడు మృత్యువు కూడ తానేనని, సత్యము తానైనపుడు అసత్యము కూడ తానేయని, పుణ్యము తానైనపుడు పాపముకూడ తానేయని,

దేవతలు తానైనపుడు అసురులు కూడ తానే యని, తన సమగ్రత్వమును శ్రద్ధతో తెలుయుమని, విభజించి చూడవలదని, విభజనము వివరము అవగాహన కొరకేయని తెలియజెప్పు చున్నాడు.

పదునొకండవ (11) అధ్యాయమైన విశ్వరూప సందర్శనమున తన సమగ్ర దర్శనము కూడ అర్జునకందించినాడు. ఇది తెలిసిన ఋషులు కాలానుసారము వర్తించుచున్న మంచి చెడుల ఆంతర్య మును దైవముగ ఎరిగి, తమవంతు కర్తవ్యమును నిర్వర్తించు చుందురు. వారు సృష్టియందు ఏ విషయమును ద్వేషింపరు, వర్జింపరు, తిరస్కరింపరు. అన్నిటియందు అంతర్యామి దైవమును దర్శించుచు తమ కర్తవ్యమును తాము నిర్వర్తించుచు నుందురు.

(20)

## కోరికలు

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।
తే పుణ్యమాసాద్య సురేంద్రలోక
మశ్నంతి దివ్యాన్దివి దేవభోగాన్ ॥ **20**

*తాత్పర్యము :* స్వర్గప్రాప్తిని వేడుకొనుచు, మూడు వేదము లధ్యయనము చేయువారు, సోమపానము కొరకై సోమయజ్ఞము చేసినవారు, పుణ్యకర్మలు చేసినవారు, పై విధముగ నన్ను పూజించినవారు సురేంద్ర లోకమును చేరి, దివ్యమగు భోగము లను అనుభవించు చున్నారు.

*వివరణము :* ఎవరు దేనిని గూర్చి ప్రార్థన చేసిన వారికది లభించుట సృష్టియందు సహజము. సంకల్పబలము, శుద్ధి, దీక్ష కలిగి దేనిని కోరి దైవమును ప్రార్థించినను, అద్దానిని దేవుడిచ్చుట జరుగుచు యుండును. ఆరాధకులు వారి స్వభావమును బట్టి అనేకానేకమగు కోరికలతో దైవమును ప్రార్థించుచు నుందురు. అసురు లొక రకముగ కోరుచుందురు. దేవతలు మరొక రకముగ

కోరుచుందురు. భోగభాగ్యములు, కీర్తిని, ఆరోగ్యమును, ఆయుష్షును, బలమును, వీర్యమును, విద్యను, వంశాభివృద్ధిని, రక్షణమును- ఇట్లెన్నియో విషయములను అన్ని సంప్రదాయముల వారును ఏదో ఒక విధముగ కోరుచునే యుందురు. గజతురగాది బలమును, పశుగణమును కోరువారుకూడ గలరు. వర్షము కోరు వారు, ఫలపుష్ప సంపదను కోరువారు, అందమును కోరువారు ఇట్లు కోటానుకోట్ల కోరికలు జీవులు దైవమును కోరుచునుందురు.

ఎప్పుడు, ఏ సమయమున, ఎవరికి ఏది తీరని లోటని పించునో, దానిని కోరుట సృష్టి సహజము. కోరినవారి కోరిక యందలి బలము, ఆ కోరికను తీర్చుకొను ప్రయత్నము నందలి బలమును బట్టి, కాలానుసారము కోర్కెలు తీరుచు నుండును. సంకల్పబలము, ప్రయత్నబలము లేని వారికి కోరికలు తీరు అవకాశము తక్కువ. పురుష ప్రయత్నమున్న చోటనే దైవాను గ్రహము కూడ కాలానుసారము తీరుచునుండును. తీరుట, తీరక పోవుట కాలమును బట్టి యుండును. ఇందు జీవుల కోరిక ఇచ్ఛా శక్తి సంబంధితము. ఇచ్ఛ యందలి బలమే ఇంధనముగ ప్రయత్నము సాగును. ప్రయత్నబలము క్రియాశక్తి స్వరూపము. కేవలము ఇచ్ఛ యున్న చాలదు. అది క్రియా రూపమును ధరింప వలెను. అట్లే ప్రయత్నము జ్ఞానపూర్వకముగ నుండవలెను. ఇచ్ఛను పరిపూర్ణము గావించుకొనుటకు తగిన జ్ఞానము, అటుపై ప్రయత్న మున సమర్థత ముఖ్యము. ఇట్లు ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులవలన

కోరికలు ఫలింపవచ్చును. ఫలించునని నిశ్చయముగ చెప్పలేము. ఫలించుట, ఫలింపకుండుట కాలము చేతిలో యున్నది. సృష్టి యందు దైవమే కాలరూపమున వర్తించు చుండును. కాలాను సారముగ త్రిశక్తుల బలమాధారముగ కోరికలు ఫలించు చుండును. కనుక కోరికలు తీరుట అనునది దైవానుగ్రహమని తెలియవలెను.

ధర్మమార్గమున పై విధముగ అర్ధకామములను పొంద వచ్చును. అట్లే సోమపానము చేయవచ్చును. అట్లే యజ్ఞముల ద్వారా, పుణ్య కార్యములద్వారా సుఖ సంతోషములను పొంద వచ్చును. సురేంద్ర లోకమును గూడ పొంది దివ్యమగు భోగము లను కూడ పొందవచ్చును. ఇట్లు దైవప్రార్థన ద్వారా ఇచ్ఛా జ్ఞాన క్రియలద్వారా దైవానుగ్రహము పొంది, సృష్టియందు అనేక విధములగు భోగములు పొందవచ్చును.

ఈ శ్లోకము ద్వారా దైవము ఎవరికేది లభించినను తన అనుగ్రహముననే లభించు చున్నదని తెలియజేయు చున్నాడు. తానే కర్తనని జీవుడు భావించినను, నిజమునకు అతనియందు కాలానుసారము సంకల్ప మేర్పడుట, తదనుగుణ జ్ఞానము లభించుట, క్రియాబలము సంప్రాప్తించుట, ఇత్యాదివన్నియు అతని యందలి ఈశ్వరుని బలము చేతనే జరుగుచున్నవి.

ఇట్లు సృష్టియందు తానే కామధేనువని, తానే కల్పవృక్షమని,

తనను ప్రార్థించుటవలన కాలము, త్రిశక్తులు అనుకూలమై కోరికలు సిద్ధించునని తెలియజేయు చున్నాడు.

ఈ శ్లోకమున సకామ కర్మమార్గమునకు కూడ తానే అధిపతి నని తెలుపుచున్నాడు. ఇట్టి సకామభక్తులు పూర్ణ వికాసము కలిగిన వారు కాదు. వీరు పునరావృత్తి మార్గమున జనన మరణ సంస్కార చక్రమునందు తిరుగాడుచు నుందురు. వారి కోరికలచే వారిని వారే బంధించుకొను చుందురు. కోరిక ఏదైన అది బంధమునకు మార్గమే యగును. ఇనుప సంకెళ్ళతో బంధించినను, బంగారు సంకెళ్ళతో బంధింపబడినను, బంధము బంధమే యగును. భోగములం దాసక్తి జీవుని భోగపరునిగ బంధించును. భోగములు రోగములకు కూడ హేతువు లగుచుండును. భోగ రోగముల నడుమ జీవితము సాగుచుండును. ఎన్ని జన్మలెత్తినను కామము లను పూరించుట సాధ్యము కాని పని. చిల్లుకుండలో ఎంతనీరు పోసినను అది నిండుకుండ కాజాలదు. అయినప్పటికిని ఈ జ్ఞానము కలుగువరకు జీవులు కోరుచునే యుందురు. కనుక జనన మరణము లనుభవించుచునే యుందురు. కామ్యకర్మ జీవునకు పరిష్కారము కాదు. నిష్కామకర్మయే పరిష్కారము.

(21)

## జనన మరణ చక్రము

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా
గతాగతం కామకామా లభంతే ॥ 21

*తాత్పర్యము :* దివ్యలోకములందు విస్తృతముగ దివ్య భోగానుభవము అనుభవింపగనే, చేసిన పుణ్యము క్షీణించుట వలన మరల జీవులు మర్త్యలోకములందు ప్రవేశించుచున్నారు. అర్థకామములను ధర్మము నాశ్రయించి పొందుచున్నవారు ఇట్లు స్వర్గలోకమునకు, మర్త్యలోకమునకు నడుమ రాకపోకలను పొందుచు నున్నారు.

*వివరణము :* భోగముల ననుభవించుచుండగ చేసిన పుణ్యము క్షీణించుచు నుండును. విశేషమగు పుణ్యమార్జించిన వారు సుఖ భోగములను పొందుచు నుండగ పుణ్యము క్షీణించుచు నుండును. పుణ్యము క్షీణించగనె సుఖము, భోగము అంతరించును. అపుడు మరల సుఖమునకై, భోగమునకై

ప్రయత్నించుట యుండును. ధనము కూడబెట్టినవాడు ఆ ధనమును వెచ్చించుట వలన భోగములు లభించుచు నుండును. ధన మనగా కేవలము రూపాయినోట్లు కాదు. సుఖప్రాప్తి నిచ్చు ప్రయత్నము లన్నియు ధనార్జనము వంటివే. ఆర్జించునది ఖర్చు కాగానే మరల ఆర్జింపవలెను. ఆదాయము, ఖర్చుగ చక్రము తిరుగుచు నుండును. ఒక మాసమంతయు ఆర్జించినది, ఒక రోజులో ఖర్చుకాగలదు. ఒక సంవత్సరమంతయు ఆర్జించినది కూడ ఒక రోజు ఖర్చునకే సరిపోగలదు. భోగము లట్టివి. భోగాసక్తి గలవానికి ఎంత ఆర్జనమైనను చాలదు. భోగమార్గమున పుణ్యము త్వరితగతిని క్షీణించును. స్వదేశమున పది సంవత్సరములు సంపాదించినది విదేశములలో ఒక సంవత్సరములో ఖర్చు కాగలదు.

అట్లే మరణముగల భూలోకమున సంపాదించిన పుణ్యము పితృలోకమునందు, దేవలోకమునందు త్వరితగతిని హరింప బడును. భూలోకమున 30 దినముల పుణ్యము పితృలోకమున ఒకరోజు భోగముతో సమానము. అట్లే భూలోకమున ఒక సంవత్సర మంతయు చేసిన పుణ్యము దేవలోకమున ఒక రోజు భోగముతో సమానము. వంద సంవత్సరములు అనుస్యూతముగ పుణ్య మొనర్చిన మానవుడు వందరోజులు మాత్రమే ఇంద్రలోక భోగము లనుభవించి మరల భూమిని చేరును. అధోలోకము నందలి పుణ్యము ఊర్ధ్వలోకముల భోగము ఇట్టి నిష్పత్తిలో నుండును.

కనుక ఎంత పుణ్యమార్జించినను, దాని ఫలము ఊర్ధ్వ లోకము లందు శీఘ్రముగ హరింపబడి, మరల జీవులు మరణముతో కూడినటువంటి భూలోకమున చేరుదురు. ఇది ఎంత అవివేక మగు కార్యక్రమము. వందసంవత్సరముల శ్రమకు మూడు నెలల పదిరోజుల అనుభూతి! ఇది తెలియక స్వర్గసుఖములు కోరువారు అనంతకాలము శ్రమపడుచు నుందురు. ఇది నిజమునకు లాభసాటి వ్యాపారము కాదు. కామ్యకర్మ మార్గమిట్లే యుండును. భోగమున మార్గమిట్లే యుండును.

నిజమునకు సుఖమునందు కాలము త్వరితగతిని సాగు చున్నట్లుండును. దుఃఖమునందు నిదానముగ సాగుచున్నట్లు వుండును. సుఖముగ కూర్చుండి పరిహాసముతో భాషణము సాగు చున్నపుడు కాలము క్షణములో అయిపోయినట్లుండును. విషయా సక్తితో భాషణమున పడినవారికి కాలము తెలియదు. కాని వేదనతో బాధపడుచున్నవారికి ప్రతి నిమిషము ఒక జామువలె నుండును. సరస సంభాషణములందు జాము ఒక క్షణముగ గడచిపోవును. పుణ్యవ్యయమునకు కాలము శీఘ్రమై యున్నది. పుణ్యమార్జించు టకు కాలము అతినెమ్మదిగ గోచరించును. ఆరు గంటలు వరుసగ పనిచేయుటకును, ఆరు గంటలు నిద్రించుటకును గల వ్యత్యాసమే పుణ్యమార్జించుటకును, వెచ్చించుటకును గల వ్యత్యాసము. కనుక దివ్యభోగములు కోరుట అవివేకమని తెలిసిన యోగులు, ఋషులు దైవయోగము నాశ్రయించిరి. అట్టివారు

జీవులలో కొందరే. ఇతరులు భోగాసక్తులై కామాభిలాషులై రాకడ, పోకడగల జనన మరణ చక్రమున తీరుబడి లేక, అనంత కాలము తిరుగాడు చుందురని భగవానుడు  తెలుపుచున్నాడు.

పుణ్యమాశించి పనిచేయుట అవివేకము. భగవద్గీత మార్గమున శ్రేయస్సు నుద్దేశించి, కర్తవ్యము నాచరించుటయే యున్నదిగాని, పుణ్యమును భోగమును ఆశించుట బోధింపబడ లేదు. కర్తవ్యమునందే జీవున కధికారమున్నది గాని, ఫలమునందు లేదని దైవము స్పష్టముగ తెలిపినాడు. భగవద్గీత యందు కామ్యకర్మ ప్రోత్సహింపబడలేదు. కర్తవ్యకర్మే నిర్దేశింపబడినది. కర్తవ్య కర్మమునే స్వధర్మమని, కార్యం కర్మయని భగవానుడు పేర్కొనినాడు. కర్తవ్యాచరణము నందే శ్రేయస్సున్నది. ఫలముల నాశ్రయించక, కర్తవ్యమునే నిర్వర్తించమని (*అనాశ్రిత కర్మఫలం కార్యం కర్మ కరోతియః*) భగవానుడు నిర్దిష్టముగ తెలిపినాడు. అట్టివాడు జనన మరణ చక్రము నుండి విముక్తి చెంది శాశ్వత ధర్మపథమందు శాశ్వతుడై జీవించును.

కోర్కెలు తీర్చుకొను మార్గమున జన్మల తరబడి శ్రమించుట కన్న, దైవమును చేర్చు యోగమార్గమును ఆశ్రయించుట ఉత్తమమని తెలియవలెను. కోరికలకై దైవమును ప్రార్థించుటగ కాక, దైవము కొరకే దైవమును ప్రార్థించుట ఋషి మార్గము.

(22)

# అభియుక్తుడు

**అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥22**

*తాత్పర్యము :* అనన్యచింతనము, పరిఉపాసనము, నిత్య అభియుక్తత ఏ జనులైతే నిర్వర్తింతురో అట్టివారి యోగ క్షేమము లను నేను వహించుచున్నాను.

*వివరణము :* భగవద్గీతయందు మూడువందల అరువదవ (360) శ్లోకమిది. ఒక వృత్తమునకు 360 డిగ్రీ లుండును. ఒక సంవత్సరమునకు 360 దినము లుండును. 360వ శ్లోకము భగవద్గీత యందలి కొలికిపూస. 18 అధ్యాయములు గల భగవద్గీత యందు 9వ అధ్యాయమగు 'రాజవిద్య - రాజగుహ్యాము' హృదయము వంటిది. అందీ 22వ శ్లోకము భగవంతుని వాగ్దానము. ఈ శ్లోకము ననుసరించిన జీవుడు లోకమున ధీరుడై యుండును. అట్టి వానికి ఈ సృష్టియందు ఎట్టి కోరిక యుండదు. ఎట్టి భయము ఉండదు. ఎటువంటి ఆరాటము ఉండదు.

సతతము ఆత్మయందు సర్వభూత మహేశ్వరుడగు పరమేశ్వరునితో రమించుచు, జీవించుచు నుండును. అట్టి జీవునకు, పరమేశ్వరునకు అభేద స్థితి ఏర్పడును.

ఈ శ్లోకమున మూడు పదములు విశిష్టముగ వాడబడినవి. 1. అనన్యచింతన, 2. పర్యుపాసన, 3. నిత్యఅభియుక్తత. ఈ మూడు పదములు దాదాపుగ ఒకే సాధనను సూచించును.

అనన్యచింతన అనగా ఎప్పుడునూ దైవమునే చింతించుట లేక భావించుట. కనబడుచున్న దంతయు దైవమే. వినబడుచున్న దంతయు దైవమే. ఇంద్రియముల ద్వారా గ్రహించునదంతయు నిజమునకు దైవమే. సమస్త సృష్టియంతయు తానే నిండియున్నానని ముందు శ్లోకములలో దైవము తెలియపరిచి యున్నాడు. కనుక అంతయు దైవ స్వరూపమే అనెడి భావన మనయందు స్థిరపడినచో అంతటిని దైవముగ చూచుట వీలుపడును. ఇది నిత్య జీవన సాధన. దీనివలన నిత్య జీవన యోగము లభించును. భార్యను భర్త చూచినపుడు భార్య ఈశ్వర స్వరూపమే. యథార్థ మదియే. కాని భార్య గుర్తువచ్చునా? ఈశ్వరుడు గుర్తు వచ్చునా? ఇక్కడే సాధకుని సాధన తేలిపోవును. అట్లే ఏమి చూచినను, దేనిని చూచినను, ఎవరిని చూచినను ఆ కనపడు చున్నది ఈశ్వరుడే అను భావన కలుగవలెను. ఇతరములుగ గోచరించినదంతయు ఈశ్వరుడే అను భావన సిద్ధించవలెను. ఉన్న దీశ్వరుడే అయినను, జీవులు దానిని ఈశ్వరునిగ చూడక మరొక దృష్టితో చూచుదురు.

తల్లి, తండ్రి, గురువు, తాత, తాతమ్మ, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు, బంధువులు, మిత్రులు, తెలిసినవారు, తెలియనివారు- అందరి యందు ఉన్నదీశ్వరుడే. సచేతనముల యందు, అచేతనములందు కూడ ఉన్నది ఈశ్వరుడే. ఇట్టి భావన స్థిరపడ వలెను. ఈశ్వరుడు కాని దేదియు సృష్టియం దేమియు లేదని నిశ్చయముగ తెలియవలెను. తనయందు, తన పరిసరముల యందు ఈశ్వరుడే అనేక రూపములతోను, నామములతోను ఉన్నాడని తెలియవలెను. దినచర్య అంతయు ఈశ్వర దర్శనమున సాగిపోవలెను. పని ఈశ్వరుడు, పనిముట్టు ఈశ్వరుడు. తనతో సహకరించువాడు ఈశ్వరుడు. సహకరించని వాని రూపమున గూడ ఈశ్వరుడే యున్నాడు. ఇట్లు దినమంతయు ఈశ్వర దర్శనమునకే ప్రయత్నించవలెను. కనపడిన పురుగు, పాము, పక్షి, వృక్షము, జంతువు, మనిషి- ఇట్లేమి కనిపించినను ఈశ్వరుడే ఇట్లున్నాడని తెలియవలెను. అన్యచింతన క్రమముగ అదృశ్యమై, అనన్యమగు ఈశ్వరుని దర్శించుట సిద్ధింపవలెను.

పై విధముగ సమస్తమును ఈశ్వరునిగనే చింతించు వానికి ఈశ్వర ఉపాసనము జరుగును. అనగా వస్తువులతోను, జీవుల తోను సంబంధముకాక అన్నిటి యందున్న ఈశ్వరునితో సంబం ధము పెరుగును. ఇట్లీశ్వర సంబంధము పెరుగగ, సాధకుని ప్రజ్ఞ అంతట నిండియున్న ఈశ్వరునికి దగ్గరగ చేరి వసించుట యుండును. దగ్గరగ వసించి యుండుట ఉప ఆసనము అని అందురు.

ఏదో ఒక రూపమునకు, నామమునకు పరిమితమైన సాధకుడు ఇతరమునంతను దైవముగ దర్శించడు. అతనికి దైవ మనగా తాను పరిమితము చేసుకొన్న నామము, రూపమే. ఇతర మంతయు దైవహీనమై యుండును. అట్టి మూర్ఖులే సృష్టియందు అసంఖ్యాకములై యున్నారు. నామ రూపముల కతీతమైన ఈశ్వరుని, నామ రూపముతో పరిమితము చేసుకొనుట వలన సాధకుని బుద్ధి కూడ పరిమితమగును. అట్టి వారియందు భేద భావమెక్కువ. సత్యదర్శనము మృగ్యము. రాముడే దైవమను కొనుట, శివుడే దైవమనుట, గణపతియే దైవమనుట, సూర్యుడే దైవమనుట, లలితయే దైవమనుట, విష్ణువే దైవమనుట అవివేకము. అట్టి రూపములందు, నామము లందు దైవమున్నాడు కాని, వాటికే పరిమితమై దైవము లేడు. చూడగలిగిన వారికి సమస్తము దైవము. ఇట్టి అపరిమితము, విశాలమగు చింతన ఆవశ్యకమని భగవానుడు బోధించుచున్నాడు. అట్టి అనన్య చింతన గలవానికి అన్నిట, అంతట అనునిత్యము దైవము గోచరించుచునే యుండును. అట్టివాడు పరి ఉపాసకుడు. అనగా ఉపాసనమందు పూర్ణస్థాయికి చేరినవాడు. అట్టి వానికి లోపల బయట కూడ దైవమే గోచరించుచు నుండును. ఇతరములు గోచరింపవు.

పై విధముగ సాధన చేయువాడు నిత్యము ఈశ్వరునితో కూడి యుండును. అభియుక్తుడై యుండును. విభక్తుడు కాక

యుండును. అట్లు అభియుక్తుడైన వాడు దైవమువలెనే పూర్ణు డగును. దైవము పూర్ణుడు. అతనితో నిత్యము అభియుక్తుడైన వాడు కూడ పూర్ణుడే అగును. అట్లు పూర్ణముతో కూడి పూర్ణుడు కాగా, అతనినుండి దివ్యసంకల్పము, దివ్యజ్ఞానము, క్రియ వ్యక్త మగు చుండును. కనుక ఈ శ్లోకము సాధనకు పరాకాష్ఠ.

పూజలు చేయువారు కొంత తడవు దైవముతో కూడి యుండుట జరుగవచ్చును. అట్లే హోమము చేయువారు, స్తోత్రము చేయువారు, ధ్యానము చేయువారు, స్మరణ చేయువారు, కీర్తన చేయువారు ఆయా సమయములందు దైవముతో కూడి యుండ వచ్చును. ఇతర సమయములలో అట్టి కూడిక యుండదు. ఎప్పుడునూ కూడియుండు వానికి, అపుడపుడు కూడియుండు వానికి వ్యత్యాసము ఏనుగునకు దోమకు గల వ్యత్యాసమువలె యుండును. ఈ శ్లోకమున సాధన అనుక్షణమై యున్నది. అనునిత్యమై యున్నది. నిరంతరమై యున్నది. ఇట్టి నిరంతర అభియుక్తి వలన జీవుడు దైవము నందిమిడి పోవును. దైవము జీవుని యందు పరిపూర్ణముగ నిండిపోవును. అట్టి యోగము పూర్ణమగు క్షేమము నిచ్చును. వశిష్ఠాది బ్రహ్మర్షులు ఇట్టి యోగము నందే శాశ్వతముగ నిలచి యున్నారు.

## 23

# త్రికరణశుద్ధి

**యేఽప్యన్య దేవతాభక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ ॥ 23**

*తాత్పర్యము :* విధిపూర్వకము కాకున్నను, భక్తి శ్రద్ధలతో ఎవరైతే ఇతర దేవతలను ఆరాధించుచున్నారో, వారు కూడ నన్నే ఆరాధించు చున్నారు.

*వివరణము :* సమస్త దేవతల రూపమునను నేనే అధిష్ఠించి యున్నాను. దేవతలే అన నేల? సమస్త జీవరూపములును నేనే అధిష్ఠించి యున్నాను గదా! కనుక ఏ దేవతా రూపము నారాధించి నను నన్నారాధించినట్లే. నామరూపములతో కూడిన దేవతల నారాధించినపుడు వారు నన్నే ఆరాధించుచున్నను అట్టి వారి ప్రజ్ఞ పరిమిత మగుచుండును. కారణమేమనగా వారు సర్వవ్యాప్తి యగు నన్ను ఒక నామమునకు, రూపమునకు పరిమితము చేసుకొను చున్నారు. అంతట వ్యాప్తి చెందిన నన్ను కేవలము ఒక రూపమునకు, ఒక నామమునకు పరిమితముచేసి ఆరాధించు నపుడు వారి ప్రజ్ఞ, బుద్ధి పరిమితమగును. వారు ఇతర రూపములు,

నామములతో నున్న జీవుల నధిష్ఠించియున్న నన్ను తిరస్కరింతురు. అనేకానేక రూపములతో విశ్వరూపుడనై యున్న నన్ను వారు తెలియలేరు. కేవలమొక రూపమునకే, ఒక నామమునకే పరిమితమై ఇతరమంతను నిరాకరింతురు. అట్టి నిరాకరణము వలన వారు నన్ను పొందలేకున్నారు. అట్లు పొందలేక, తమకు నచ్చిన నామమే దైవమని, తమకు నచ్చిన రూపమే దైవమని నిర్ధారించుచు, సిద్ధాంతము లేర్పరచి, రాద్ధాంతము చేయుచుందురు. ఇట్టివారే దేవుని పేరిట యుద్ధములు, మారణకాండ సృష్టింతురు. మా దైవము గొప్పది, మా దైవమే అందరికి శరణ్యము, మేము నమ్మిన నామ రూపమే సర్వమునకు రక్ష, ఇత్యాది ఉన్మాద పూర్వకమగు భాషణములు చేయుచు కల్లోలములు, కలహములు పెంచుకొనుచు నుందురు.

ఉన్నది ఒకే దైవము. అన్ని రూపములు అతని నుండే ఏర్పడినవి. అన్ని నామములు కూడ అతని నుద్దేశించినవే. అతడు సర్వవ్యాపి. సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. అతడు సర్వజీవుల నధిష్ఠించి వారి హృదయములలో నున్నాడు. అన్నిట, అంతట, అన్ని కాలముల యందు తెలియబడు ఈశ్వరుని ఒక ప్రదేశమునకు, ఒక కాలమునకు, ఒక రూపమునకు పరిమితము చేయుట మనోవికాసము లేనివారు మాత్రమే చేయుదురు. వీరి మూలముగనే మతకల్లోలములు, యుద్ధములు పుట్టును.

అట్టివారు గూడ శ్రద్ధ భక్తి కలిగి త్రికరణశుద్ధితో భజించి

నపుడు, ప్రార్థించినపుడు తాను ప్రసన్నుడై వారి మార్గదర్శకత్వము వహింతునని పరమాత్మ సూచించుచున్నాడు. భక్తితోపాటు జ్ఞానము కూడ వికసింపవలెను. జ్ఞానములేని భక్తి మూఢత్వము కలిగించును. కనుక భక్తి శ్రద్ధలతో ఆరాధనము సలుపువారికి దైవము జిజ్ఞాస కలిగించును. జ్ఞానమునందాసక్తి కలిగించును. జ్ఞాన సముపార్జ నము జరుగుచుండగ భగవంతుని స్వరూప స్వభావములు, లక్షణములు క్రమముగ భక్తునికి అవగతమగును. జ్ఞానముచే అజ్ఞానము దహింపబడగ, పరిమితమగు తన అవగాహన క్రమముగ అపరిమితము అగుచుండును. నిరాకరణ తగ్గుచు నుండును. అన్నిటి యందును దైవమును చూచు ప్రయత్న మారంభ మగును. ఇట్లు సంభవించుటకు భక్తి శ్రద్ధలు ప్రధానము. యాంత్రికముగ దైవారాధన చేయువారికి ఎట్టి వికాసము ఏర్పడదు. మూఢ నమ్మకములు, అంధ విశ్వాసములు, దైవమును గూర్చిన భయము ఇత్యాదివి వారిని బంధించి సంప్రదాయములకు బద్ధులను చేయును. కనుక ఆరాధన విషయమున భక్తి శ్రద్ధలు ప్రధానము. త్రికరణశుద్ధిగ ఆరాధన చేయుటయే భక్తి శ్రద్ధ యుతమైన ఆరాధన. అట్టి వారియందు దైవమే ప్రసన్నుడై జ్ఞాన వైరాగ్య యోగమార్గములను క్రమముగ పరిచయము చేయును. వారి భక్తి శ్రద్ధలకు ముచ్చటపడి, వాత్సల్యముతో దైవమే దారి చూపుట అనుగ్రహము.

త్రికరణశుద్ధిగల మూర్ఖుల ననేకులను దైవము మహా

జ్ఞానులు గను, మహర్షులుగను తీర్చిదిద్దినాడు. వాల్మీకి, కాళిదాసు అట్టి వారు. వారెంత మూర్ఖులైనప్పటికిని, వారి త్రికరణశుద్ధియే వారికి వరమై సర్వజ్ఞతకు దారి చూపెను. ఈ శ్లోకము, ఈ రహస్యమును ఆవిష్కరించుచున్నది. ఇచ్చట భక్తి శ్రద్ధలనగా త్రికరణ శుద్ధియే. లౌక్యము, తెలివితేటలుగల వారికన్న త్రికరణశుద్ధి గలవారే దైవమునకు ప్రీతిపాత్రులు.

(24)

# తత్త్వదర్శనము

**అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।**
**న తు మామభిజానంతి తత్త్వేనాత శ్చ్యవంతి తే ॥ 24**

*తాత్పర్యము :* వివిధ దేవతా రూపములను ఆరాధనము చేయువారు తత్త్వ దర్శనము చేయజాలకున్నారు. సర్వయజ్ఞము లకును ప్రభువును, భోక్తను నేనే అని తెలియలేకున్నారు. కనుక వారు జారిపోవుచున్నారు.

*వివరణము :* దైవారాధన పై శ్లోకములో తెలిపిన విధముగ ఒక నామమునకు, ఒక రూపమునకు పరిమితమైనపుడు తత్త్వాను భూతి యుండదు. దైవతత్త్వము సర్వవ్యాపకము, సర్వజ్ఞము, సర్వ శక్తిమంతము. సర్వకాలముల యందు, సర్వదేశముల యందు, సర్వ సన్నివేశములయందు తత్త్వతః దైవ మందుబాటులోనే యున్నాడు. మనము చూచినదంతయు దైవముతోనే నిండి యున్నది. మనము వినునదంతయు కూడ దైవముతోనే నిండి యున్నది. ఇతరులు మనలను చూచునపుడు వారిలో నుండి దైవమే మనలను చూచుచున్నాడు. అట్లే ఇతరులు భాషించు

నపుడు వారి నుండి శబ్దమూలమగు నాదముగ తానే వినిపించు చున్నాడు. మనము పరిసరములను చూచునపుడు అందు యథార్థముగ దైవమే యున్నది. పరిసరములనుండి మనలను గమనించునది కూడ దైవమే. అట్లే లోపలి నుండి కూడ చూచుచు నుండును మరియు మనలను వినుచును యుండును. మనకు కూడ లోపలున్న దైవమును వినుట, చూచుట సాధ్యపడును.

నిజమునకు మనమున్నది దైవమునందే. దైవము నందే చరించుచున్నాము. మన ముండుట యనగా దైవ ముండుటయే. ఏ దిక్కునకు పోయినను అన్ని దిక్కులయందు దైవమే యుండును. ఇట్లు దైవమునందుండి, దైవ మాధారముగ జీవుడు తన్నుతాను పరితృప్తిని గావించుకొను కార్యమున ఇమిడి కృషి సలుపును. ఎవ్వరును దైవ ప్రాకారము దాటి పోలేరు. అందుండియే దానిని చూడలేకపోవుట విచిత్రమగు అజ్ఞానము. నీటియందున్న చేప నీటిని వెదకుకొనుచున్నట్లుగ, దైవమందున్న జీవుడు దైవమును వెదకికొను చుండును. అన్నిట, అంతట, లోపల, బయట సమస్తము నిండియున్నవాని యందుండి దైవమును గుర్తింప లేకుండుటకు కారణము దైవతత్త్వము నెరుగలేక పోవుటయే.

*"తత్త్వేనమామ్ అభిజానంతి"* తత్త్వపరముగ నన్ను తెలియ లేకున్నారు అని దైవము పలుకుచున్నాడు. కనుక దర్శన స్పర్శన భాషణాది అనుభూతులను చెందలేకున్నారు. దైవమును చూడక ఇతరములను చూచుట వలన లోకములోనికి జారిపోవుట సంభ వించు చుండును. దైవము నుండి అభివ్యక్తమగుచున్న ప్రకృతి

పొరలలో దైవమునే చూచుట యథార్థమగు దర్శనము. ఎన్ని రకముల వేషములు వేసినను అట్టి వేషములను ధరించిన నటుని గుర్తించినట్లు సమస్త సృష్టియందు నటించుచు నర్తించుచునున్న దైవమును చూచుట నిత్యము సాధనగ సాగవలెను. లేనిచో కనిపించినను చూడలేరు. వినిపించినను వినలేరు. ఇది నిజమగు పతన స్థితి.

పై విధముగ దైవమును దర్శించ లేకుండుటకు, విన లేకుండుటకు, స్పృశించ లేకుండుటకు ముఖ్యకారణ మొక్కటియే. అదియే తత్త్వజ్ఞాన లేమి.

సంప్రదాయబద్ధులై ఏదో ఒక భగవద్రూపమునకు, ఒక భగవన్నామమునకు కట్టుబడి యుండువారు తద్భిన్నమగు కోటానుకోట్ల సృష్టిరూపములను దర్శించినపుడు, అవి దైవ రూపములే అని గుర్తించలేరు. కనుక గ్రుడ్డివారు, చెవిటివారు దైవమునందే జీవించుచు దైవమును తెలియలేక అజ్ఞానులై పడియున్నారు. ఇది మానవజాతి దుస్థితి. తాము నమ్మికొన్న నామమే దైవ నామమని, తాము నమ్మికొన్న రూపమే దైవ రూప మని సంకుచితమగు భావములలో బంధింపబడి భేదములు సృష్టించుకొనుచు, కలహించుకొనుచు, రక్తపాతములు సృష్టించుచు దేవుని పేరున అధోగతి చెందుచున్నారు. చ్యవనము చెందు చున్నారని దైవము పలికినాడు. అన్ని ప్రార్థనలు ఒకే దైవమును చేరునను భావన ప్రధానము. యజ్ఞములు, క్రతువులు, కీర్తనలు,

భజనములు, జపములు, ధ్యానములు అన్నిటి గమ్యము నేనే. అన్నిటికిని ప్రభువు నేనే. నన్ను తత్త్వపరముగ తెలియకపోవుట వలన మానవులు చిక్కులు పొందుచున్నారు.

ఆకాశము నుండి భూమిపై వర్షము పడినపుడు అన్ని ఖండములయందు వర్షపునీరు నదులై పారుచుండును. అన్నిటి యందున్నది వర్షపునీరే. కాని గంగ యని, గోదావరి యని, కృష్ణ యని, కావేరి యని, నైలునది యని, అమేజాను నదియని, మిసిసిపి, మిస్సోరియన్, రైను, రోను అని కొన్ని వేలాది నదులుగ భూమిపై పడిన నీరు పిలువబడుచున్నది. ఒక్కటియే పది రకములుగ అవతరించినపుడు అన్నిటియందును ఆ ఒకటిని చూచుట తత్త్వజ్ఞానము. పది రకములుగ చూచుట, ఒకటి అంగీకరించి ఇతరములను నిరాకరించుట మార్గము కాదు. భిన్నత్వమందు ఏకత్వము దర్శించుటే జ్ఞానము. అట్టి జ్ఞానము లభ్యమగుటకు దైవముయొక్క స్వభావ స్వరూపముల నెరుగవలెను. అట్లెరుగక, భజన చేయువారు ఊరకే భూమిపై చప్పుడు చేయుచునుందురు. రాముడెవరో తెలియక రామభజన చేయుటవలన రాముడు లభింపడు. బ్రహ్మమే రాముడుగను, బ్రహ్మమే కృష్ణుడుగను, త్రిమూర్తులుగను, సమస్త దేవతా ప్రజ్ఞలుగను, సమస్త సృష్టిగను, సమస్త జీవుల మూలముగను యున్నాడని తెలియనంత కాలము దైవమును గూర్చిన అల్లరులే యుండును గాని అవగాహన యుండదు. ఇది ఈ శ్లోకము యొక్క పరమార్థము.

## 25

# పరమపదము

యాంతి దేవవ్రతా దేవాన్
పితౄన్ యాంతి పితృవ్రతాః ।
భూతాని యాంతి భూతేజ్యా
యాంతి మద్యాజినోఽపి మామ్ ॥ 26

*తాత్పర్యము :* దేవతల నారాధించువారు దేవతాలోకములు చేరుదురు. పితృదేవతల నారాధించువారు పితృలోకము చేరుదురు. భూతప్రేతముల నారాధించువారు ఆ లోకములను చేరుదురు. నన్నారాధించు వారు నన్ను చేరుదురు.

*వివరణము :* భగవద్గీతయందు, అంతర్బహిః వ్యాప్తిచెంది యున్న శాశ్వతమగు తత్త్వమును, సమస్తమునకు మూలముగను ఆధారముగను తెలుపబడినది. దానిని "నేను" అను ప్రజ్ఞగ దైవము పలికినాడు. అట్టి తత్త్వము నారాధించువారు తత్త్వదర్శనులై, తత్ పదమును చేరుదురు. అదియే పరమపదము. అట్టి పదము లోకములకు మూలమై యున్నది. సత్యలోకము, వైకుంఠము,

కైలాసము అను లోకములకు కూడ పరమై యున్నది. అట్టి పరమును బ్రహ్మపరమని, పరమ పదమని తెలుపుదురు. బ్రహ్మ విష్ణు మహేశ్వర లోకములు కూడ అందుండి ఏర్పడునవే. అట్టి లోకమును నిత్యమనుభవించువారు బ్రహ్మర్షులు. త్రిమూర్తులు సహితము అట్టి బ్రహ్మర్షులను గౌరవింతురు, పూజింతురు కూడ. ఈ పరమపదము లోకముల కతీతము. సమస్త జీవుల ఉనికికి మూలము. అందే అన్నీ ఇమిడియుండి కాలక్రమమున బయల్వెడలి, వృద్ధి చెంది, తిరోగమించి మరల అందులోనికే లయ మగుచుండును. ఈ పరమును చేరినవారు జనన మరణ చక్రమునకు అతీతమై శాశ్వతముగ యుందురు. వారికి కేవల మమరత్వమేగాక బ్రహ్మత్వము కూడ అందిన ఫలమై యుండును. అట్టివారు బ్రహ్మమై యుందురు. అగస్త్య వశిష్ఠ లట్టివారు.

పై తెలిపిన పరమపదమును పొందుట కారాధించవలసినది తత్త్వమునే. దైవమును అన్ని కాలములందు, అన్ని దేశములందు, అన్ని రూపములందు, అన్ని నామములయందు, అన్ని సన్నివేశ ముల యందు దర్శించుచు నుండుటయే మార్గము. ఎదురుగ నున్నది దైవమే. దూరముగ నున్నది దైవమే. లోపల ఉన్నది దైవమే. వెలుపల నున్నది దైవమే. అంతయు దైవమే. తాను కూడ దైవము యొక్క వ్యక్తరూపమే. ఇట్టి భావనతో సతతము జీవించువారికి క్షణక్షణము, అనుక్షణము దైవమును దర్శించుటయే యుండును.

ఇదియే అనన్యభావన, అనన్యచింతన, నిత్య అభియుక్తత మరియు పరిఉపాసన కూడ అయి యున్నది. ఇట్టివారు నిజమగు రాజయోగులు. వారు దైవమునందే చరించుచు, దైవమును దర్శించుచు, వినుచు, సేవించుచు యుందురు. దేహత్యాగా నంతరము అట్టి అపరిమితమగు తత్త్వమును స్థితిగొందురు.

ఇట్లు సర్వవ్యాపకము అగు తత్త్వము నారాధింపక ఏదో ఒక రూపమును, ఒక నామమును ఆశ్రయించి ఆరాధించువారు తదనుగుణమైన లోకములు చేరుదురు. ఇది సహజమే గదా! కాముకులు కామలోకము చేరుదురు. అధర్మము నాశ్రయించు వారు నరకమును చేరుదురు. భోగభాగ్యములకై దైవము నారాధించువారు భోగలోకములు చేరుదురు. ధర్మము నాచరించు వారు ధర్మముతో కూడిన క్షేత్రములను చేరుదురు. స్వర్గాది సౌఖ్యములను ఆరాధించువారు ఇంద్రలోకము చేరుదురు. భూత ప్రేత పిశాచముల నారాధించువారు అట్టి లోకములే చేరుదురు. నాగ దేవతల నారాధించువారు పాతాళము చేరుదురు. తమో గుణము ప్రధానముగ ఆరాధనము చేయువారు చీకటి లోకము లలో పడుదురు. అట్లే రజోగుణము నాశ్రయించి ఆరాధనములు చేయువారు అవిశ్రాంత లోకములు చేరుదురు.

ఆరాధనకు ఏ గుణదోష మేర్పడిన అట్టి దోషము గల లోకములలో పడుదురు. కనుకనే మోసము చేయువారి చుట్టును

మోసగించు వారుందురు. అహంకారుల చుట్టును అహంకారులే చేరుదురు. అసత్యభాషణు లందరును ఒక చోటనే గుమి కూడుదురు. అధికార దాహము గలవారు అధికారుల చుట్టును తిరుగుచుందురు. ధనాశగలవారు ధనవంతుల చుట్టును తిరుగు చుందురు. సదాచారము గలవారు సత్పురుష సమాశ్రయమున నుందురు. ఉగ్రరూపముల నారాధించువారు ఉగ్రులై వ్యథ చెందుదురు. ప్రసన్న రూపములను ఆరాధించువారు ప్రసన్న లోకములను చేరుదురు.

ఆరాధకుల భ్రమలను బట్టి, సంస్కారమును బట్టి, ఆరాధింప బడు వస్తువు పరిమితిని బట్టి, పరిమితము సంకుచితము అగు లోకములయందు జీవులు తిరుగాడుచు నుందురు. “యద్భావం తద్భవతి” అను వాక్యము సృష్టి యందలి శాశ్వత సత్యము. “ఏగూటి పక్షి ఆ గూటికే చేరును” అను శృతి వాక్యము తెలియని వారెవరు?

అపరిమితము, శాశ్వతము, లోకాతీతము అగు నన్ను స్మరించి నా పరమ పదమును చేరుమని భగవానుడు సూచించు చున్నాడు.

# 26

# భక్తి శ్రద్ధలు

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥ 26**

*తాత్పర్యము :* భక్తిపూర్వకముగ నాకు ఒక పత్రమునుగాని, పుష్పమునుగాని, ఫలమునుగాని, నీటినిగాని ఎవరందించినను నేను స్వీకరించి అనుగ్రహింతును.

*వివరణము :* ఆరాధనకుగాని, అనుసంధానమునకుగాని, యోగ సాధనకుగాని ప్రధానముగ వలసినది భక్తి. భక్తియున్నచోట హృదయము నిర్మలమై యుండును. మనసు పరిశుద్ధముగ నుండును. ఆరాధనయం దనురక్తి యుండును. అట్టి అనురక్తి ఎదుటి జీవునికి ప్రీతి కలిగించును. ఆ జీవుని యందలి దైవము నకు కూడ ప్రీతి కలిగించును. ఇట్లు జీవుల యందలి దైవమునకు ప్రీతి కలిగించురీతిలో ప్రవర్తించుట వలన దైవము ప్రీతి చెందును.

ఎవ్వరికైనను తాగు నీరిచ్చినపుడు, ఒక ఫలము నిచ్చునపుడు,

ఒక పుష్పము నిచ్చినపుడు లేక ఒక తులసీదళమో, మారేడు దళమో ఇచ్చినపుడు ఆ జీవుని యందలి ఈశ్వరుని దర్శించుచు జీవేశ్వరులకు ప్రీతికలుగునట్లుగ అందించవలెను. అట్లందించి నపుడు జీవుడేకాక అందలి ఈశ్వరుడు కూడ ప్రసన్నుడగును. భక్తితో సమర్పించుట అనగా ఎదుటిజీవుల యందలి ఈశ్వరుని కూడ దర్శనము చేయుచు, వినయముతో, శ్రద్ధతో రెండు హస్తములతో అందించవలెను. అట్టి శ్రద్ధ, వినయము, భక్తి లోపించినపుడు ఎంత విలువైన వస్తువు లందించినప్పటికి ఈశ్వరుడు ప్రీతి చెందడు. నిజమునకు ఈశ్వరునకు వలసిన దేమియు లేదు. ఎంత ధనముతో నైనను ఈశ్వరుని మెప్పించ లేము. ఈశ్వరుడు కోరినది భక్తి ధనమేగాని ధనము కాదు. ఈశ్వరుని బలముతో కూడ మెప్పింపలేము. భక్తి బలమే నిజమగు బలము. దానివలన ఈశ్వరుడు ప్రసన్నుడగును. అట్లే ఎట్టి విద్యలతోను కూడ దైవమును మెప్పించలేము. భక్తి విద్య యొక్కటే దైవమును మెప్పింపగలదు.

*సర్వేశ్వరుండగు శౌరి కింకరు సేయు*
*ధనమున్నదే భక్తిధనము కాక !*

*సర్వోపగతుడగు చక్రి బంధించెడు*
*బలమున్నదే భక్తిబలము గాక !*

*సర్వభోక్తను జలజాతాక్షు దనియించు*
*ఫలమున్నదే భక్తిఫలము గాక !*

*సర్వజ్ఞుడైన కేశవుని మెప్పించెడు*
*విద్య యున్నదె భక్తివిద్య గాక !*

*సర్వవరదుడైన శార్ఙ్గి సన్నిధిచేర్చు*
*పథము గలదె భక్తిపథము గాక !*

*కాన నితడు భక్తిగల వారలకె గాని*
*పరుల కగ్గమగునె పడతులార !!*

భక్తితో ఏమిచ్చినను దైవ మంగీకరించును. దైవమునకు సమర్పించుట యనగా జీవులయందలి ఈశ్వరుని దర్శించుచు, జీవులకు సమర్పించుటయే. అట్లు చేసినచో అది భక్తి నివేదన మగును. ఆడంబరములకుగాని, డంభమునకుగాని, అహంకార మునకు గాని, అశ్రద్ధకుగాని దైవము లొంగడు. కృష్ణతులాభారము, కుచేలోపాఖ్యానము, అంబరీషుని కథ- ఇట్టి ఉపాఖ్యానము లన్నియు భక్తిప్రాధాన్యతను ఆవిష్కరించుచున్నవి.

ఎవరికి ఏ పని చేసిపెట్టుచున్నను వారియందలి ఈశ్వరుని దర్శించుట వలన భక్తిప్రేమలు జనించును. అట్టి బుద్ధితో చిన్న పనియైనను, పెద్ద పనియైనను చేయవలెను. చిన్నవారికైనను,

పెద్దవారికైనను అదే విధమగు శ్రద్ధాభక్తులతో చేయవలెను. శ్రద్ధవలన జ్ఞానము, భక్తివలన అనుగ్రహము లభించును.

బ్రహ్మాండము లన్నియు తన కుక్షి (పొట్ట) యందే ఇముడ్చు కొనిన దైవమునకు ఎవడేమి ఈయగలడు? దైవమున కావశ్యకత ఏమున్నది? అతడు జీవుల ప్రేమకు, భక్తికి ఆనందించును. లోకము లందు కూడ తలిదండ్రులు పిల్లల నుండి ఆశించునది ప్రేమాభిమానములే గదా! అట్లే పరమాత్మ గూడను. దైవము కోరునది శ్రద్ధాభక్తులే. అతనికి శ్రద్ధాభక్తులు ఎట్లు సమర్పింప గలము? అతడు జీవుల హృదయము నందున్నాడు గనుక జీవులకు చేయు సేవ రూపమున తానందుకొనుచు నున్నాడు. కనుక భక్తులు, జ్ఞానులు, యోగులు, విరాగులు కూడ జీవుల రూపమున నున్న దైవమును సేవించి అనుగ్రహమును పొంద వలెను. ఇట్టి ప్రయత్నము నిరంతరము సాగుచు నుండవలెను.

ఈ శ్లోకమున సాధకులు "ప్రయతాత్మనః" అని దైవము ప్రయత్నము చేయువాని గూర్చి పలికెను. ఆ పదము ప్రయత్న శీలుని గూర్చి ఉద్దేశింపబడినది. ఆ పదమునకు నిర్మల అంతః కరణుడని కూడ అర్థమున్నది. కేవలము నిత్యము జీవుల సేవ చేయుట మాత్రము చాలదు. అట్టి ప్రయత్నము చేయువాని అంతఃకరణము నిర్మలమగుచుండవలెను. అంతఃకరణము లనగా లోమనస్సు, బుద్ధి, అహంకారము. జీవుల సేవ నిత్యము చేయు

చున్నప్పుడు పై మూడును నిర్మలము కావలెను. కేవలము బహిఃకరణములతో చేయు సేవ నిరుపయోగము. జీవసేవా కార్యము నిర్వర్తింపబడుచున్నకొద్ది ఋజువర్తనము, ధర్మాచరణము, బుద్ధి ప్రకాశము, నిరహంకారము ఆవిష్కరింపబడుచుండవలెను. అంతఃకరణ శుద్ధిలేని వానికి దైవానుగ్రహము ఎండమావి యందలి జలమువలె యుండును. నిర్మల అంతఃకరణుడై, భక్తిశ్రద్ధలతో ఎదుటి జీవియందు ఈశ్వరదర్శనము చేయుచు ఏమిచ్చినను ఈశ్వరుడు సంతోషింప గలడు. ఇది సత్యము.

(27)

## ఈశ్వరార్పణము

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27**

*తాత్పర్యము :* ఏ పని చేసినను, ఏమి భుజించినను, ఎట్టి హోమములు గావించినను, ఎట్టి దానము లొనర్చినను, ఎట్టి తపస్సులు చేసినను నా కర్పణము చేయుము.

*వివరణము :* ఇది భగవంతుని యొక్క నిర్దిష్టమగు సూచన. ఈశ్వరార్పణ బుద్ధితో జీవించమని ఈ సూచన సారాంశము. సమస్తమును ఈశ్వరుడే నడిపించు చున్నాడు. అతడే కర్త, అతడే భోక్త కూడాను. అతని ప్రేరణ వలననే గ్రహమండలములు, సూర్య మండలములు కూడ వర్తించుచున్నవి. ఈశ్వర సంకల్పము లేనిదే చీమ కూడ కదలదు. కార్యములందు సిద్ధి, అసిద్ధి కూడ ఈశ్వరాధీ నమై యున్నవి.

కొన్ని పనులు జరుగుచుండును. కొన్ని పనులు ఎంత ప్రయత్నించినను జరుగవు. అట్లే కొన్నిమార్లు ఫలము లభించును.

కొన్నిమార్లు లభింపదు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క రకముగ నుండును. ఒకరోజు పూజ, ధ్యానము బాగా జరిగినదనిపించును. మరునా డట్లనిపించదు. జీవితమందలి అన్ని విషయములందు వైవిధ్యము తారసిల్లు చుండును. ఒకనాడు ప్రేమించినవారు మరొకనాడు తటస్థులై యుండవచ్చును. పెంచిన పిల్లలే ఎదురు తిరగవచ్చును. పెంపుడు కుక్కయే కరవవచ్చును. ఏది, ఎప్పుడు, ఎక్కడ, ఎట్లు జరుగునో ఎవ్వరునూ ఊహించలేరు. ఓడలు బండ్లగుట, బండ్లు ఓడలగుట, ధనవంతుడు దరిద్రుడగుట, విద్యాహీనులు విద్యా వంతులను శాసించుట, మూర్ఖులు ప్రభువులగుట, ఆరోగ్య వంతులు అకస్మాత్తుగ తీరని అనారోగ్యమునకు గురియగుట ఇత్యాదివి జరుగుచు నుండును.

ఒకనాడు పోషకమగు ఆహారము మరియొకనాడు విషము కావచ్చును. ఇది ఇట్లు జరుగవలెను అని ఎవ్వరును శాసించలేరు. జరుగుచున్నది చూచుచు "ఓహో ఇట్లు జరుగుచున్నది గదా!" అని గమనించుటయే గాని చేయునదేమియు ఉండదు. సర్వము ఈశ్వరాధీనమని తెలిసి తన బుద్ధికి తోచినది, ఈశ్వరార్పితముగ దినమంతయు గడుపుటయే అర్పణ మార్గము లేక శరణాగతి మార్గము.

ఉదయము లేచినది మొదలు రాత్రి పరుండు వరకు జీవు డనేక కార్యములు తలపెట్టి నిర్వర్తించుచు నుండును. అందు

కొన్ని ఫలించును, కొన్ని ఫలించవు. కనుక జీవునకు తాను కర్తకాదని తెలియవలెను. ఈశ్వరుడే కర్తయని, జరుగునది, జరగనిది కూడ అతడి సంకల్పమే యని తన కార్యములను, తనను కూడ ఈశ్వరునికి సమర్పించుకొనుట నిజమగు పరిష్కారము. ఇట్టి భావన యందు జీవించువానికి కర్మఫల మంటదు. ఫలమెట్టి దైనను అదికూడ ఈశ్వరార్పితముగనే భావింపవలెను.

“నాహంకర్త, శ్రీహరికర్త” అను సూక్తి జీవితమున సత్యమై నిలువవలెను. నిజమునకు జీవుని ఉనికి దేవుని ఉనికియే. జీవుని ఎరుక దేవుని ఎరుకయే. అతనియందలి ప్రాణములు, పంచ భూతములు, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, సప్త ధాతువులతో కూడిన శరీరము అన్నియు దైవమిచ్చినవే. తాను కూడ దైవము యొక్క అంశయే. తానే సృష్టి నిర్మాణము గావించి, అనేకానేక దేహ నిర్మాణములు గావించి, వానియందు తానే జీవునిగ ప్రవేశించి క్రీడ చూపుచున్నాడు. తనవలెనే జీవులను కూడ ఆనందింపుడని సంకేతించు చున్నాడు. కనుక ఈ సమస్తము అతడిదే. మనము కూడ అతని పరివారమే. అంతేకాదు, అతని నుండి ఏర్పడిన మాయకూడ అతనిదే. కనుక అంతయు అతనికి సమర్పణ చేసి జీవించుట నిజమగు ఎరుక. అట్టి ఎరుక లేకుండుట వలన జీవుడు చిక్కుపడును. కనుకనే దైవము, తనకు సమర్పణ చేసుకొని జీవించమని అర్జునునకు బోధించుచున్నాడు.

దైవ సమర్పితముగ జీవించువారే దైవ విభూతిని పొంద గలరు. భగవద్భక్తుల కథ లన్నియు ఈ సత్యమునే సూచించును. దీనియందు పట్టు చిక్కుటకు అంతఃకరణ శుద్ధి ప్రధానమై యున్నది. లేనిచో అహంకారము పొటమరించి, చిక్కులపాలు చేయును. సమర్పణ మార్గము నిరహంకార మార్గము. నిత్య సత్వగుణ మార్గము. అట్టివారికి దైవమే తానుగ నున్నాడని నిత్యము స్ఫురణ యందుండును. వారి కథలే భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యము లకు పరాకాష్ఠ.

(28)

# సన్యాస యోగము

**శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబంధనైః ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి ॥ 28**

తాత్పర్యము : పై విధముగ సర్వమును నాకు సమర్పణ చేసుకొనిన వానికి పాపపుణ్య ఫలముల బంధము విడువబడును. నాతో సమ్యజ్ఞాన యోగమున సమస్తము నుండి విముక్తి చెంది నన్ను పొందినవాడగును.

వివరణము : ఈ శ్లోకమున ప్రధానముగ రెండు విషయ ములు భగవానుడు తెలియజేయుచున్నాడు.

1. సన్యాస యోగము. 2. కర్మబంధము నుండి విముక్తి. సన్యాస యోగమనగా కర్మఫలములను సన్యసించుట, కర్మము లను సన్యసించుట కాదు. కర్తవ్యకర్మలను నిర్వర్తించుచు అందుండి ఏర్పడు ఫలములను సన్యసింపవలెను. ఫలముల యందాసక్తితో కర్మము నిర్వర్తించువారు బద్ధులగుచునే యుందురు. కర్తవ్య కర్మలను నిర్వర్తింపకున్నచో కూడ బంధము లేర్పడును. నిర్వర్తించు నపుడు ఫలములందాసక్తి యున్నచో బంధము లుండును.

ఫలాసక్తి లేక నిత్యనైమిత్తిక కర్మలను నిర్వర్తించు చుండుటచే జీవుడు స్థితప్రజ్ఞు డగును. ఇదియే నిష్కామ కర్మయోగము లేక కర్మఫల సన్యాస యోగము.

ఫలముల యందాసక్తి లేక చేయవలసిన పనియందే శ్రద్ధా భక్తులు గలవారు క్రమముగ ఫల సన్యాసమేగాక సంకల్ప సన్యాసము గూడ నిర్వర్తింతురు. స్వంత సంకల్పములు గలవానికి, వానిని సిద్ధింపచేసుకొనవలెనను ఆకాంక్ష యుండును. దాని వలన కర్మబంధ మేర్పడు చుండును. స్వంత సంకల్పములు రజోగుణ దోషముచే కలుగుచు నుండును. అట్లు సంకల్పములు బలీయ ముగ లాగుచుండగ, కర్తవ్యము మరపునకు వచ్చును. కర్తవ్యము నిర్వర్తింప లేకపోవుట వలన, అనవసరపు కార్యములలో తల దూర్చుకొనుట వలన బంధములు పెరుగుచు నుండును. కనుక నిజమగు సన్యాసము రెండు విధములుగ నున్నది. మొదట సంకల్పములను సన్యసింపవలెను. పిదప కర్మఫలములను కూడ సన్యసింపవలెను. కర్తవ్యకర్మ నిర్వర్తించుచునే యుండవలెను. అట్టివాడే నిజమగు సన్యాసి. అట్టివాడే నిజమగు యోగి. ఇట్టి జ్ఞానము వలన విశిష్టమగు మోక్షస్థితి సద్యోఫలముగ నుండును.

కర్తవ్య కర్మయందు యజ్ఞము, దానము, తపస్సుకూడ భగ వానుడు చివరి అధ్యాయమున పేర్కొనినాడు. అనగా పర హితార్థము జీవించుట, అందివచ్చిన సంపదను దానము చేయుట, తన లోపల వెలుపల నిండియున్న ఈశ్వరునితో అనుసంధానము చెందుట కూడ కర్తవ్యములే అని తెలియవలెను. అట్టి కర్తవ్యము

లందు కూడ ఫలాసక్తి యుండరాదు. అట్టివాడు విముక్తుడగును. విముక్తి అనగా విశిష్టమగు ముక్తి. అట్టివాడే తనను చేరగలడని దైవము స్పష్టము చేసినాడు. ధీమంతు లెవరైనను ఇట్టిమార్గమున పయనింపవలెను. ఇతర మార్గములలో బంధవిమోచన ముండదు. ఇది సత్యము.

మరియొక విషయము. శుభకర్మలు శుభ ఫలముల నిచ్చు చుండును. అశుభ కర్మలు అశుభ ఫలముల నిచ్చుచుండును. పుణ్యకార్యములు చేయువారు పుణ్యఫలములచే బంధింప బడుదురు. పాపకార్యములు చేయువారు పాపఫలములచే బంధింపబడు చుందురు. ఫలాసక్తి లేకుండ కర్మ లాచరించుటయే నిజమగు మార్గము. దుష్కర్మ లెట్లు బంధించునో, సత్కర్మలు కూడ అట్లే బంధించును. కారణము ఫలాసక్తియే. తండ్రి ఆజ్ఞగా పరశురాముడు తల్లి శిరస్సును ఖండించెను. తల్లి శిరస్సు ఖండించుట దుష్కర్మ. తండ్రి ఆజ్ఞను పరిపాలించుట కర్తవ్యము. పరశురాముడు కర్తవ్యమునే నమ్మెను. తల్లిగదా యని ఉపేక్షించ లేదు. తండ్రియగు జమదగ్ని మహర్షితో వాదింపలేదు. కర్తవ్యమున మాత్రమే నిలబడెను. అట్లే దశరథ రాముడు కూడ కర్తవ్యమునే పాలించెను. ఫలము లాసింపలేదు. తమదగు సంకల్పములు కూడ చేయనివారు మహాత్ములు. ఆరంభ పరిత్యాగము వారి సహజ స్వభావము. ఇట్టి కర్మ స్వరూపము స్పష్టముగ తెలిసిన మానవునకు ఈ క్షేత్రము కురుక్షేత్రము గాను, ధర్మ క్షేత్రముగాను గోచరించును.

కర్తవ్యములు మనవద్దకు కాలము రూపమున, దేశము రూపమున నడచి వచ్చును. మన మేమియు ప్రత్యేకించి సంకల్పింప అవసరము లేదు. దరిజేరిన కర్తవ్యమును పాలించు టయే. ఫలముల యందాసక్తి అవసరము లేదు. అట్టి వానికి మోక్ష స్థితి తథ్యము. పుణ్యముకోసము పుణ్యకర్మ లాచరించువారు మోక్షమును పొందలేరని భగవాను డిచ్చట హెచ్చరిక చేయు చున్నాడు.

కర్మ స్వరూప స్వభావములు, అవి బంధించు విధానము మానవులకు తెలియవలెను. కర్తవ్యమెంత ప్రధానమో కూడ తెలియవలెను. సంకల్పించుట, ఫలములాసించుట విసర్జించ వలెను. అన్నియు ఈశ్వరున కర్పించి, ఈశ్వరాధీనముగ జీవిత మును నిర్వర్తించుకొనవలెను. దుఃఖము, కష్టనష్టములు ఎట్లు బంధించునో, సుఖములు భోగభాగ్యములు కూడ అట్లే బంధించును. ఇనుప పంజరములో నున్నను, బంగారు పంజరములో నున్నను బంధ మొకటియే. కావున బుద్ధిమంతుడు భగవానుడు పలికిన సన్యాస యోగ మవలంబించి, భగవంతునితో సదా కూడియుండుట నేర్వవలెను.

(29)

# అతీతస్థితి

**సమోఽహం సర్వభూతేషు న**
**మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా**
**మయి తే తేషు చాప్యహమ్ ॥ 29**

*తాత్పర్యము :* సమస్త భూతములయందు నేను సమముగ నున్నాను. నాకు ద్వేషింపతగు వారుగాని, ప్రేమింపతగు వారు గాని ప్రత్యేకముగ నెవ్వరును లేరు. వారియందున్న నన్ను సేవించు వారిని నేనునూ సేవింతును.

*వివరణము :* సమస్త ప్రాణికోటియందు ఉనికిగ నున్నది నేనే. నేనాధారముగనే అన్నిభూతములు ఉండుట జరుగుచున్నది. చైతన్యపరముగ జీవులయందు హెచ్చుతగ్గు లుండునుగాని, అందరి విషయమున ఉనికి ఒకటియే. దేవతలు ఉన్నారు. అసురులు ఉన్నారు. ఆదిత్యు లున్నారు. రుద్రు లున్నారు. ప్రజాపతు లున్నారు. వసువులున్నారు. రాయి రప్ప మొదలుకొని

అన్ని వర్గములందు జీవు లున్నారు. ఈ ఉండుట అందరికిని సమముగనే యుండును. ఇది భగవంతుని అస్థిత్వము. అన్నిటి యందు తాను సమముగనే యున్నాడు. కాని వారియందలి చైతన్యము ఉత్తమము అధమముగను, ధర్మము అధర్మముగను, వారి వారి పరిణతి బట్టి ఏర్పడుచుండును. స్థూలముగ జీవలోక మగు భూలోకము నుండి సత్యలోకము వరకు ఏడు లోకములుగా తెలుపవచ్చును. మరల ప్రతి లోకమునందు కూడ ఏడు ఉప లోకములను దర్శింపవచ్చును. అన్ని లోకము లందు పరమాత్మ ఒకే విధముగ నుండును. దుష్టుల యందు ద్వేషముగాని, శిష్టుల యందు ప్రీతిగాని యుండదు. 'ఉనికి'గ పరమాత్మ సర్వమునకు అతీతుడు. అట్టి ఉనికియే లేనిచో ఊర్ధ్వలోకములు లేవు, అధోలోకములు లేవు. ధర్మపరులు లేరు, అధర్మపరులు లేరు. ప్రళయమున తానొక్కడే ఉనికిగ యుండును. అంతయు తన యందు ఇమిడి యున్నది. సృష్టియందు కూడ పరమాత్మ ఒకడిగనే యుండును. అతడాధారముగ సృష్టి ఏర్పడుచు యుండును. ఉండుట లేకుండుట అనునవి చైతన్యమాదిగా గల లోకములకు, జీవులకుగాని పరమాత్మకు కాదు. స్థితి భేదము లన్నియు చైతన్యమునకే. ఇట్లు సదా తటస్థుడుగ నుండు దైవముతో అనుసంధానము చెందుట సమాధి స్థితిని సూచించును. సమాధి స్థితి ననుభవించినవారే పరమాత్మ నెరిగినవారు.

ప్రతివారును తాము న్నామని భావింతురు. తాముండుట ననగానేమో పరిశీలింపవలెను. తాముండుట ఎట్లు సంభవించి నదో విచారించవలెను. తాముండుట యనగా దైవమే తానుగ నుండుట. తామున్నట్లే పశుపక్ష్యాదులు, వృక్షములు, ఖనిజములు కూడ యున్నవి. ఉండుట విషయములో అందరును సమానమే. చీమ, దోమ నుండి చతుర్ముఖ బ్రహ్మవరకు ఉండుట సమానము. భేద మంతయు చైతన్యపరముగ నుండును. చతుర్ముఖ బ్రహ్మ చైతన్యము అతి విస్తారము. చీమ, దోమల విస్తారము అత్యంత పరిమితము. "సమోహం" అనగా సమ అహం - నేను సముడను అని దైవము పలుకుచున్నాడు. తానందరియందు రాగద్వేషములు లేక సమముగ నున్నాడని ప్రకటించుచున్నాడు. ఈ ఉండుటలో ఎట్టి భేదములేదు. భగవంతుని ఈ ఉనికి ఆకళింపైన బ్రహ్మజ్ఞుడు కూడ అందరి విషయమున సమముగనే యుండును.

ఉనికియే ప్రధానముగానుండు తత్త్వమును స్థాణువని, శివమని పలుకుదురు. అదియే సత్యము. ఆసత్య మాధారముగనే చైతన్య ముద్భవించి సృష్టిక్రియను గావించును. అట్టి శివునకు సురాసుర భేదము లేదు. సుర పక్షపాతము లేదు. అట్టి సత్య మును శివమును సుందరమును ఆశ్రయించి జీవించువారు పరమాత్ముని వలనే లోకాతీతులై వర్ధిల్లుదురు. దైవమును విశ్వ చైతన్య పరముగ చూచుట, అవగాహన చేసుకొనుట శక్యమేగాని తదతీతమై సత్యస్థితిని తెలియుట అరుదు. అట్లు తెలిసినపుడు

దైవమునకు ఇష్టులు అయిష్టులు ఉండరని తెలుయును. సత్యస్థితిలో శ్రీకృష్ణునికి పాండవ కౌరవులు ఇరువురును సములే. చైతన్యస్థితిలో ధర్మస్వరూపులైన పాండవులనిన ఇష్టము. సచ్చిదానంద స్వరూపుడైన శ్రీకృష్ణుడు చతుర్వ్యూహముల యందు చతుర్విధములుగ వర్తించుచుండును. ఎప్పుడెట్లు వర్తించునో ఎవ్వరునూ తెలియలేరు. వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ వ్యూహములలో అతడు చరించుచు అతీతముగను, సృష్టియందు ధర్మస్వరూపుడుగను, జ్ఞాన బోధకుడుగను, నిర్వాహకుడుగను-నాలుగు విధములుగను చరించును. అతడు 'సమోహం' అని పలికినపుడు అతని అతీత స్థితిని ఆవిష్కరించు చున్నాడు. కాలమును బట్టి, దేశమును బట్టి వివిధ వ్యూహములలో వర్తించుచు, ఎప్పటికప్పుడు సృష్టియందు ధర్మమును వర్తింప జేయును. సృష్టి కతీతముగను, సృష్టియందు కూడ ఏకకాలమున వర్తించు తత్త్వదర్శనమే కృష్ణ దర్శనము. ఎవరెంతమాత్రము తలచిన వారి కంతమాత్రముగనే గోచరించువాడు కృష్ణుడు. అతడే 'సమోహం' అని పలుకగలడు. గోవులకాచు గోపబాలకులను, గోలోక మందుండు సిద్ధపురుషులను ఒకే విధముగ ఆదరించిన వాడు శ్రీకృష్ణుడు. పరాక్రమవంతులను, పామరులను కూడ సమముగ ఆదరించినవాడు కృష్ణుడు. అంతయు తానే అగుట వలన, తనయందు తానెప్పుడు యుండుటవలన అట్టి పరమోత్కృష్ట స్థితితో 126 సం॥లు జీవించినవాడు శ్రీకృష్ణుడు.

(30)

## శ్రద్ధాభక్తులు

**అపి చే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః ॥ 30**

తాత్పర్యము *:* ఎంత దురాచారు డైనప్పటికిని అనన్య భక్తితో నన్ను సేవించునేని అతడు స్థిరమైన మనసును బొంది క్రమముగ సత్పురుషుడుగ తలంపబడుచున్నాడు.

వివరణము *:* 9వ అధ్యాయమగు ఈ రాజవిద్య పరమ పవిత్రమైనది. తనయందు, తన పరిసరములయందు నిండి యున్నది, దైవమే అని తెలియుట రాజవిద్య. దైవమే అనేకానేక మగు రూపాంతరములు చెంది వివిధ రూపములలో, వివిధ గుణములలో ప్రకాశించు చున్నాడని తెలియుట వలన భేదబుద్ధి లేక పరిసరములను తగురీతిగ సేవించుట యుండును. తల్లిగ గోచరించునది దైవమే. తండ్రిగ గోచరించునది దైవమే. గురువుగ గోచరించునది గూడ దైవమే. సోదర సోదరీమణులుగను, బంధువులుగను, మిత్రుడుగను, శత్రువులుగా కూడ గోచరించు

నది దైవమే. అట్లే పశువులుగను, పక్షులుగను, వృక్షములుగను, పర్వతములుగను, నదులుగను అన్నియు దైవమే. దైవము కాని దేదియు లేదు. అన్యమేదియు లేదు. అనన్యముగ దైవమే యున్నాడు. ఇట్టి సత్యము ఎవరి మనసున నిత్యము ఏర్పడునో అట్టివాడు స్థిరమతి యగును. అట్టి స్థిరమతికి అన్నిట, అంతట దైవమే గోచరించుచు నుండును. కనుక ఆ రూపమున నున్న దైవమును దర్శించి సేవించుట యుండును. ఇట్లు సేవించుట అభ్యాసమైనపుడు మనిషి సాధువగును. అతని ప్రవర్తనమునందలి సాధుత్వము దర్శించిన వారందరునూ అతనిని సత్పురుషునిగనే తలంతురు.

పై తెలిపిన రాజవిద్యయందు ఒకే ఒక సూత్రము తెలుపబడినది. అన్నిట అంతట, లోపల బయట దైవమును దర్శించుట. ఇది అందరికిని ప్రయత్నమున అందుబాటగు విషయము. పూజలు చేయుట, అభిషేకములు చేయుట, హోమములు చేయుట, యాగములు చేయుట- ఇత్యాదివి ఆవశ్యకత లేదు. మంత్రములు పేనుట (మరల మరల స్మరించుట), తంత్రశాస్త్రము నేర్చుకొనుట, యంత్రములను ధరించుట అవసరమే లేదు. వేద పారాయణములు, మండల దీక్షలు, తీర్థయాత్రలు, పుణ్యక్షేత్ర దర్శనములు అవసరము లేదు. ప్రదక్షిణములు, పర్వతారోహణ ములు ఇత్యాది శ్రమ దైవము తెలుపలేదు. చూచుటకు కన్ను

లున్నవి. వినుటకు చెవు లున్నవి. కనపడుచున్నది, వినపడుచున్నది దైవమే అని గుర్తుండిన చాలును. దీని వలన నిత్య స్మరణము, అనన్యచింతన సహజముగ నుండును. అట్టి వానికి సూటిగ దైవ సంబంధ మేర్పడును. తత్కారణముగ సాలోక్య, సామీప్య, సాయుజ్య, సారూప్యములు సిద్ధించును.

విపరీతమగు ఆచారకాండలు, సంప్రదాయములు, కట్టు బాట్లు అనెడి తామరతంపర లేమియు ఉండవు. దైవాను సంధానము సులభముగ తెరిపిగ యుండును. దైవాను సంధా నము ఎప్పుడునూ ఉండును. అట్లుండుటయే రాజయోగము. అందులకు మూలము రాజవిద్య. ఇట్లు సూటిగ దైవముతో మానవుడు అనుసంధానము చెందు విధానము ఉండగా, డొంక తిరుగుడు మార్గములలో శ్రమ పడుట వృథా.

యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడు తత్త్వ విచారమునకే ప్రాధాన్య మిచ్చెను గాని, ఆచారకాండకు అంత ప్రాధాన్యత ఈయలేదు. మరల ఈ కుంభ యుగమున బ్రహ్మమే దిగివచ్చి, మాస్టర్ సి.వి.వి. రూపమున ఇట్టి సులభము, సరళము, సూటియైన మార్గము నిచ్చెను. నియమములు నిబంధనల కన్న ఉన్నది దైవముగ చూచుట రాజవిద్య. దైవమును సర్వకాలముల యందు, సర్వ దేశములయందు, సర్వరూపములయందు, సర్వ నామముల యందు, సర్వసన్నివేశముల యందు దైవమును చూచుట,

వినుట, అనుభూతి చెందుట జరుగుచుండును. వేషభాషలకు గాని, కట్టుబొట్టులకుగాని ప్రాధాన్య మంతంత మాత్రమే.

పై తెలిపిన రాజవిద్యాసూత్రము అందరును పొందవచ్చును. దానిని నిర్వర్తించుకొనినపుడు జీవుని స్వభావము క్రమముగ సంస్కరింపబడి సాధుస్వభావ మగును. ఎంతటి దురాచారుడైనను ఈ సూత్రము శ్రద్ధా భక్తులతో పాటించినచో, సాధువై, సజ్జనుడై పరిసరములను సేవించుచు, శ్రేయస్సు కలిగించుచు దైవసాన్నిధ్య మును పొందవచ్చును. ఈ మార్గమున ఎందరో దురాచారులు శిష్టాచారులై వర్థిల్లిరి. దైవసాన్నిధ్యమును కూడ పొందిరి.

(31)

# అనన్య భక్తి

**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాంతిం నిగచ్ఛతి ।**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 31**

*తాత్పర్యము* : దురాచారుడు సాధువగుట, ధర్మాత్ముడగుట, శాశ్వతమగు శాంతిని పొందుట- అనన్య భక్తిచే శీఘ్రముగ జరుగును. గుర్తుంచుకొనుము. నా భక్తుడు ఎన్నడునూ చెడడు.

*వివరణము* : ఈ శ్లోకమున అనన్యభక్తి యొక్క ప్రాధాన్యతను విశేషించి భగవానుడు తెలుపుచున్నాడు. అన్య మేదియు లేదని, అంతయు దైవమే అని భావించు పామరుడైనను సహజముగ ధర్మ మార్గమున నడచును. శాంతిని పొందును. అంతయు దైవమే అన్న భావము స్థిరపడినవాడు సహజముగ అహింసను పాటించును. సత్యము ననుసరించును. పరధనములను, పరస్త్రీలను అపహరించడు. కృషి లేని లబ్ధి అంగీకరించడు. శుచి శౌచము కలిగి సంతోషముగ నుండును. సంతోషముకొరకై తాపత్రయ పడక సహజమగు సంతోష ముండును. అట్టి వాడింకెట్లు చెడిపోగలడు?

అందువలన నా భక్తుడు చెడిపోడని, ఇది ముమ్మాటికి సత్యమని భగవంతుడు అత్యంత స్పష్టముగ ప్రకటించుచున్నాడు.

అనన్య భక్తులకు సహితము కష్టనష్టములు కర్మవశాత్తు సంభవించవచ్చును. అయినను అతడు సత్య ధర్మములను వీడడు. పరధనములను, పరస్త్రీలను ఆశించడు. శుచి శౌచము ఎప్పుడునూ కలిగియుండును. అనన్యభక్తిని మించినటువంటి సాధన మరియొకటి లేదు. అట్టి భక్తునికి జ్ఞాన వైరాగ్యములు సహజముగ సిద్ధించును. అట్టి వారి నుండి భగవంతుడు మహత్కార్యములు నిర్వర్తించుచు నుండును.

అనన్యభక్తి క్రమముగ ప్రేమగ మారును. కబీర్‌దాసు, సూరదాసు వంటి మహాభక్తులు అనన్యభక్తి కారణముగనే అనేకానే కము లగు అద్భుతమగు కార్యములను నిర్వర్తించి చూపినారు. పుట్టు గ్రుడ్డియగు సూరదాసు కన్నులున్న వానివలెనే ప్రపంచమున తిరుగాడినాడు. అనన్యభక్తి కారణముగ ఎప్పుడునూ భగవంతునితో కూడియుండుట సంభవించును. తాను భగవంతుని యందు పూర్ణముగ చేరి యుండుటచేత భగవంతు డతని యందు పూర్ణ ముగ వసించి, ఇచ్ఛా జ్ఞాన క్రియలను నడుపుచు నుండును. భగవత్సంకల్పమే తన సంకల్పముగను, భగవద్ జ్ఞానమే తన జ్ఞానముగను, భగవత్ శక్తియే తన క్రియాశక్తిగను వ్యక్తమగు చుండును. తాను దైవము నందుండగ, తన నుండి దైవము

చూపుచున్న లీలలకు పరవశుడై, తన్మయము చెందుచు విశ్వ మును మరచి విశ్వజ్ఞుని యందు వర్తించును.

ఎందరో అనన్యభక్తి మార్గమున దైవమును చేరిరి. పరమ పదమున శాశ్వత స్థానము గొనిరి. వారికి మోక్షమును గూర్చిన చింతయే యుండదు. వారున్న స్థితియే మోక్షము. వారికి ప్రత్యే కించి సుఖశాంతులను గూర్చిన ప్రయత్నము లుండవు. వారెచ్చట యున్న అచ్చటే శాంతి యుండును. వారి రూపముననే సత్యము, సుఖము ఉండును. అన్ని విషయము లందాసక్తి గలవారు, వాని కొరకై ప్రయత్నించువారు సుఖశాంతులకు దూరమైపోవుచు నుందురు. తమయందు, తమ పరిసరములయందు స్థితిగొని యున్న దైవముతో కూడిన వానికి ఆ క్షణముననే సుఖశాంతులు కలుగును. శాశ్వత శాంతికి ఇట్టి ఉపాయములు లభించును. శాశ్వత సుఖము కూడ పొందుట కిదియే ఉపాయము. ఇతర మార్గముల శాశ్వత సుఖశాంతు లుండవు. "స శాంతి శాశ్వతి న ఇతరేషాం" అను ఈ సత్యమునే ఉపనిషత్తులు గూడ ధృవీకరించు చున్నవి.

ఇట్టి అనన్యభక్తి కలిగినటువంటి భక్తుడు ఎన్నటికిని చెడడు. దుర్గతిని పొందడు అని ఘంటాపథముగ భగవానుడు తెలుపు చున్నాడు. చిత్రకేతోపాఖ్యానము దీనికి చక్కని ఉదాహరణము. అనన్యభక్తుడై, విద్యాధరుడైనటువంటి చిత్రకేతువు కాలవశమున

జగన్మాత శాపమును పొందినను అతడు నాశము చెందలేదు. అంతేకాక ఇంద్రునకు నారాయణోపాసనమునకు మార్గదర్శకు డయ్యెను. అట్లే అనన్య భక్తుడుగ మారిన గజాసురుడు శాశ్వత శివ సాయుజ్యమున స్థిరపడెను. అదే విధముగ బలిచక్రవర్తి శాశ్వత సుఖశాంతులను పొందుచు, ధర్మాత్ముడై ధృవతారవలె భక్త తారాగణమున విరాజిల్లుచు నున్నాడు.

అనన్యభక్తులు కాలవశమున శాపగ్రస్తు లైనప్పటికిని వారి యందు ధర్మము లోపించదు. సుఖశాంతులు లోపించవు. వారెప్పటికిని నాశము చెందరు. వారేలోకము నందున్నను సుఖ శాంతులను, దైవ మహిమను ప్రసరింపజేయుచు స్వయం ప్రకాశకులై యుందురు. మట్టిలో నున్ననూ మాణిక్యము కాంతిని కోల్పోదు గదా! మాణిక్యముగనే యుండును. స్వామి అనన్య భక్తులు సత్యలోకము నుండి పాతాళము వరకు ఎచ్చటనైనను ఒకే స్థితిలో ప్రకాశించుచు నుందురు.

(32)

# తత్త్వదర్శనులు

**మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాంతి పరాం గతిమ్ ॥32**

*తాత్పర్యము :* అనన్యభక్తి మార్గమున నన్నాశ్రయించువారు నిశ్చయముగ నన్నే పొందుచున్నారు. అట్టివారు స్త్రీలైనను, వైశ్యులైనను, శూద్రులైనను అంతర మేమియు ఉండదు.

*వివరణము :* సంఘము నందు అనేకానేక దురాచారములు వర్తించుచు నుండును. దురవగాహన పాతుకొనిపోయి ఉండును. జన్మమును బట్టి సంఘమున శ్రేణులు ఏర్పడుచు నుండును. ఉత్తమ కులము, నిమ్న కులము అను భేదములు తరముల తరబడి జాతిని పీడించుచు నుండును. సభ్య సంఘములందు ఇట్టి అసభ్యవర్తనములు తాండవము చేయుచు నుండును. గుణమును బట్టి వర్ణాశ్రమ ధర్మములుండగ, జన్మమును బట్టి వర్ణాశ్రమ ధర్మములు నిర్ణయించుట కరడుగట్టిన అజ్ఞానము.

బ్రాహ్మణ క్షత్రియ పురుషులే మోక్షమున కర్హులనియు,

స్త్రీలు, వైశ్యులు, శూద్రులు, ఇతర జాతివారు అనర్హులనియు లోకమున అధికార వర్గములు స్థిరపరచి పామరులను కొల్లగొట్టు కొనుచు, జీవించుచు నుందురు. భగవద్గీత ఇట్టి సంఘ దురాచారమును ఎండగట్టును మరియు ఖండించును. జీవు లందరును దేవుని అంశలే. వారి కేర్పడిన దేహములు బట్టి వారి అర్హత, అనర్హత నిర్ణయము చేయుట దురాచారమేగాక, దురహంకారము కూడ.

ఎందరో స్త్రీలు, వైశ్యులు, శూద్రులు, నిమ్నజాతులవారు, ఆటవికులు కూడ పరమపదమును పొందిన ఉదంతము లున్నవి. మాంసపు దుకాణమును నిర్వర్తించెడి ధర్మవ్యాధుడు బ్రహ్మర్షియై నిలచినాడు. అడవిజాతికి చెందిన రత్నాకరుడను బందిపోటు దొంగ వాల్మీకి మహర్షియై నిలచినాడు. ఎందరో స్త్రీలు బ్రహ్మత్వ మును పొందిన కథ లున్నవి. ఇటీవలి కాలముననే బ్రహ్మ రూపిణిగ జిల్లెళ్లమూడి గ్రామమునందు అమ్మ ఎందరినో తరింప జేసినది. సూరదాసు, కాళిదాసు, కనకదాసువంటి భక్తులు సూటిగ దైవమును చేరిన కథ లున్నవి.

జీవుడు సహజముగ స్వయం ప్రకాశకుడు. అతడు దైవము నుండి ఏర్పడినవాడే. అతని చుట్టును మూడు గుణములచేత, ఐదు భూతములచేత, ఎనిమిది ఆవరణలు ఏర్పడి యున్నవి. ఆవరణ లెట్లున్నను అందున్నది జీవుడే. అతడు లోపల జ్యోతిర్

లింగమువలె వెలుగుచునే యుండును. దేవాలయము ఆవరణ లెట్లుండినను లోనగల జ్యోతిర్లింగము ఆరాధనీయము. అట్లే పై ఆవరణ లెట్లున్నను లోపల జీవుడు దైవముయొక్క దివ్య ప్రతి బింబమే. జీవులుగ అందరును దేవుని సంతానమే. ఆవరణలు ఆడంబరముగ నుండవచ్చును లేదా అతి సామాన్యముగ నుండ వచ్చును. శిథిలమైపోయి గూడ యుండవచ్చును. కాని లోపలి జీవుడు ఎప్పటికిని తేజోవంతుడే. బాహ్యావరణములు లోపలి జీవునికి అంతరాయము కలుగ నేర్చవు. అగ్ని స్వరూపుడగు జీవుని చుట్టును గల ఆవరణలు అగ్ని ప్రజ్వలనము కాకున్నప్పుడే ఆవరణ లుగ యుండును. అగ్ని జ్యోతనము జరిగినపుడు ఆవరణలు అవరోధములు కానేరవు. అనన్యభక్తి సాధనమున అగ్నిజ్యోతనము సులభముగ జరుగును. అట్టి వానికి దైవానుగ్రహము శీఘ్రముగ లభించును. అగ్ని స్వరూపుడగు జీవుడు స్త్రీయు కాదు, పురుషుడు కాదు. వైశ్యుడు కాదు. శూద్రుడు కాదు. అవియన్నియు ఆవరణ ములు. ఇట్టి ఆవరణముల కతీతమై జీవుడున్నాడు. అట్టి జీవుడు విజృంభించినచో ఆవరణములు వివశములై జీవుని అనుసరింప వలసినదే. అగ్నికి అవరోధము కలిగించున దేదియు లేదు. ఈ అగ్ని పంచభూతములలో అగ్ని కాదు. అది సహజమగు తేజస్సు.

పండితు లనుకున్నవారు, జ్ఞాను లనుకొనువారు ఆవరణ ములే చూతురుగాని, నిజమగు పండితులు, జ్ఞానులు అట్లు

చూడరు. నిజమగు జ్ఞానులు తత్త్వదర్శనులై యుందురు గాని, బాహ్యావరణలు చూడరు. అష్టవంకరలు ఆవరణములకున్నను లోపలి జీవుడు సముడే. అష్టావక్ర మహర్షి కథ అదియే. అతని బాహ్యావంకరలను చూచి హాస్యము చేసిన ఋషులు, రాజ ఋషులు అతనిచే భంగపడిరి. సృష్టి యందున్న బ్రహ్మమును చూచుట ఒకటి, బ్రహ్మము చుట్టును చేరిన ఆవరణలు చూచుట మరియొకటి. బ్రహ్మమును చూచువాడు బ్రహ్మమై యుండును. అనన్యభక్తి మార్గమున బ్రహ్మప్రాప్తి సత్యమై, నిత్యమై యుండును. అట్టి మార్గమునకు జాతి కుల మత భేదములు లేవు. అట్టి సత్యమిచ్చుట ప్రతిపాదింపబడు చున్నది.

(33)

## కూడి యుండుట

**కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయ స్తథా ।**
**అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్ ॥ 33**

తాత్పర్యము : అన్ని జాతులవారును అనన్యభక్తి మార్గమున నన్ను పొందగలిగినపుడు పుణ్యాత్ములగు బ్రాహ్మణులు, భక్తులగు రాజర్షులు కూడ నన్ను పొందగలరని వేరుగ చెప్పనవసరము లేదు గదా!

ఈ లోక మనిత్యము. ఇందు సుఖము లేదు. కావున నన్ను సేవించుచు ఆనందము పొందుము.

వివరణము : ముందు శ్లోకమున బ్రాహ్మణ క్షత్రియులను గూర్చి భగవానుడు పలుకలేదు. అనన్య భక్తి మార్గమున అందరును తన్ను చేరవచ్చని పలికినాడు. కనుక బ్రాహ్మణులు, క్షత్రియులు అదే మార్గమున తనను పొందవచ్చని వేరుగా చెప్పనవసరము లేదని తెలుపుచున్నాడు.

బ్రాహ్మణ క్షత్రియులకు విశ్వాత్మకుడగు దైవమును చేరుటకు

వలసిన అవకాశము ఉన్నను వారి అహంకారమే వారిని పరమ గతికి చేరనీయదు. నేను బ్రాహ్మణుడనని, నేను క్షత్రియుడనని ఈ జాతుల వారికి అహంకారము మెండుగ నుండును. మేధస్సు ఉన్నను అహంకారముండుట చేత వీరు అన్నిట అంతట యున్న దైవమును దర్శనము చేయుటకు శ్రమించవలసి యున్నది. ఏ జీవునికైనను తననుగూర్చిన భావము మెండుగ నున్నపుడు దైవమును చేరుటకు తానే అడ్డంకిగ నుండును. మేధస్సు కారణ ముగ జ్ఞాన సముపార్జన చేసి అహంకారు లగుట వీరికి గల అపాయము. కనుక ఈ ఇరువురికిని పరమును చేరుట ఎంత సులభమో, అంత కష్టము కూడ. ఇదియొక విచిత్ర స్థితి. వీరు ప్రధానముగ జయింపవలసినది వారి అహంకారమునే. వారికి అహంకారము తొలగుటకు వారు నిర్వర్తించవలసినది జీవుల సేవ. జీవుల సేవ చేయుచున్నను వారియందలి దైవమును దర్శింప లేకపోవుట వలన సేవ చేయుచున్నామను అహంకారము తెలియకయే పెరుగుచుండును. జ్ఞానబలముచేత, అధికార బలముచేత వీరు పరిసరముల యందున్న దైవమును విశ్వసింతురు. దైవము పేరనే దశాబ్దముల తరబడి కార్యములు చేయుచున్నను వీరు నిరహంకారులగుట అంత సులభము కాదు. తోటి జీవులను నిరసించుట, నిందించుట, మాటలతో బాధ పెట్టుట, తమవారి కష్టనష్టములను గుర్తింపకుండుట వీరి యందలి బలహీనత. సమాన ధర్మము వీరికి పరీక్ష వంటిది. సమ

వర్తనము దుర్లభము. అసహనము, ఆగ్రహము పిలవని పేరంట ముగ పొటమరించు చుండును. కనుక వీరిరువురిని గూర్చి దైవము ప్రత్యేకముగా పలికినాడేమో!

గోపికలకు, గోపబాలకులకు దర్శనమైన రీతిలో బ్రాహ్మణ క్షత్రియులకు కృష్ణ దర్శనము కాలేదు. ఇది ప్రత్యక్షముగ శ్రీకృష్ణుని జీవితమున చూడవచ్చును. జ్ఞానులగు బ్రాహ్మణ క్షత్రియుల కన్న పామరులగు ఇతర భక్తులే దైవమునకు చేరువైనారు. సంఘమున అధికారముగల వారికి అహంకారమను క్రీనీడ పనిచేయును. వారు ఎప్పటి కప్పుడు అహంకారమును తొలగించుకొనుచు నుండ వలెను. ఇతరులకీ సమస్య తక్కువ. కాని వీరు కూడ సర్వాత్మకు డగు దైవమునుండి ఏర్పడిన వారే కనుక, వీరును దైవమును తప్పక చేరగలరు.

ఈ శ్లోకమున మరియొక సత్యమును దైవము ప్రకటించి నాడు. "ఈ లోకము అనిత్యము, అసుఖము. కావున నన్ను సేవించుచు నాతో యుండుము" అని తెలిపినాడు. లోకము నందలి లోకులు సంబంధములు బంధములు పెంచుకొను చుందురు. నా ఇల్లాలని, నా కుమారుడని, నా బంధువులని, నా మిత్రులని భావించుచు సేవ చేయుచునుందురు. కాని ఋణము తీరిన వెంటనే సంబంధము లదృశ్యమగును. ఒకనాడాప్తులుగ నున్నవారు మరొకనాడు దూరమగుచు నుందురు. దూరమైన

వారిని గూర్చిన ఆరాట ముండునే గాని, వారంతగ ప్రతిస్పందించరు. తానిష్టపడిన వారందరును వారికిష్టమైన వారితో మెలగుచు నిరాశ, నిస్పృహ కలిగింతురు. ఈ సంబంధములు శాశ్వతము కాదని తెలిసియు జీవుడారాటపడుచు సుఖమును కోల్పోవును. సంబంధ బాంధవ్యములు నీటి మీద వ్రాతలవలె ఏర్పడుచు, అదృశ్య మగుచుండును. వాటిని గూర్చిన భావన అసుఖమునే ఇచ్చును. అంతేకాదు అవి అనిత్యములు కూడ. ఒకప్పటి తండ్రి తాతలు ఇప్పుడు లేరు. అట్లే కొంతకాలమునకు మన మీలోకము నుండి నిష్క్రమించి మరల ప్రవేశించునపుడు ఆత్మ సంబంధము లేమియు గుర్తురావు. అంతయు నూతనముగ నుండును. కనుక సంబంధ బాంధవ్యములు అసుఖమే గాక అనిత్యము గూడ. అయినను మాయాబద్ధుడగు జీవుడు వీనితో పెనుగులాడుచు నుండును.

అట్లుకాక అందరి యందుగల పరమాత్మను గుర్తించి, దర్శించి, సేవించుచు నున్నచో అతడు నిత్యమున్నాడు గనుక అతనితో సంబంధము నిత్యమై యుండును. సుఖమై యుండును కూడ. పరిసరముల యందలి జీవుల యందున్నటువంటి ఈశ్వరునితో అనుబంధ మేర్పడినచో జీవులు మారినను ఈశ్వరుడు మారడు. ఈశ్వరుడు నిత్యబంధువై శాశ్వతమగు మిత్రుడై తోడుగ ఎల్లప్పుడును యుండును. మనముండుట యనగ ఈశ్వరు డుండుటయే గనుక ఈశ్వరునితో కూడియుండుట వలన శాశ్వత సుఖ మేర్పడును. అతని ప్రేమ కూడ నిత్యము, శాశ్వతము.

అహర్నిశలు మనను అంటిపెట్టుకొని యున్న ఈశ్వరుని చింత మాని, ఇతర చింత యందుండువారు సుఖపడలేరు. కనుక తనతో కూడి యుండుమని దైవము అమిత వాత్సల్యముతో పలికినాడు. ఇతరములతో కూడినచో సుఖమంతంత మాత్రమే అని హెచ్చరించినాడు.

(34)

## జీవేశ్వర సంబంధము

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మా మేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥ 34**

*తాత్పర్యము :* మనసున నన్నే భావింపుము. అందరి యందు నన్నే దర్శించి సేవింపుము. నన్ను దర్శించుచునే ఎదుటి వానికి నమస్కరింపుము. అన్ని అవస్థల యందు నన్నే కూడి యుండుము. అపుడు నీవు నేనుగ, నేను నీవుగ ఏకమై యుందుము.

*వివరణము :* భావమునందు, బాహ్యమునందు ఈశ్వరుని దర్శించుచు నుండుట రాజవిద్య. లౌకికమగు సంబంధములు గుర్తించుట కన్న అలౌకికము శాశ్వతము అగు సంబంధము గుర్తించుట శాశ్వతత్వము నిచ్చును. మనస్సున అనేకానేకమగు, వైవిధ్యమగు భావములు చెలరేగుచు నుండును. భావించుట మనసు ప్రధాన లక్షణము. ఇతర భావనలు, చింతనలు దైవ భావముతో అరికట్టవచ్చును. మనసు దైవమును భావించుట

నిజమగు మననము. బయట కనపడుచున్నది దైవమే అని భావించుట కూడ మననమే. ఇట్లు లోపల బయట దైవమునే భావించుట అభ్యసించినపుడు మనస్సునకు ప్రశాంతత చిక్కును. అట్టి మనసుతో పరిసరము లందలి జీవుల రూపమున నున్న ఈశ్వరుని సేవించుట వలన మనసున పట్టుచిక్కును. ఎట్టి ఆరాధనలు చేయుచున్నను ఈశ్వరు నుద్దేశించియే చేయు చుండుట వలన భావమున ఈశ్వరుడే నిలచును.

ఎవరికైనను తను నమస్కరించు చున్నపుడు వాని యందలి ఈశ్వరునికే నమస్కరింపవలెను. అట్లే ఎవరైనను తనకు నమస్క రించు చున్నపుడు తనలోని ఈశ్వరునికే నమస్కరించు చున్నాడని పూజ్యభావము కలిగి యుండవలెను. తనకు నమస్కరించు చున్నారని మోహపడరాదు, గర్వపడరాదు. ఇట్లు సమస్తమగు ప్రవర్తనముల యందు ఈశ్వరునే దర్శించుట సేవించుట దిన చర్యగ సాగినపుడు క్రమముగ సమస్తమందలి ఈశ్వరునితో తన కనుబంధము పెరుగును. ఈశ్వరునికి కూడ తాను చేరువగును. ఇట్లొకరియందొకరికి అవినాభావ సంబంధము పెరుగుచుండగ ఈశ్వరుడు అనుగ్రహించి జీవుని యందు అవతరించును. జీవుడీశ్వరుడై వెలుగును. గురువు శిష్యుడై, శిష్యుని గురువును చేయుట, తండ్రి కుమారుడై, కుమారుని తండ్రిగ చేయుటవలె జీవేశ్వర సంబంధమున ఈశ్వరుడే జీవుని నుండి ప్రకటించు కొనుచు, జీవుని ఈశ్వరునంత వానిగ మలచును.

"నాకు నమస్కరించిన వానిని నా అంత వానిగ చేయుదును" - *ప్రణత నిజజనాన్ స్వాత్మ తుల్యాన్ కరోతి* అనునది రాజగుహ్యమగు రాజవిద్య. ఇదియే రాజయోగము.


*శ్రీమద్భగవద్గీత యందలి 9వ అధ్యాయము*


*'రాజవిద్యా రాజగుహ్య యోగ' వివరణము*

*సంపూర్ణము.*

# ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

ఓంకారనాదము వినబడుటయే ఓంకార ఉచ్చారణమునకు సిద్ధి. ఓంకారము ఏకాక్షరముగ పరబ్రహ్మము. ద్వయాక్షరిగ ప్రకృతి పురుషులు. త్రయాక్షరిగ త్రిమూర్తి తత్త్వము. ఓంకారమునందే భూత భవిష్యత్ వర్తమానములున్నవి. ఓంకారము నందే మూడు వేదములున్నవి. ఓంకారమే కర్త కర్మ క్రియ. నామము రూపము లేని భగవతత్త్వమునకు ఓంకారము ప్రథమనాదము. అందలి నాదము ప్రథమ రూపము. భగవంతుని ప్రప్రథమ నామ రూపములు ఓంకారముగ ఋషులు దర్శించిరి.

ISBN 978-81-89467-94-4

9 788189 467944 >

ధనిష్ఠ